అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 16-3-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 74 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

చైనా ఎన్నటికీ సోషలిజాన్ని వీడదు...

ప్రజలే మొదటి ప్రాధన్యతగా చైనా ఆధునీకరణ

- ప్రపంచ రాజకీయ పార్టీల సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్
- సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా 530 పార్టీలు



న్యూఢిల్లీ : చైనా ఎన్నటికీ సోషలిస్టు విధానాన్ని విడనాడదని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ స్పష్టం చేశారు. బుధవారం చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) ఆధ్వర్యంలో "ప్రపంచ రాజకీయ పార్టీలు-ఆధునికీకరణ మార్గాలు" అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా 530 పార్టీలు పాల్గొనగా జీ జిన్‌పింగ్ ...5లో



పార్లమెంట్ టు ఈడీ

ప్రతిపక్షాల మార్చ్... అడ్డుకున్న పోలీసులు

- పార్లమెంటులో మూడో రోజూ అదే తీరు
- అధికార, ప్రతిపక్షాల ఆందోళనతో ప్రతిష్టంభన

న్యూఢిల్లీ : అదానీ-హిండెన్‌బర్గ్ అంశంపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తూ, అధికార బీజేపీ రాజకీయ లక్ష్యాల కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ 18 ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయానికి ప్రదర్శన చేపట్టారు. ఈడీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించిన ఈ ర్యాలీని ఢిల్లీ పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు.

పార్లమెంట్ నుంచి బయటకు వచ్చిన నేతలను విజయ్ చౌక్ వద్ద భారీగా ఏర్పాటుచేసిన బారికేడ్లతో నిలువరించారు. 144వ సెక్షన్ అమలులో ఉందనీ, ఇక్కడ ఎలాంటి ఆందోళనలకు అనుమతి లేదనీ, ప్రదర్శన ముందుకు కదలడానికి వీలులేదంటూ అడ్డుకున్నారు. ఢిల్లీ పోలీసుల భారీస్థాయి బలగాల మోహరింపుతో ప్రతిపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ 'అదానీ అంశంపై ఈడీ డైరెక్టర్‌ను కలిసేందుకు మేం బయలుదేరాం. కానీ మేం వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతించలేదు. ఇది చాలా పెద్ద కుంభకోణం. ఆ గ్రూప్‌లో ఎల్ఐసీ, ఎస్‌బీఐ, ఇతర బ్యాంకుల పెట్టుబడులున్నాయి. ప్రభుత్వ ఆస్తుల కొనుగోలుకు ప్రభుత్వమే ఒక వ్యక్తికి డబ్బు ఇస్తున్నది. గతంలో కొద్దిపాటి వ్యాపారాలు ఉన్న వ్యక్తి అనూహ్యంగా రూ.13 లక్షల కోట్లకు ఎలా ఎగబాకాడు? ఇది ఎలా సాధ్యం? ఎవరు డబ్బు ఇస్తున్నారు? మోడీకి, అదానీకి మధ్య ఉన్న సంబంధం ఏంటి? ఈ విషయాలు తెలుసుకోవడానికి ప్రయత్నించిన ప్రతిపక్ష నేతల గళాన్ని అణచివేస్తున్నారు' అని విమర్శలు గుప్పించారు. తాము 200 మంది ఎంపీలం ఉన్నామనీ, కానీ పోలీసులు 2,000 మంది ఉన్నారని విమర్శించారు. తమ గొంతును నొక్కేస్తున్నారనీ, మళ్లీ వారే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారని ఆరోపించారు.

అలాగే కేంబ్రిడ్జిలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదని ఖర్గే స్పష్టం చేశారు. రాహుల్ నుంచి క్షమాపణ డిమాండ్ చేస్తున్నవారు, గతంలో ...5లో

ఏఈ పరీక్ష రద్దు

టీఎస్‌పీఎస్సీ నిర్ణయం

- ఇంకా ఎన్ని పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకయ్యాయో?
- అభ్యర్థుల్లో వీడని ఉత్కంఠ
- మూడోరోజు టీఎస్‌పీఎస్సీ ముట్టడి ఉద్రిక్తం
- సమగ్ర విచారణ జరపాలి : సీపీఐ(ఎం)
- నిందితులను కఠినంగా శిక్షించాలి : ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ
- హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : ఏబీవీపీ
- లీకేజీలో ఏ2 రాజశేఖర్‌రెడ్డి బీజేపీ కార్యకర్త
- ఆధారాలు బయటపెట్టిన బీఆర్ఎస్ నాయకులు

రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ శాఖలకు చెందిన విభాగాల్లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) పోస్టులకు ఈనెల ఐదో తేదీన నిర్వహించిన పరీక్షా ప్రశ్నాపత్రం లీకైనట్టు పోలీసుల విచారణలో తేలిందని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. దీంతో ఏఈ పరీక్షను రద్దు చేస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 14న ఏఈ పరీక్ష లీకైనట్టు సెంట్రల్ క్రైం స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైందని పేర్కొన్నారు. అన్ని వివరాలు పరిశీలించిన తర్వాత ఆ పరీక్షను రద్దు చేస్తున్నామనీ, పరీక్ష నిర్వహణ తేదీని త్వరలో ప్రకటిస్తామనీ వివరించారు. అయితే అభ్యర్థుల్లో ఉత్కంఠ వీడడం లేదు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఏఈతోపాటు ఇంకా ఎన్ని పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు లీకయ్యాయోనని ఆందోళనకు గురవుతున్నారు. ఇంకోవైపు టీఎస్‌పీఎస్సీలో ఉద్యోగం చేస్తూనే ఏ1గా ఉన్న ప్రవీణ్‌కు 103 మార్కులు ఎలా వచ్చాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లీకేజీకి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏబీవీపీ ముట్టడించాయి. దీంతో మూడోరోజూ అక్కడ పరిస్థితి అట్టుడికింది. ఆందోళన చేపట్టిన వారిని పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. లీకేజీపై సమగ్ర విచారణ చేయాలంటూ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఇదిలావుండగా బుధవారం మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ప్రశ్నాపత్రం లీకేజీలో ఏ2గా ఉన్న అట్ల రాజశేఖర్‌రెడ్డి బీజేపీ కార్యకర్త అంటూ ఆధారాలతో సహా బీఆర్ఎస్ నాయకులు బయటపెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఇది బీజేపీ కుట్ర అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రకటించింది. రిక్రూట్‌మెంట్‌ను ఆపడానికి బీజేపీ చేసిన కుట్ర అంటూ ...5లో

అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి : సీపీఐ(ఎం)



అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) ప్రశ్నాపత్రాల లీకేజీలో టీఎస్‌పీఎస్సీ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఆశతో ఎదురుచూస్తున్నారని ...5లో

సమగ్ర విచారణ జరపాలి : ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ



సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. బుధవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించాయి. టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించిన నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, ...5లో

రాజశేఖర్‌రెడ్డి బీజేపీ క్రియాశీల కార్యకర్త



ప్రశ్నాపత్రం లీకేజీలో ఏ2గా ఉన్న రాజశేఖర్‌రెడ్డి బీజేపీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఎన్నికల్లో బీజేపీ తరపున అతడు ప్రచారం చేసినట్టు తెలుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు, బీజేపీకి రాజకీయంగా లాభం చేకూర్చేందుకే ప్రశ్నాపత్రం లీకేజీకి పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఈడీ నోటీసులు రద్దుచేయాలి

సుప్రీంకోర్టులో కవిత పిటిషన్

- దీనిపై 24న విచారణ
- థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తోంది : పిటిషన్‌లో కవిత

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కేసులో విచారణకు హాజరుకావాలని ఈడీ ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.కవిత అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. ఈ నేపథ్యంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. కానీ ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ నెల 24న విచారణ చేపడతామని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహలతో కూడిన ధర్మాసనం ముందు కవిత తరపున న్యాయవాది వందన సెహెగల్ బుధవారం ప్రస్తావించారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించాలని కోరారు. ఒక మహిళను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయానికి పిలవడం సరికాదని అన్నారు. ఇది పూర్తిగా ...5లో

అదానీపై విచారణ జరపాల్సిందే...

కాంగ్రెస్ చలో రాజ్‌భవన్

- గాంధీభవన్ నుంచి ప్రదర్శన
- అడ్డుకున్న పోలీసులు...వాగ్వాదం...
- ఖైరతాబాద్ చౌరస్తాలో నేతల అరెస్టు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అదానీ షేర్ల పతనంపై పార్లమెంటరీ కమిటీ వేయాలని, క్రోని క్యాపిటలిజానికి వ్యతిరేకంగా ఏఐసీసీ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని చేపట్టింది. గాంధీభవన్ నుంచి రాజ్‌భవన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఖైరతాబాద్ చౌరస్తాలో ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు రోడ్డుకు అడ్డంగా పెట్టారు. ఈ సందర్భంగా నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మోడీకి, అదానీకి వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలంటూ నినదించారు. ఎల్ఐసీని రక్షించుకుందామంటూ నాయకులు నినదించారు. ఈక్రమంలో నాయకులను అరెస్టు చేసి పంజాగుట్ట, గోషామహల్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యవస్థలను ఏర్పాటు చేసి నవభారత నిర్మాణం చేసిందన్నారు. మాయమాటలు ...5లో

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మొదటిరోజు 23,198 మంది గైర్హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటిరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1కు 5,05,625 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారిలో 4,82,427 (95.42 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 23,198 (4.58 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మొదటి రోజు సీ సెట్ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశామని తెలిపారు. నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇంటర్ బోర్డు పరిశీలకులు పర్యటించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారని పేర్కొన్నారు.

బీజేపీది మహిళా వ్యతిరేక పాలన



వివరాలు 2లో..

మోడీ మహానటనకు.. ఆస్కార్ వస్తుండే

ఆయన మాటలు కోట్లల్లో.. చేతలు పకోడీల్లో..

- దోస్తుతో కలిసి దేశాన్ని దోస్తుండు..
- మోడీ, ఈడీలకు భయపడబోం..ప్రజాకోర్టులోనే తేల్చుకుంటాం : కేటీఆర్



పిట్లం సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

"ఆర్ఆర్ఆర్ సినిమాలో నాటు-నాటు పాటకు ఆస్కార్ అవార్డు వచ్చింది. కానీ మనదేశంలో అద్భుతమైన మహానటుడు ఒకాయన ఉన్నాడు. ఆయన పేరును ప్రతిపాదిస్తే ఆ నటనకు తప్పకుండా అవార్డు వచ్చేది' అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోడీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ సెటైర్లు వేశారు. "ఆయనెవరో మీకు యాది ఉన్నాడా" అని కేటీఆర్ ప్రశ్నించగానే సభకు హాజరైన జనం నుంచి మోడీ అంటూ గట్టిగా వినిపించారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం జక్కాపూర్ గ్రామ శివారులో రూ.478 కోట్లతో నాగమడుగు ఎత్తిపోతల పథకం నిర్మాణానికి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంత్రి కేటీఆర్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

'భాయి ఔర్ బహేనో.. జన్ ధన్ ఖాతా కోలో.. ధన్ ధన్ ఖాతమే పంద్రా (రూ.15లక్షలు) లాక్ అయ్యేగా' అని ప్రధాని మోడీ అన్నాడని, ఇక్కడున్న మీలో ఎవరి ఖాతాలోనైనా రూ.15 లక్షలు పడ్డాయా అని ప్రశ్నించారు. లేదు లేదు అంటూ జనం చేతులు చూపారు. ఆ రూ.15 లక్షలతో ...5లో



అచ్ఛేదిన్ కాదు.. చచ్చేదిన్...

ఎనిమిదిన్నరేండ్ల మోడీ పాలనలో ధరలు ఆకాశానికి



- ప్రజల ఆదాయాలు పాతాళానికి
- వంట గ్యాస్ ధర రూ.399 నుంచి రూ.1,150కి ఎగబాకిన వైనం
- లీటర్ పెట్రోల్ ధర రూ.71 నుంచి రూ.109కి...
- ఉప్పు, పప్పులతో సహా అన్ని రేట్లదీ అదే తీరు

బివిఎన్ పద్మరాజు

దేశానికి అచ్ఛేదిన్ (మంచి రోజులు) తీసుకొస్తామంటూ నమ్మబలికి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఏలుబడిలో పెరిగిన ధరలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అచ్ఛేదిన్ మాటేమోగానీ... ఇప్పుడు జనాలకు చచ్చేదిన్ దాపురించాయి. ఘనత వహించిన ప్రధాని మోడీ ఎనిమిదిన్నరేండ్ల పాలనలో కాదేదీ పెంపునకు అనర్హమన్నట్టు... ఉప్పు, పప్పులు, నూనెలు, ఇలా ఒకటేమిటి అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలను పెంచేసి ప్రజల నడ్డి విరిచారు. కరోనాతో ఉద్యోగాలు, ఉపాధి కోల్పోయి నడి రోడ్డులో నిలబడ్డ జనానికి... పెరిగిన ధరలు మరింత పెనుభారంగా మారాయి. వంట గ్యాస్‌తోపాటు పెట్రోల్, డీజిల్ ధరలు అంతకంతకూ పెరగటంతో వాటి ప్రభావం సరుకు రవాణాపై పడి, ఇటు కూరగాయలు, అటు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి. వివరాలు 2లో..

78 సార్లు పెట్రోల్.. 76 సార్లు డీజిల్

మోడీ హయాంలో ధరా ఘాతం ఎంతగా ఉందనే దానికి పెట్రోల్, డీజిల్ రేట్లను ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఒక్క 2021లోనే 78 సార్లు పెట్రోల్ ధరలు, 76 సార్లు డీజిల్ ధరలు పెరిగాయి. ఆ ఒక్క ఏడాదే కాదు అంతకుముందు, ఆ తర్వాత కూడా ఇష్టారీతిన పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచుకుంటూ పోయారు. అంతర్జాతీయ చమురు మార్కెట్ రేట్లకు అనుగుణంగా ప్రతీరోజూ పెట్రోల్, డీజిల్ ధరలను మార్చుకునేందుకు వీలుగా 2017 నుంచి దేశంలో 'డైనమిక్ ప్రైసింగ్ పాలసీ'ని అమలు చేయటం వల్ల వాటి ధరలు విపరీతంగా పెరిగి జనం జేబులను గుల్ల చేస్తున్నాయి. ఇదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గిన సందర్భంలో సైతం దాన్ని పరిగణనలోకి తీసుకోకుండా 'పెంచుడే తప్ప తగ్గించుడు లేదు...' అన్నట్టు కేంద్రం వ్యవహరిస్తుండటం గమనార్హం. అయితే వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల జరిగిన సందర్భాల్లో మాత్రం నామ్ కే వాస్తేగా ఏడెనిమిది సార్లు తగ్గించి... ఆ తర్వాత 70, 80 సార్లు పెంచుకుంటూ పోయారు. ఇదీ మోడీ సర్కార్ మేజిక్కు



తెలుగు కీర్తి విశ్వవ్యాప్తం...

'విశ్వ సినీయవనిక మీద ఒక తెలుగు సినిమా సత్తా చాటుతూ, ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డును గెలుచుకోవడం తెలుగువారిగా మనందరికీ గర్వకారణం... ఆస్కార్ అవార్డు పొందిన 'నాటు నాటు' పాటలో పొందుపరిచిన పదాలు... తెలంగాణ సంస్కృతికి, తెలుగు ప్రజల రుచి, అభిరుచికి, ప్రజా జీవన వైవిధ్యానికి అద్దం పట్టాయి... తెలుగు భాషలోని మట్టి వాసనలను, ఘాటును ఈ పాట ద్వారా గొప్పగా వెలుగులోకి తెచ్చిన రచయిత చంద్రబోస్ తెలంగాణ బిడ్డ కావడం... చిత్ర సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, దర్శకుడు రాజమౌళి, గాయకులు రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ, నటులు రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్, కొరియోగ్రాఫర్ ప్రేమ్‌రక్షిత్, సినిమా నిర్మాత డీవీవీ దానయ్య ఇతర సాంకేతిక సిబ్బందికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు...' ఈ మాటలు అన్నది మరెవరో కాదు... తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్. ట్రిపుల్ ఆర్ మూవీ పాట 'నాటునాటు' బెస్ట్ ఒరిజినల్ సాంగ్‌గా ఆస్కార్ దక్కిన సందర్భంగా ఆయన ఈ మేరకు తన అభినందన సందేశాన్ని పంపారు. తెలుగు పాటకు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డు దక్కడంతో ప్రపంచ వ్యాప్తంగా నాటునాటు పాట అందరినోటా పలుకుతోంది. సంగీత సాగరంలో ప్రస్తుతం ఈ పాట ఉప్పొంగే కెరటాల్లా ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది. ఇంతకూ ఈ పాట ఆస్కార్ అవార్డు దక్కించుకున్న ప్రధాన అంశాలేమిటి..? అంతగా ప్రభావితం చేసే అంశాలేంటి..? తెలంగాణ ప్రదేశంలో ఒక సాధారణ గిరిజన తెగకు చెందిన గోండు వీరుడికి చెందిన సంతతి జీవన నేపథ్యాన్ని వివరిస్తూ ట్రిపుల్ ఆర్ మూవీలో దర్శకుడు తీసుకున్న ఇతి వృత్తం ఎందుకంతలా సినివినీలాకాశంలో విహరిస్తోందన్న అంశానికి సంబంధించి చర్చించుకోవాల్సిన అవసరం ఉంది.



వి. నాగయ్య
9441877695

పాట కాదిది... ధిక్కార స్వరం...

అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌కు చెందిన ప్రఖ్యాత శిల్పి జార్జ్ స్టాన్లీ చేతుల్లో రూపుదిద్దుకున్న 13.5అంగుళాల పొడవుతో నగ్నంగా నిలుచున్న ఒక ధీరుని చేతిలో పదునెక్కిన ఖడ్గం... సుమారు నాలుగు కేజీల బరువున్న 24క్యారెట్ల బంగారు పూత పూసిన కళ్లు జిగేల్ మనిపించేలా కనిపించే ఆస్కార్ అవార్డును బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో న్యాయ నిర్ణేతలు ప్రకటించగానే ప్రపంచ వ్యాప్తంగా తెలుగు కీర్తి రెపరెపలాడింది. మరి ఇంతటి ఘనకీర్తి కలిగిన ఆస్కార్ అవార్డు దక్కించుకోవడానికి నాటు నాటు పాటకు ఉన్న ప్రత్యేకతలు ఒక సారి గుర్తుచేసుకుంటే... ఒక్క మాటలో చెప్పాలంటే అది పైకి పాటలా కనిపించినా అంతర్లీనంగా ఒక యుద్ధం దాగి ఉందని చెప్పక తప్పదు. లోతైన అర్థాన్ని పరిశీలిస్తే తమ సాంప్రదాయాలను, పద్ధతులను అగౌరవపరిచి, అవమానించి, హేళనగా చూసిన ఆంగ్లేయులకు తమ నృత్యం, పాట, సాహిత్యంతో తెలుగు వాడు ఎదురించి తన సత్తా చాటిన నేపథ్యాన్ని గుర్తించవచ్చు. ఈ పాటలోని సాహిత్యం, సంగీతం, నృత్య దర్శకత్వం, పాట లొకేషన్, వీడియో టేకింగ్, కొరియోగ్రఫీ, కాస్ట్యూమ్స్, కథ, కథనం, ఇలా అన్నింటా ఆ పాటలోని ఔన్నత్యం లోతుగా పరిశీలించిన వారికి స్పష్టంగా కనిపిస్తుంది. ఈ పాట సినిమాలో ప్రదర్శించిన నాటినుండే దేశ, విదేశాల్లో సైతం వివాహ వేదికపైన దంపతులు మొదలు, స్కూళ్లు కాలేజీలు, స్నేహితులు, సహోద్యోగులు అంతా ఎన్టీఆర్, రామ్‌చరణ్ వేసిన స్టెప్పులు వేసి సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. ఇక పాట చిత్రీకరణ విషయంలో దర్శకుడు రాజమౌళి స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న పరిస్థితులకు చక్కగా సరిపోయే విధంగా లొకేషన్ ఉండాలన్న ఆశయంతో ప్రపంచంలోని వివిధ దేశాల్లోని ప్రాంతాలను పరిశీలించి చివరికి ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంలోని ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌ను ఎంపిక చేశాడు. బ్యాక్ డ్రాప్‌గా ఉంచి దిగ్గజ నటులుగా పేరున్న రామ్‌చరణ్, ఎన్టీఆర్‌తో పాటు భారీ సంఖ్యలో సైడ్ డ్యాన్సర్లను పెట్టి సరిగ్గా ఆనాటి రోజులు గుర్తుకు వచ్చేలా చేసిన కృషి అద్భుతమనే చెప్పాలి. ఇక్కడ మరో విషయం ఏమంటే కీవ్ నగరంలోని ప్రెసిడెన్షియల్ ప్యాలెస్ కలర్‌కూడా సరిగ్గా సింక్ కావడం పాట చిత్రీకరణకు సరిపడా విశాలమైన గ్రౌండ్ ఉండటం పాటకు మరింత వన్నెలద్దింది. ఇంద్ర ధనస్సులోని ఏడు రంగులు, ప్రపంచంలోని ఏడు వింతల్లా ఈ పాటలోని ఏడు అంశాలు కూడా ప్రపంచ స్థాయికి చేర్చాయి. ఎన్టీఆర్, రామ్ చరణ్ ధరించిన క్యాస్ట్యూమ్స్, పాటలోని సాహిత్యం, సంగీతం, నాట్యం, లయ, శబ్దం, చిత్రంలోని కథ అన్నీ కూడా దర్శకుడు రాజమౌళి లాంటి దిగ్గజ దర్శకుడి చేతిలో అద్భుతంగా రూపుదిద్దుకుని చివరికి ప్రపంచ సినీ అవనికపై తెలుగు సినిమా కీర్తి రెపరెపలాడింది.



ఆస్కార్ దక్కించుకున్న తొలి తెలుగు చిత్రం ట్రిపుల్ ఆర్...

ప్రపంచ వేదికపై తెలుగు సినీ కీర్తి పతాకం రెపరెపలాడిరది. ఖండాంతరాలకు వ్యాపించిన తెలుగోడి ప్రతిభకు ఆస్కార్ పట్టం కట్టింది. తెలుగు ప్రేక్షకులు కండ్లు కాయలు కాచేలా ఎదురు చూసినట్టుగానే ఒరిజినల్ సాంగ్ కేటగిరిలో 'నాటు నాటు' పాటను ఆస్కార్ వరించింది. ఎమ్.ఎమ్ కీరవాణి, చంద్రబోస్ ఆస్కార్ అవార్డులు అందుకున్నారు. దర్శక దిగ్గజం రాజమౌళి తెరకెక్కించిన చిత్రం ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తుకు ఎదిగింది. ప్రపంచ వ్యాప్తంగా 81పాటలు ఆస్కార్‌కు ఎంట్రీ ఇవ్వగా... తుది జాబితాలో ఐదు పాటలు ఆస్కార్‌కు షార్ట్ లిస్ట్ అయ్యాయి. నాటు నాటుతో పాటు టెల్ ఇట్ లైక్ ఏ ఉమెన్ (అప్లాజ్), హోల్డ్ మై హ్యాండ్ (టాప్‌గన్: మావెరిక్), లిఫ్ట్ మీ అప్ (బ్లాక్ పాంథర్), దిస్ ఈజ్ లైఫ్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్) పాటలు ఆస్కార్‌కు పోటీ పడగా... నాటు నాటు పాట ఆస్కార్ గెలిచి చరిత్ర సృష్టించింది. ఇప్పటికే ఎన్నో ఇంటర్నేషనల్ అవార్డులు గెలుచుకున్న నాటు నాటు పాటకు ఇప్పుడు ఆస్కార్ రావడంతో భారతీయ సినీ ప్రేక్షకుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇటీవలే ఆస్కార్ తర్వాత అత్యంత ప్రతిష్టాత్మక అవార్డుగా భావించే గోల్డెన్ గ్లోబ్ అవార్డును నాటు నాటు పాట గెలుచుకుంది. ఆ అవార్డు గెలుచుకున్న తొలి ఆసియా పాట ఇదే. రిహాన్నా పాడిన లిఫ్ట్ మి అప్, టేలర్ స్విఫ్ట్ పాడిన కరోలినా, లేడీ గాగా పాడిన హోల్డ్ మై హ్యాండ్ పాటలను వెనక్కి నెట్టి... బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో గోల్డెన్ గ్లోబ్ అవార్డును కైవసం చేసుకోవడం విశేషం. మరో ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ అవార్డు క్రిటిక్స్ చాయిస్‌ను కూడా నాటు నాటు దక్కించుకుంది. ఇందులో బెస్ట్ సాంగ్ అవార్డును నాటు నాటు సొంతం చేసుకోగా, ఉత్తమ విదేశీ భాషా చిత్రంగా ఆర్‌ఆర్‌ఆర్ నిలిచింది. ఉత్తమ పాట విభాగంలో హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ అవార్డును నాటు నాటు సొంతం చేసుకున్నది. బెస్ట్ యాక్షన్ ఫిల్మ్, బెస్ట్ స్టంట్స్, ఉత్తమ అంతర్జాతీయ చిత్రం విభాగాల్లో ఆర్‌ఆర్‌ఆర్ సినిమా హెచ్‌సీఏ అవార్డులు దక్కించుకున్నది. బెస్ట్ సాంగ్ విభాగంలో హ్యూస్టన్ ఫిల్మ్ క్రికెట్ సొసైటీ అవార్డును కూడా నాటు నాటు కైవసం చేసుకున్నది. అదేవిధంగా ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆన్‌లైన్ ఫిల్మ్ క్రిటిక్స్ సొసైటీ (ఓఎఫ్‌సీఎస్) అవార్డును సైతం ఈ పాట సొంతం చేసుకోవడం గమనార్హం. ఎమ్.ఎమ్ కీరవాణి స్వరపరిచిన నాటు నాటు పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించాడు. కాలభైరవ, రాహుల్ సిప్లీగంజ్ ఆలపించారు. ప్రేమ్ రక్షిత్ నృత్య దర్శకత్వం వహించారు. ఈ పాటకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా రమా రాజమౌళి పనిచేశారు. ఇంతకుముందు సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందించిన స్లమ్‌డాగ్ మిలియనీర్ సినిమాలోని 'జయహో' పాటకు ఆస్కార్ వచ్చింది. దీంతో తెలుగుకు పట్టం కట్టడంతో దేశ ప్రధాని సహా వివిధ దేశాల ప్రధానులు, అధ్యక్షులు, భారతదేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, మాజీ ముఖ్యమంత్రులు, ట్రిపుల్ ఆర్ మూవీ చిత్ర యూనిట్‌కు, తెలుగు ప్రజలకు అభినందనలు తెలియజేస్తున్నారు. భవిష్యత్తులో తెలుగు సినిమా మరిన్ని అవార్డులు దక్కించుకోవాలని కోరుకుందాం.



కార్పొరేట్ కళాశాలల్లో బట్టీ చదువులు

రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు వ్యాపారమే తమ లక్ష్యంగా లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఆకర్షించడానికి అనేక కొత్త రకమైన పేర్లు పెట్టుకుని మోసం చేస్తున్నారు. ప్రభుత్వం అనుమతి లేకండానే అడ్మిషన్లు డిసెంబరులోనే ప్రారంభించారు. ఇప్పటికే సగానికిపైగా పూర్తి చేసుకున్నారు. గతంలో రూ.2 లక్షల ఫీజులు ఉంటే, ఈ సంవత్సరం దాన్ని రెట్టింపు చేసి, విద్య పేద వారికి అందని ద్రాక్షగా మారుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్టు వ్యహరిస్తోంది. కార్పొరేట్ విద్యా సంస్థలో ఫీజుల నియ oత్రణ చట్టం చేయాలని అనేక పోరాటాలు చేసినా పట్టించుకున్న నాథుడులేడు. వారు చేసే అక్రమాలు, అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ పెట్టకుండా నిర్లక్ష్యంగా ఉండటం సరైంది కాదు. ప్రధానంగా శ్రీ చైతన్య, నారాయణ లాంటి వాటి చాతుర్యానికి బలైపోతున్న ఎంతో మంది తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రెండేండ్ల పాటు హాస్టల్‌లో కొనసాగించేందుకు వారి వలలో పడి పోతున్నారు. ఫలితంగా ఎంతో మంది పల్లెల నుండి పట్నానికి వచ్చి కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు ఇక్కడి వాతావరణాన్ని త్వరగా ఆకలింపు చేసుకోలేకపోతున్నారు. ఇంటర్‌కు ముందు అంటే పదో తరగతి వరకు విద్యార్థిని, విద్యార్థులు తమ తల్లిదండ్రుల వద్ద స్వేచ్ఛా వాతావరణంలో పెరిగి ఉన్నఫలంగా ఒక్కసారిగా రెండేళ్ల 'ఖైదీ' అనుభవించలేక తమలో తాము సతమతమవుతూ విపరీతమైన మానసికవేదనకు గురవుతున్నారు. తల్లిదండ్రులు కాయా, కష్టం, అప్పు చేసి మరీ ఒక్కసారిగా లక్షల ఫీజులు చెల్లించి చదివిస్తుండటం తమ భవిష్యత్తు కోసమే అనే భావన వారిలో పెనవేసుకుని అత్యుత్తమంగా చదువలేక చతికిలపడిపోతున్నారు. కొండంత సెలబస్‌తో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఫలితంగా సెలబస్‌ను పూర్తిగా బట్టీపట్టే ప్రక్రియలో విద్యార్థిని, విద్యార్థులు సమిధ లవుతున్నారు. ఈ క్రమంలో కార్పొరేట్ కళాశాలలు వెనుకపడ్డ విద్యార్థులకు స్పెషల్ క్లాసులంటూ మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాన్ని అధ్యాపకులు తూచా తప్పకుండా పాటిస్తున్నారు. కొంత మంది అధ్యాపకులు టార్గెట్ ఇస్తుండటంతో తమ బ్యాచ్‌లోని విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో వారిపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నారు.



తాటికొండ రవి

ఈ క్రమంలో మిడిల్‌క్లాస్ స్టూడెంట్స్ రోజుకోసారి, వారానికోసారి, ప్రత్యేకంగా జరిగే టెస్టుల్లో వెనుకబడి పోతున్నారు. ఇలాంటి వారిపై అధ్యాపకులు టార్గెట్ చేస్తున్నారు. ఉత్తమంగా చదవలేక, సెలబస్‌ను కంప్లీట్ చేయలేక బట్టీ చదువులకు అలవాటుపడుతున్నారు. ఈక్రమంలో తమలో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభకు పూర్తిగా ఫుల్‌స్టాప్ పెడుతున్నారు. అధ్యాపకులూ ఏ మెథడ్‌లో చెబితే విద్యార్థులు గ్రహిస్తారు అనే అంశాన్ని మేనేజ్‌మెంట్ టార్గెట్స్‌తో ఏనాడో మర్చి పోయారు. ఎంత సేపటికి మేనేజ్‌మెంట్ పెట్టే టెస్టుల్లో ప్రతిభ చూపారా? లేదా అనే అంశాన్ని మాత్రమే ఇక్కడ కొలమాణంగా పరిగణిస్తున్నారు. వెనుకబడ్డ విద్యార్థులకు సింపుల్‌గా అర్థమయ్యే మెథడ్‌లో చెప్పేందుకు అధ్యాపకులకు సైతం టైం లేకపోవడం, వేలమంది ఒక్కో క్యాంపస్‌లో విద్యార్థులు ఉండటంతో ఇంట్రెస్టు ఉండి విద్యార్థులను గాడిలో పెడుతామనుకున్న అధ్యాపకులు సైతం ఎందుకొచ్చిందిలే గొడవ అంటూ సైడ్ అయిపోతున్నారు. ఈ క్రమంలో మిడిల్ క్లాస్ స్టూడెంట్స్ అలాగే ఉండిపోతున్నారు. బట్టి చదువులతో తాము ప్రతిభ చూపిస్తున్నామనుకుంటున్న వందలాది మంది విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థల లాంటి క్యాంపస్‌లు దాటాక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు.

ముఖ్యంగా కార్పొరేట్ విద్యాసంస్థలు తమ సంస్థకు ర్యాంకుల పంట పండాలని లెక్చరర్స్‌కు టార్గెట్స్ విధిస్తుండటంతో ఆ ఒత్తిడితో లెక్చరర్స్ తమ గ్రూప్‌లో పిల్లలు ఉత్తమంగా చదువాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో బట్టీ చదువులకు లెక్చరర్స్ జేజేలు పలుకుతున్నారు. ఆల్రెడీ ప్రిపేర్ చేసి ప్రింట్ తీసిన మెటీరియల్‌ను విద్యార్థులచే బట్టీ కొట్టిస్తున్నారు. ఫలితంగా విద్యార్థుల్లో దాగి ఉన్న టాలెంట్ వెలికితీయకపోగా ఉన్నది కాస్త పోయే రీతిలో కార్పొరేట్ చదువులు కొనసాగుతున్నాయి. ఇక స్పెషల్ సెలబస్ అంటే ఐఐటీ, జేఈఈ, ఏఐఈఈఈ, నీట్ మొదలైన బ్యాచ్‌ల విద్యార్థుల ఒత్తిడి చెప్పజాలవు. ఉదయం నిద్రలేవగానే మొదలు రాత్రిళ్లు పొద్దు పోయే వరకు స్పెషల్ క్లాసులంటూ రుద్దుడే... రుద్దుడు. చదువు... చదువు తప్ప వేరే ధ్యాస లేకపోవడంతో మానసిక ప్రశాంతత కరువై, స్వేచ్ఛ కరువై వారిలో ఉన్న టాలెంట్‌కు ఫుల్‌స్టాప్ పడుతుంది. పదివరకు పదిలంగా తల్లిదండ్రుల వద్ద పెరిగిన ఎంతో మంది విద్యార్థిని, విద్యార్థులు కొత్త లక్ష్యాలతో మహానగరంలోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో అడుగుపెట్టి మనోధైర్యం కోల్పోతున్నారు. కొంత మంది ఇష్టంగా మరికొంత మంది అయిష్టంగానే అడ్మిషన్ తీసుకుంటున్నారు. మరి కొంత మంది తమ స్నేహితుల కోసం మరీ పట్టుబట్టి వారి తల్లిదండ్రుల మీద ప్రెషర్ పెట్టి మరీ కార్పొరేట్ విద్యాసంస్థల్లో జాయిన్ అవుతున్నారు. ఇలా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో విద్యనభ్యసించడానికి హాస్టళ్లలోని ఆయా క్యాంపస్‌లోకి ఎంటరైన విద్యార్థులు ఒక్క సారిగా మారిన వాతావరణాన్ని ఆకలింపు చేసుకోలేక పోతున్నారు. అంతకు క్రితం వరకు పాఠశాలల్లో చదువు పూర్తికాగానే ఇంటికి వెళ్లి తల్లిదండ్రుల వద్ద మెలిగిన వాతా వరణం ఒక్కసారిగా దూరమై కేవలం స్నేహితులు తోటి క్లాస్‌మెంట్స్ మాత్రమే తమ వాతావరణమైపోతుంది. ప్రథమ సంవత్సరంలో జాయిన్ అయిన తర్వాత ఒకటి రెండు వారాలు కొత్తగా ఉత్సాహంగా అనిపించినా రానురాను విద్యార్థుల్లో కొంత అలజడి మొదలైపోతుంది. తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడాలన్నా నిర్ధీత టైంటేబుల్ ఉండటంతో ఆయా క్యాంపస్‌లో వేలాది స్టూడెంట్స్ మధ్య తమకెప్పుడు మాట్లాడే టైం వస్తుందోనని క్యాంపసుల్లో ఆశగా ఎదురు చూస్తుంటారు.

ఇక సెలవు దినాలు ముఖ్యంగా ఆదివారం వచ్చినా విద్యార్థులు పుస్తకాలతో మాత్రమే కుస్తీ పట్టాలి. కొంత సమయం విరామం ఇస్తే కిటికీల్లోంచి బయటి ప్రపంచాన్ని చూస్తూ ఆనందించే ఎంతో మంది విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ క్రమంలో చదువు అనే ఒత్తిడిని జయించలేక, అధ్యాపకుల ప్రెషర్‌ను తట్టు కోలేక, ర్యాంకుల వేటలో పరుగెత్తలేక, ఇంటి వద్ద తల్లి దండ్రుల పరిస్థితిని అర్థం చేసుకుని వారికే సమాధానం చెప్పాలో తెలియక వారిలో వారు మథన పడుతూ కృంగిపోతూ ఆత్మానూన్యతా భావంలో కొట్టు మిట్టాడుతూ సైకాల జీగా ఇబ్బంది పడుతున్నారు. చదువులో వెనకపడిపోయి రెండేండ్ల ఖైదీల జీవితాన్ని కేవలం నాలుగుగోడల మధ్య అనుభవించలేక, ఒత్తిడి తాళలేక ఆత్మహత్యలకు పూనుకుంటున్నారు. అందుకే తల్లిదండ్రుల్లారా కార్పొరేట్ విద్యా సంస్థల వలలో పడకుండా మీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందివ్వండి. స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించండి.. వారిని సొంత నిర్ణయాలు తీసుకునే విధంగా ప్రేరేపించండి. వారిలో ఏ అంశం పై ఆసక్తి ఉందో గ్రహించండి. ఆ దిశగా వారికి ఎంకరేజ్ చేయండి. అప్పుడే మీ బిడ్డల భవిష్యత్తు ఉజ్వలంగా తీర్చిదిద్దబడుతుంది.

సెల్:9177302248

బీజేపీది మహిళా వ్యతిరేక పాలన

సమానత్వమున్న దేశాల్లో వేగంగా అభివృద్ధి

- స్త్రీలను వంటింటికి పరిమితం చేసే యత్నం
- హక్కుల కోసం ఐక్యపోరాటాలు చేయాలి
- మహిళా దినోత్సవ కార్యక్రమంలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పురుషులతో పాటు మహిళల్ని సమానంగా గౌరవించే దేశాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతున్నదని పలువురు వక్తలు అన్నారు. మన దేశంలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయనీ, బీజేపీ ప్రభుత్వం మహిళా వ్యతిరేక పాలన చేస్తున్నదని చెప్పారు. మనుస్మృతిని తిరిగి అమల్లోకి తెచ్చి మహిళలను వంటింటికే పరిమితం చేసే దుర్మార్గపు ప్రయత్నాల్లో ఉందని విమర్శించారు. మహిళాభ్యున్నతి కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా, సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, టీఎస్‌యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్టు విధానం ద్వారా 12 గంటల పని చేయించుకుంటూ తీవ్ర శ్రమ దోపిడీకి పాల్పడుతున్న పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు పనిప్రదేశం నుంచి ఇంటికొచ్చాక రోజువారీ పనులు చేసుకోవడంతో తీవ్రంగా అలసిపోయి అనారోగ్యాల పాలవుతున్న తీరును వివరించారు. ఆడ, మగ అనే వివక్ష చూపకుండా పిల్లలను పెంచాలని కోరారు. భ్రూణ హత్యలు విపరీతంగా పెరిగిపోతుండటంతో వివాహం చేసుకోవడానికి అమ్మాయిలు దొరకని పరిస్థితి ఉందని చెప్పారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ..ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో మహిళల పాత్ర మరువలేనిదని కొనియాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యలో మతభావజాలాన్ని జొప్పించి మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూపే ప్రయత్నం చేస్తున్నదన్నారు. అన్ని పార్టీలూ మద్దతు తెలుపుతున్నప్పుడు లోక్‌సభలో మహిళా బిల్లును పెట్టడానికి ఏం అడ్డం వస్తున్నదని బీజేపీని ప్రశ్నించారు. ఒకవేళ ఆ బిల్లు ఆమోదం పొందితే చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరిగి ఆ పార్టీ భావజాల వ్యాప్తికి ఆటంకం అవుతుందనే బీజేపీ అడ్డుపడుతున్నదని విమర్శించారు. శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ రమ మాట్లాడుతూ..ఓటుహక్కు, సమానపనికి సమాన వేతనం, కనీసం మనుషులుగా గుర్తించండి అని మహిళలు రోడ్లెక్కి పోరాట స్ఫూర్తిని ప్రదర్శించిన రోజును గుర్తుచేసుకుంటూ మహిళా దినోత్సవాన్ని ఓ స్ఫూర్తి దినంగా జరుపుకుంటున్నామని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలంటే చిన్నచూపు చూసే పరిస్థితి ఉందన్నారు. అంతరాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా జరుగుతున్న పోరాటంలో అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ రైతాంగ పోరాట స్ఫూర్తితో లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాటం చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి మాట్లాడుతూ..30 శాతం కుటుంబాలను మహిళలే పోషిస్తున్నారనీ, మహిళల ఉపాధి కోసం ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఐదారువేల రూపాయలే జీతాలిస్తున్నారనీ, వాటితో ఎలా బతకాలో పాలకులు చెప్పాలని ప్రశ్నించారు. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడిన వారిని జైలు నుంచి స్వాగతిస్తూ ర్యాలీలు తీయటం బీజేపీ దుర్మార్గానికి పరాకాష్ట అని విమర్శించారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ బి.పద్మ మాట్లాడుతూ..మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి, ఆఫీసు పనులు చేసి సరైన తిండి తీసుకోకపోవడం వల్ల దేశంలోని 50 శాతానికి పైగా మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని వాపోయారు. నేడు అన్ని రంగాల్లో మగవాళ్లతో సమానంగా రాణిస్తున్న మహిళలను వంటింటికే పరిమితం చేసే విధానాలను బీజేపీ అమలు చేస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, ఐద్వా ఉపాధ్యక్షులు ఆశాలత, సీఐటీయూ నాయకులు ఆర్.వాణి, శ్రామిక మహిళా సెంట్రల్ సిటీ కన్వీనర్ మీనా, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు 50కి పైగా కరోనా కేసులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కరోనా కేసులు గత కొన్ని రోజులుగా పెరుగుతున్నాయి. కొన్ని నెలల తర్వాత వరసగా రెండో రోజు 50కి పైగా కేసులు నమోదయ్యాయి. మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు 4,937 మందికి టెస్టులు చేయగా 54 (1.09 శాతం) మందికి పాజిటివ్ వచ్చింది. మరో 25 మంది కరోనా నుంచి కోలుకున్నట్టు వైద్యారోగ్యశాఖ బులెటిన్‌లో వెల్లడించింది. ఒక వైపు ఫ్లూ జ్వరపీడితుల సంఖ్య పెరుగుతూ, మరోవైపు కరోనా కేసులు కూడా పెరుగుతుండటంతో ప్రజలు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

అన్ని మెడికల్ కాలేజీల్లో స్కిల్ ల్యాబ్‌లు

- డీఎంఈ డాక్టర్ కె.రమేశ్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీల్లో స్కిల్ ల్యాబులను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె.రమేశ్ రెడ్డి తెలిపారు. బుధవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో రాష్ట్రంలోనే తొలి స్కిల్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్‌లో అన్ని రకాల అత్యవసర పరిస్థితుల్లో బాధితులను కాపాడేందుకు ప్రాథమికంగా చేయాల్సిన విషయాలను మూడు రోజుల పాటు నేర్పించనున్నట్టు చెప్పారు. తొలి దశలో డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి ఈ శిక్షణ ఉంటుందనీ, భవిష్యత్తులో ఇతర వృత్తుల వారికి, సామాన్యులకు శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళా రెడ్డి మాట్లాడుతూ స్కిల్ ల్యాబ్ రాకతో విద్యార్థులు మరింత సామర్థ్యంతో, నైపుణ్యంతో సర్జికల్, కార్డియాక్, ప్రసూతి అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించగలుగుతారని తెలిపారు. శిక్షణ పొందిన వారికి జాతీయ గుర్తింపు పొందిన సర్టిఫికేట్ అందజేస్తామని తెలిపారు. మెడికల్ గ్రాడ్యుయేట్లు ఈ సర్టిఫికేట్ పొందడం తప్పని సరి అని వివరించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ మేడోజు, స్కిల్ ల్యాబ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పాండు నాయక్ పాల్గొన్నారు.

బాల వికాస సంస్థపై ఐటీదాడులు అమానుషం : ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 25, 30 ఏండ్ల నుంచి దేశ, విదేశాల నుంచి నిధులు సమకూరుస్తూ, నిస్వార్థ ప్రజా సేవ చేస్తున్న బాల వికాస సంస్థపై ఐటీ దాడులు చేయడం అమానుషమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాల వికాస క్రిస్టియన్ మిషనరీ సంస్థ అవడం వల్లే ఈ ఐటీ దాడులు జరిగాయని ఆరోపించారు. ఈ దాడులు కక్ష సాధింపు చర్యలో భాగమేనని పేర్కొన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య దేశంలో బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలకు పాల్పడుతున్నదని విమర్శించారు.

అచ్ఛేదిన్ కాదు..చచ్చేదిన్...

(మొదటిపేజీ తరువాయి)

వంటింట్లో మంటలు

నేడు పెరిగిన వంట గ్యాస్ ధర వంటింట్లో మంటలు పెడుతున్నది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు 2011లో రూ.399.26 ఉన్న గ్యాస్ (14.2 కిలోలు) ధర 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.414కు పెరిగింది. ఆ తర్వాత 2015లో దాని ధర రూ.452కు ఎగబాకింది. అప్పటి నుంచి ఇప్పటి దాకా బాదుడు మీద బాదుడు బాదటంతో ఇప్పుడు ఏకంగా రూ.1,150కి చేరింది.ఇది చాలదన్నట్టు ఇతరత్రా అనేక ఫీజులు, రుసుముల రూపంలో కూడా సర్కారు తాను వడ్డించదలుచుకున్న వాటిని యథేచ్ఛగా వడ్డిస్తూ పోతున్నది. ఉదాహరణకు రైల్వే టిక్కెట్లను రద్దు చేసుకున్న సందర్భంలో ప్రయాణీకుల నుంచి వసూలు చేసిన ఫీజు రూ.2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.352 కోట్లుగా నమోదైతే... 2021-22లో మరింత పెరిగి రూ.694 కోట్లుగా నమోదైంది. 2022-23లో ఆ రూపంలోనూ ఫీజు రూ.604 కోట్లుగా నమోదవటం గమనార్హం. ఈ రకంగా బాదుతుంటే..సామాన్యుడి జీవితం ఏంగానూ...?

2014 నుంచి ఇప్పటి వరకూ పెరిగిన ధరలు... (రూ.లలో)

వస్తువు	2014లో	ప్రస్తుతం ధర	పెరిగిన శాతంలో
వంటగ్యాస్	399	1,150	185
పెట్రోల్ (లీటర్)	71	109	53
డీజిల్ (లీటర్)	55	97	76
బియ్యం (కిలో)	27	55	103
వంటనూనె (కిలో)	83	165	98
ఉల్లిగడ్డలు (కిలో)	10	30	200
గోధుమపిండి (కిలో)	22	62	181
ఉప్పు (కిలో)	10	22	120
చక్కెర (కిలో)	24	42	75
పాలు (లీటర్)	38	64	68
ఆలుగడ్డలు (కిలో)	18	35	94
ఛాయ్‌పత్తా (కిలో)	194	320	65
చింతపండు (కిలో)	40	120	200
కందిపప్పు (కిలో)	50	118	136
మినపప్పు (కిలో)	32	106	231
శనగపప్పు (కిలో)	24	70	191
అరటిపండ్లు (డజను)	33	55	66
గుడ్లు (డజను)	38	75	98

సిటికాలేజ్‌లో గ్రూప్-4 ఆఫ్‌లైన్ కోచింగ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్‌లోని సిటీకాలేజ్‌లో గ్రూప్-4 ఆఫ్‌లైన్ కోచింగ్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నట్టు టీఎస్‌బీసీ స్టడీసర్కిల్స్ డైరెక్టర్ కే అలోక్‌కుమార్ తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులనీ, ఈనెల 31లోపు తమ దరఖాస్తుల్ని నేరుగా సమర్పించాలని కోరారు. మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందనీ, తల్లిదండ్రులకు సంవత్సరానికి రూ.5 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉండాలన్నారు. క్లాసులు ఏప్రిల్ 4వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. దరఖాస్తుల్ని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 040-27077929, 040-24071178 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలి.

18 నుంచి భారత్ గౌరవ్‌టూరిస్ట్ రైల్ ప్రారంభం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

'భారత్ గౌరవ్' రైలు ఈనెల 18న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమవుతుందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. దీన్ని ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) నడుపుతున్న మొదటి టూరిస్ట్ రైలు అని చెప్పారు. బుధవారంనాడిక్కడి రైల్‌నిలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు పేరును 'పుణ్యక్షేత్ర యాత్ర: పూరీ-కాశీ-అయోధ్య'గా నామకరణం చేశామన్నారు. ఈరైలు రెండు తెలుగురాష్ట్రాల్లోని పలు స్టేషన్లలో ప్రయాణీకులు ఎక్కేందుకు, దిగేందుకు ఆగుతుందని చెప్పారు. చారిత్రక పుణ్యక్షేత్రాలను ఒకేసారి దర్శించుకోవాలని వారికి ఇదో గొప్ప అవకాశం అని అన్నారు. ఈ యాత్ర మార్చి 18 నుంచి 26 వరకు 8 రాత్రులు, 9 పగలు సాగుతుందన్నారు. పూరీ, కోణార్క్, గయ, వారణాసి, అయోధ్య ప్రయాగ్‌రాజ్ వంటి పలు ఆధ్యాత్మిక ప్రదేశాలను కవర్ చేస్తుందని వివరించారు. ప్రయాణం, వసతి, ఆహారం సహా అన్నింటినీ సమకూరుస్తూ ప్యాకేజీల రూపంలో ఈ సేవల్ని అందిస్తున్నట్టు తెలిపారు. సికింద్రాబాద్, కాజీపేట, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, విశాఖపట్నం, విజయనగరం రైల్వేస్టేషన్లలో ఆగుతుంది. మొత్తం సీట్లు 700 కాగా, వాటిలో 460 స్లీపర్, త్రీటైర్ ఏసీ 192, టూ టైర్ ఏసీ 48 సీట్లు ఉంటాయని వివరించారు. సమావేశంలో ఏజీఎమ్ పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సికింద్రాబాద్ డీఆర్‌ఎం అభయ్‌కుమార్ గుప్తా, ఐఆర్‌సీటీసీ గ్రూప్ జనరల్ మేనేజర్ పీ రాజాకుమార్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలోని 35 వేల ఓటర్ల తొలగింపు అక్రమం

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు కేటీఆర్ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలోని 35 వేల ఓటర్ల తొలగింపు అక్రమమని పురపాలకశాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు విమర్శించారు. ఈ చర్య ప్రజల రాజ్యాంగ హక్కులను హరించడమేనంటూ, దేశంలో ఎక్కడా లేని విధంగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఐదు సంవత్సరాలలో ఓటర్ల సంఖ్య తగ్గిందని విమర్శించారు. ఓటర్ల జాబితాలో తొలగించిన వారిని తిరిగి చేర్చాలని కోరుతూ కేటీఆర్ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు బుధవారం లేఖ రాశారు. కంటోన్మెంట్ పరిధిలో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఉన్న భూమిలో అక్రమంగా నివసిస్తున్నారన్న అర్థం లేని కారణంతో, అర్హత కలిగిన వారిని కూడా ఓట్ల జాబితా నుంచి తొలగించారని వివరించారు.

భారత స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 75 సంవత్సరాలుగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలో శాశ్వతంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న కుటుంబాల హక్కులకు భంగం కలిగించేలా, అక్రమంగా, రాజ్యాంగ వ్యతిరేకంగా ఓట్ల తొలగింపు కార్యక్రమం జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. తొలగించిన ఓటర్లకు కానీ, వారి కుటుంబాలకు కానీ ఎలాంటి షోకాజ్ నోటీస్ ఇవ్వకుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించారని పేర్కొన్నారు. భారతదేశ పౌరులుగా తెలంగాణ రాష్ట్రంలో శాశ్వతంగా నివాసముంటున్న వీరి ఉనికిని ప్రశ్నార్థకం చేసేలా, వారికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును దూరం చేయడం అక్రమం అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ బోర్డుకు, విద్యుత్ శాఖకు, వాటర్ సప్లై డిపార్ట్‌మెంట్లకు బాధ్యత కలిగిన పౌరులుగా దశాబ్దాలుగా వీరు పన్నులు, బిల్లులను చెల్లిస్తున్నారన్నారని తెలిపారు. వీరు గతంలోనూ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో, శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లోను తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం కంటోన్మెంట్ బోర్డు వీరి హక్కులను హరించేలా ఏకపక్షంగా ఓటర్ల జాబితా నుంచి తొలగించిందని విమర్శించారు. అక్రమంగా నివాసం ఉంటున్నారని కంటోన్మెంట్ బోర్డు చెప్పిన కారణం సహేతుకంగా లేదని కేటీఆర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలోని ఏ న్యాయస్థానం కానీ, స్వయంగా కంటోన్మెంట్ బోర్డు కానీ వీరు అక్రమంగా నివసిస్తున్నారని అధికారికంగా తేల్చలేదని స్పష్టం చేశారు. తొలగించిన ఓటర్లను అక్రమంగా నివాసం ఉంటున్నారని రుజువు చేయకుండానే, నేరుగా వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించడం అన్యాయమన్నారు. 2018లో 1,91,849 ఓటర్లు ఉంటే ఈరోజు వారి సంఖ్య 1,32,722 కు తగ్గడం దురదృష్టకరమన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు చేస్తున్న ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యలతో భారతదేశంలో ఎక్కడ లేని విధంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్లో గత ఐదు సంవత్సరాలుగా ఓటర్ల జాబితాలోని పౌరుల సంఖ్య పెరగకుండా తగ్గిందని గుర్తుచేశారు. ఇలాంటి అన్యాయమైన పరిస్థితులు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలో నెలకొన్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని 35 వేలమంది ఓటర్లకు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములయ్యే అవకాశాన్ని కల్పించాలని, వారిని తిరిగి ఓటర్ల జాబితాలోకి చేర్చాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.





జనచైతన్య యాత్రకు సంఘీభావం తెలపండి

- వివిధ రాజకీయ పార్టీలకు సీపీఐ(ఎం) విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 29వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జన చైతన్య యాత్రకు సంఘీభావం తెలియజేయాలంటూ వివిధ రాజకీయ పార్టీలను ఆ పార్టీ కోరింది. ఈ మేరకు బుధవారం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆఫీస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, వైఎస్ఆర్‌టీపీ ఆఫీసు ఇన్‌చార్జి వెంకటేష్‌లను అయా పార్టీల కార్యాలయాల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నరసింహరావు, టి జ్యోతి, టి సాగర్ కలిసి విజ్ఞప్తి చేశారు. వివిధ జిల్లాల్లో యాత్రకు సంఘీభావం తెలియజేస్తామని వారు హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

న్యూ పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలి

- మహారాష్ట్ర ఉద్యోగుల సమ్మెకు సీసీజీజీఓఓ సంఘీభావం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పాత పెన్షన్ పథకాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మహారాష్ట్రలో ప్రభుత్వ ఉద్యోగులు,ఆఫీసర్లు, బోధనా, బోధనేతర సిబ్బంది, జిల్లా పరిషత్, మున్సిపల్ కౌన్సిల్ ఉద్యోగులు, యావత్ కార్మికులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు కేంద్ర ప్రభుత్వ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్స్ కాన్ఫెడరేషన్ (సీ.సీ.జీ.జీ.ఓ.ఓ) సంఘీభావం ప్రకటించింది. సమ్మె కారణంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యకలాపాలు స్తంభించి పోయాయని తెలిపారు. ఉద్యోగులకు సంఘీభావంగా ముంబై ఆజాద్ మైదాన్‌లో బుధవారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఆఫీసర్లు, పెన్షనర్లు , బీఎంసీ ఉద్యోగులు, ఇతర కార్మికులు ఆందోళన నిర్వహించారని తెలిపారు. పై డిమాండ్ల సాధన కోసం కాన్ఫెడరేషన్, ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద వేలాది మంది ఉద్యోగులు పార్లమెంట్ మార్చ్‌ను చేపట్టారని వివరించారు. ఎన్.పి.యస్ కారణంగా ఉద్యోగుల భవిష్యత్తు అనిశ్చితంగా ఉన్నందున ఓ.పీ.ఎస్‌ను పునరుద్ధరించడం న్యాయబద్ధమైన కోర్కె అని ఈ సందర్భంగా కాన్ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు వి.కృష్ణ మోహన్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాలు పాత పెన్షన్ పథకాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాయనీ, పశ్చిమబెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వ హయాం నుంచీ ఓపీఎస్ కొనసాగుతున్నదని పేర్కొన్నారు. కేరళ, త్రిపుర వంటి రాష్ట్రాల్లో పాలన మారిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు ఓపీఎస్ నుండి ఎన్.పి.యస్ కి మారాయన్నారు. కేరళ వంటి రాష్ట్ర ప్రభుత్వాలు ఓపీఎస్ పునరుద్ధరణ సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయడానికి కమిటీలను నియమించాయన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు నేడే

- రెండు రూమ్‌లు, 28టేబుళ్లు
- మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ

నవతెలంగాణ- సిటీబ్యూరో

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం గురువారం సాయంత్రం వరకు వెలువడే అవకాశముంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8గంటలకు ప్రారంభం కానుంది. 13న జరిగిన పోలింగ్‌లో 90.40శాతం ఓట్లు పోలైన విషయం తెలిసిందే. ఈనెల 16 ఓట్ల లెక్కింపు సందర్భంగా 8మంది అదనపు కలెక్టర్లు, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌ను కేటాయించారు. వీరిలో ఐదుగురు ఐఏఎస్ అధికారులు ఉన్నారు. వీరిలో వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్, జోగులాంబ గద్వాల్ జిల్లా అదనపు కలెక్టర్ అపూర్ చౌహాన్, నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ ఎం.మనుచౌదరీ, నారాయణపేట్ అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్(ఎన్నికలు) పంకజ, మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ ఏ.నర్సింహ్మారెడ్డి ఉన్నారు.

రూమ్‌కు 14 టేబుళ్లు

ఓట్ల లెక్కింపునకు రెండు రూమ్‌ల్లో ఏర్పాట్లు చేశారు. ఒక్కో రూమ్‌కు 14 టేబుళ్లను కేటాయించారు. అందుకోసం సిబ్బంది, సూపర్ వైజార్‌లు, అబ్జర్వర్లు ఉదయం 6.30 గంటలలోపు కౌంటింగ్ కేంద్రంలో ఉండాలని రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలా ఆదేశాలు జారీచేశారు. ఏజెంట్లు ఉదయం 7 గంటల వరకు కౌంటింగ్ కేంద్రానికి రావాల్సి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ కోసం 28 టేబుళ్లను ఏర్పాటు చేయగా ప్రతి టేబుల్‌కూ సూపర్‌వైజర్, ఇద్దరు సిబ్బంది, అబ్జర్వర్‌ను నియమించారు. ఒక్కో రూంకు ముగ్గురు ఏఆర్‌ఓలు, రిటర్నింగ్ ఆఫీసర్ వద్ద మరో ముగ్గురు ఏఆర్‌ఓలుగా అడిషనల్ కలెక్టర్‌లను నియమించారు. గత ఎన్నికల్లో మొదటి రౌండ్ లెక్కింపులోనే ఫలితం వచ్చింది. ఈ సారి కూడా మొదటి రౌండ్‌లోనే ఫలితం వచ్చే అవకాశముంది. ఒకవేళ ఫలితం రాకపోతే రెండో రౌండ్‌లోనూ ఓట్లను లెక్కించడానికి ఏర్పాట్లు చేసినట్టు అధికారులు చెబుతున్నారు.

ఫలితాలపై ఉత్కంఠ

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థులు ఎవరికివారే గెలుపు మాదే అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పావన్నగారి మానిక్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఏవీఎన్‌రెడ్డి మధ్యనే తీవ్రమైన పోటీ ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు : వికాస్‌రాజ్

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్టు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. బుధవారం సరూర్‌నగర్ స్టేడియంలో కౌంటింగ్ సెంటర్‌ను వికాస్‌రాజ్ పరిశీలించారు.

బుచ్చిరెడ్డికి పితృవియోగం



(ఫైల్)

నవతెలంగాణ-హైదరాబాద్

సుందరయ్య విజ్ఞానకేంద్రం(ఎస్‌వీకే) మేనేజింగ్ కమిటీ సభ్యులు జి.బుచ్చిరెడ్డి తండ్రి నారాయణరెడ్డి(92) బుధవారం మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తన స్వగ్రామమైన చౌటుప్పల్ వద్దనున్న బొర్రెలగూడెం గ్రామంలో చనిపోయారు. ఆయనకు ముగ్గురు కుమారులు. అంత్యక్రియలు గురువారం స్వగ్రామంలో జరగనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. నారాయణరెడ్డి మృతికి సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్, ఎడిటర్ సుధాభాస్కర్, ఎస్‌వీకే సెక్రటరీ ఎస్.వినయకుమార్ సంతాపం తెలియజేశారు.

సంపాదకీయం

సముద్రగర్భ పోరుకు తెరతీసిన అమెరికా!

ఆయుధ కంపెనీల లాభాలకు ఇప్పటి వరకు స్టార్‌వార్స్‌లో నిమగ్నమైన అమెరికా ఇప్పుడు సముద్ర గర్భాన్ని కూడా అల్లకల్లోలం చేసేందుకు పూనుకుంది. అది కూడా తమకు సుదూరంలో ఉన్న చోటును ఎంచుకుంది. తమ చేతికి మట్టి అంటకుండా ఇటీవల అనేక దేశాల్లో తమ సైనికులను పంపకుండా ఆయుధాలు ఇచ్చి ఇతరులు కొట్టుకు చచ్చేట్లు

> ఒక వైపు ఇరాన్ అణుకార్య క్రమాన్ని నిరోధించే పేరుతో ఆంక్షల కత్తి కట్టిన అమెరికా శుద్ధి చేసిన యురేనియంను తన మిత్రదేశానికి అందచేస్తున్నది. చాకును కూరగాయలు తరిగేందుకే అని విక్రేత నిబంధన చెప్పినా కుత్తుకలు ఉత్తరించకుండా కొన్నవారిని నిరోధించలేరు. ఇది కూడా అంతే. అందుకే ప్రపంచ శాంతిశక్తులు ఇలాంటి లావాదేవీలను తీవ్రంగా నిరసించాలి, ప్రతిఘటించాలి. ఇది తమను సముద్ర గర్భంలో చుట్టుముట్టే ఎత్తుగడలో భాగమని, దీన్ని ఎదుర్కొనేందుకు తాము కూడా పూనుకుంటామని చైనా చెప్పింది. అంటే మరోసారి ఆయుధపోటీకి అమెరికా తెరతీసినట్లే.

చూస్తున్నది. దాని కొనసాగింపే తాజా పరిణామం. అమెరికా, బ్రిటన్ దేశాల నుంచి ఆస్ట్రేలియా పదిహేను వేల కిలోమీటర్ల దూరంలో ఉంది. చైనా - ఆస్ట్రేలియా దూరం ఏడున్నరవేల కిలోమీటర్లు. రానున్న మూడుదశాబ్దాల కాలంలో అమెరికా, బ్రిటన్ దేశాలకు ఆస్ట్రేలియా 368 బిలియన్ డాలర్లు సమర్పించుకొని అణుశక్తితో నడిచే కొత్త, పాత జలాంతర్గాముల కొనుగోలు, కొత్తవాటి తయారీకి ఒప్పందం చేసుకుంది. ఎందుకటా? ఈ మూడు దేశాల మీద చైనా గనుక దాడికి దిగితే దాన్ని ఎదుర్కొనేందుకు అని కుంటిసాకులు చెబుతున్నాయి. వీటికి చైనాతో సరిహద్దు తగాదాలేదు. దేశాలను ఆక్రమించుకొనే పంచాయితీ అసలే లేదు. దక్షిణ చైనా సముద్రం మీద పూర్తి ఆధిపత్యం సాధించేందుకు చైనా చూస్తోంది. అదే జరిగితే అంతర్జాతీయ జలాల్లో ఏ దేశ నౌకలైనా తిరగటానికి స్వేచ్ఛ ఉండదు గనుక దాన్ని ఎదుర్కోవాలంటే ఆస్ట్రేలియా-బ్రిటన్-అమెరికా(అకుస్)లతో ఏర్పడిన కూటమి బలపడాలి, అందుకు పావుగా ఉన్న ఆస్ట్రేలియాకు జలాంతర్గా ములను అందించి చైనా మీద దాడి చేయించాలి, ఇదీ అమెరికా ఎత్తుగడ. చైనాను బూచిగా చూపి ఆ ప్రాంత దేశాలకు ఎంతగా వీలైతే అన్ని ఆయుధాలను అమ్మి సొమ్ము చేసుకోవాలనే దురాశ తప్ప అసలది జరిగేదేనా?



అణుబాంబును కనిపెట్టటం, దాన్ని తొలిసారిగా జపాను మీద వేసి ప్రపంచాన్ని భయపెట్టిన రోజు నుంచి అమెరికా ఆయుధాల వ్యాపారం ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. జనానికి రోజువారీ అవసరమైన వినిమయ వస్తువులను చైనా, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొని అధిక లాభాలు వచ్చే హైటెక్, మారణాయుధాల మీదనే కేంద్రీకరిస్తోంది. ఎక్కడైనా శాంతి కనిపిస్తే దానికి నిదురబట్టటం లేదు, అందుకే కొత్త ఉద్రిక్తతల సృష్టికి చూస్తోంది. స్టాక్‌హోం అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ(సిప్రి) తాజాగా విడుదల చేసిన సమాచారం ప్రకారం ప్రపంచాన్ని కరోనా మహమ్మారి, ఆర్థిక వడిదుడుకులు దెబ్బతీసినా అమెరికా మారణా యుధాల వ్యాపారం మూడు పూవులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. 2013-22 కాలంలో ప్రపంచ స్థాయిలో ఆయుధాల లావాదేవీలు 5.1శాతం తగ్గాయి. ఆఫ్రికా దిగుమతులు 40, అమెరికా 21, ఆసియా-ఓషియానా 7.5, మధ్యప్రాచ్యం 8.8శాతాల చొప్పున తగ్గగా, తూర్పు ఆసియా మొత్తంగా 42శాతం, ఫిలిప్పైన్స్ 64, దక్షిణ కొరియా 61, జపాన్ 171, ఆస్ట్రేలియాకు 21శాతం పెరిగాయి. ఇతర ప్రాంతాల్లో కొన్ని దేశాల దిగుమతులు భారీగా పెరగ్గా ఐరోపా దేశాలవి 47శాతం పెరిగాయి. వాటిలో నాటో కూటమి 65శాతం పెరిగాయి. ఇవన్నీ అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు ప్రపంచానికి శాంతి ప్రవచనాలు వల్లిస్తుండగా జరిగినవే. ప్రపంచ ఆయుధాల ఎగుమతుల్లో అమెరికా వాటా 33 నుంచి 40శాతానికి పెరగ్గా, రష్యా ఎగుమతులు 22 నుంచి 16శాతానికి తగ్గాయి. రష్యాను బూచిగా చూపి ఐరోపాకు ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున ఆయుధాలను అంటగట్టినట్లు స్పష్టం అవుతోంది. ఇతర ప్రాంతాల్లో కూడా అలాంటి ఎత్తుగడలతో లబ్దిపొందాలన్నదే అమెరికా అసలు ఎత్తుగడ. చైనాను దుష్టశక్తిగా చూపి ఆసియా నాటో ఏర్పాటుకు పావులు కదుపుతోంది. క్వాడ్, అకుస్ దానికి ప్రాతిపదికలే. ప్రపంచంలో ఎక్కడ పచ్చగా కనిపిస్తే అక్కడ చిచ్చు పెట్టటం అమెరికా నిత్యకృత్యంగా ఉంది. ఈ ఒప్పందం ఆస్ట్రేలియా పాలక లేబర్ పార్టీలో ఉన్న విబేధాలను వెల్లడించింది. ఇది తెలివి తక్కువపని, దేశానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చదని మాజీ ప్రధాని పాల్ కీటింగ్ ధ్వజమెత్తటం గమనించాల్సిన అంశం. అమెరికాతో చేతులు కలుపుతూ చైనాతో స్వయంగా ఆస్ట్రేలియా సమస్యలను సృష్టించుకోవటం తప్ప వేరు కాదని, చైనాతో నిజానికి ఎలాంటి వైరం లేదని, అది ఎలాంటి దాడి తలపెట్టలదేని, ఈ ప్రాంతంలో అమెరికా పెత్తనాన్ని నిలిపేందుకు చేస్తున్న పని తప్ప మరొకటి కాదన్నాడు.

ఆస్ట్రేలియా ఇప్పటి వరకు అణ్వస్త్ర రహిత దేశంగా ఉంది. దానికి అణ్వాయుధాల తయారీకి అనువైన యురేనియంను భారీ మొత్తంలో జలాంతర్గాములతో పాటు అమెరికా అందచేస్తున్నది. ఇది అణ్వస్త్రవ్యాప్తి నిరోధ ఒప్పందానికి(ఎన్‌పిటి) పూర్తి విరుద్ధం. మరొక అణుశక్తిని తయారు చేసి ప్రపంచం మీదకు వదలటం తప్ప వేరు కాదు. ఒక వైపు ఇరాన్ అణుకార్య క్రమాన్ని నిరోధించే పేరుతో ఆంక్షల కత్తి కట్టిన అమెరికా శుద్ధి చేసిన యురేనియంను తన మిత్రదేశానికి అందచేస్తున్నది. చాకును కూరగాయలు తరిగేందుకే అని విక్రేత నిబంధన చెప్పినా కుత్తుకలు ఉత్తరించ కుండా కొన్నవారిని నిరోధించలేరు. ఇది కూడా అంతే. అందుకే ప్రపంచ శాంతిశక్తులు ఇలాంటి లావాదేవీలను తీవ్రంగా నిరసించాలి, ప్రతిఘటించాలి. ఇది తమను సముద్ర గర్భంలో చుట్టుముట్టే ఎత్తుగడలో భాగమని, దీన్ని ఎదుర్కొనేందుకు తాము కూడా పూనుకుంటామని చైనా చెప్పింది. అంటే మరోసారి ఆయుధపోటీకి అమెరికా తెరతీసినట్లే.

హయ్యర్ పెన్షన్‌పై సుప్రీం తీర్పును అమలు చేస్తారా?

> రాజ్యసభలో పెన్షన్‌పై ప్రధాని పలుకులు వింటే కార్మికుల, ఉద్యోగుల సంక్షేమం పట్ల వారి చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా కన్పిస్తున్నది. కేంద్ర ప్రభుత్వోద్యోగులకు రిటైర్మెంట్ సమయంలో వచ్చే జీతంలో సగం పెన్షన్ పొందే పాతపెన్షన్ సౌకర్యాన్ని 2004 తర్వాత జాయినయిన వారికి వాజ్‌పేయి ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వాన్ననుసరించి పాత పెన్షన్ విధానాన్ని అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తొలగించినా కేరళ, రాజస్తాన్ లాంటి కొన్ని ప్రభుత్వాలు కొనసాగించటం సరియైంది కాదని ప్రధాని హెచ్చరించటం గమనార్హం. అలాంటి వారి సారధ్యంలో కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ పరిధిలోని ఈపీఎఫ్‌ఓ ద్వారా సుప్రీం తీర్పును సక్రమంగా అమలు జరుపుతారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

ఈపీఎస్-95పై నవంబర్ 4, 2022న సుప్రీం కోర్టు తీర్పుతో దేశవ్యాపితంగా కార్మికులు, ఉద్యోగులలో (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వేతర ఉద్యోగులు) పెన్షన్ పెరుగుదలపై కోలాహలం ప్రారంభమైంది. అనేక సంవత్సరాలుగా సుప్రీం కోర్టు తీర్పుకోసం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. కార్మికులు, ఉద్యోగులు ఉద్యోగ విరమణానంతరం అసరాగా పెన్షన్ ఇవ్వాలని గత 3 దశాబ్దాలుగా అనేక ఆందోళనలు, పోరాటాలు జరిగాయి. 1995లో ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం ఈపీఎస్-95ను కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన నాడే కార్మికలోకం సంఘటిత - అసంఘటిత రంగంలోని కార్మికులు, ఉద్యోగులకు కనీస పెన్షన్ గ్యారంటీ ఉండేలా, ధరల పెరుగుద లకు అనుగుణంగా పెన్షన్‌లో పెంపు దల ఉండాలని కోరారు. దానిపై కాలానుగుణంగా సమీక్ష చేస్తామని, కార్మికులకు ప్రయోజనకరంగా నిర్ణయాలు తీసుకుంటామన్న హామీతో ప్రభుత్వం ఈపీఎస్-95 చట్టాన్ని తీసుకొచ్చింది.

2022 నవంబరు 4న సుప్రీం కోర్టు తీర్పుతో కార్మికులు, ఉద్యోగులలో కొంతమందికి ఉపశమనంగా నిజవేతనంపై మేనేజ్ మెంట్ కాంట్రిబ్యూషన్‌లో 8.33శాతం రికవరీతో హయ్యర్ పెన్షన్ వస్తుందన్న ఆశతో ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది కనుక ఇక వచ్చేసినట్లేనని రిటైర్డ్, సర్వీసులో ఉన్నవారు ఆనందం వ్యక్తం చేశారు. అయితే సుప్రీం కోర్టు తీర్పు వెలువడినప్పటి నుండి అమలు చేయాల్సిన ఈపీఎఫ్‌ఓ, స్పందించని కేంద్రప్రభుత్వ కార్మికశాఖల చర్యలు అందుకు అనుగుణంగా లేవన్నది స్పష్టంగా కనిపిస్తున్నది.

కారణమేమంటే సుప్రీం తీర్పులో స్పష్టంగా రెండు విషయాలు పేర్కొన్నారు. నిజవేతనంపై 8.33శాతం ఈపీఎస్ రికవరీ దానికనుగుణంగా హయ్యర్ పెన్షన్ కోసం ఈపీఎఫ్‌ఓ తగిన ప్రొసీజర్ రూపొందించి రిటైర్డ్, సర్వీసులోని ఉద్యోగుల నుండి ఆప్షన్ తీసుకోవాలి. అంతేగాదు ఈ తీర్పు అమలు నాలుగు నెలల్లో అనగా మార్చి 3వ తేదీ కల్లా పూర్తి చేయాలని చెప్పింది. కాని సుప్రీం తీర్పుపై గడువు ముగిసే దశలో ఈపీఎఫ్‌ఓ స్పందించింది. నిజవేతనంపై రికవరీతో హయ్యర్ పెన్షన్ కోరుకునే వారు దరఖాస్తులు ఇవ్వాలన్న సర్క్యులర్ 2023 ఫిబ్రవరి 20న జారీ చేశారు. అదీ ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని, అందుకై పోర్టల్‌ను 27 ఫిబ్రవరి 2023 తేదీ నుండి మాత్రమే అందుబాటులో ఉంచారు. సుప్రీం కోర్టు తీర్పు ముగిసే గడువు మార్చి 3వ తేదీకి కేవలం 4 రోజుల ముందు మాత్రమే ఈ సౌకర్యం కల్పించారు. ఆ 4 రోజుల్లోనూ పోర్టల్ ఓపెన్ కాక, స్తంభించడం వలన దరఖాస్తుదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీఐటీయూ ఆలిండియా నాయకత్వం ఈపీఎఫ్‌ఓకు, కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖకు సమయం పెంపుదలకై రిప్రజెంటేషన్ ఇచ్చి ఒత్తిడి చేసింది. ఆ తరువాత రోజు మే 3 వరకు గడువు పొడిగించినట్లు పోర్టల్లో పెట్టారు. దేశవ్యాపితంగా హయ్యర్ పెన్షన్ కోసం 8 వేలు దరఖాస్తులు మాత్రమే వచ్చాయని మార్చి మొదటి వారంలో ఈపీఎఫ్‌ఓ ప్రకటించింది. ఇదీ సుప్రీం కోర్టు తీర్పును ఈపీఎఫ్‌ఓ అమలు చేస్తున్నతీరు.

ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఈపీఎస్ ప్రారంభమైన 1995 నుండి ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు వెలువడేవరకు ఈపీఎస్-95 స్కీం అమలు కేంద్ర ప్రభుత్వం, ఈపీఎఫ్‌ఓ పారదర్శకంగా, చిత్తశుద్ధితో అమలుకు ప్రయత్నించిన దాఖాలాలు కనిపించవు. ఉదాహరణకు నేడు ఆప్షన్ ఇవ్వాల్సిన దరఖాస్తుదారులు, రిటైర్ అయిన వారు ఎన్ని లక్షలు జమ చేయాలో తెలియదు. సర్వీసులో ఉన్నవారు, ఎంత ఎమౌంట్ పీఎఫ్ అకౌంటు నుండి ఈపీఎస్‌కు బదలాయించాలో తెలియదు. డిపాజిట్ చేసిన అమౌంట్‌కు అనుగుణంగా తిరిగి పెన్షన్, బకాయిలు ఎంత వస్తాయో తెలియని స్థితిలో దరఖాస్తు దారులున్నారు. ఈ రకమైన సందేహాలు, అవేదనతో ఆప్షన్ ఇవ్వటానికై ఊగిసలాటలో దరఖాస్తుదారులు కొంద రున్నారు.

1995 నుండి 2001 జూన్ వరకు ఈపిఎఫ్ గరిష్ట వేతన పరిమితి రూ.5వేలు, 2001 జూన్ నుండి ఆగస్టు 2014 వరకు రూ.6500లు, 2014 సెప్టెంబరు తర్వాత నుండి రూ.15వేలు, గరిష్ట వేతన పరిమితిగా ఈపీఎస్-95 చట్టానికి సవరణలు చేశారు. ఈపీఎఫ్ గరిష్ట వేతన పరిమితిని మించి నిజవేతనం పొందుతున్న వారు, తమ నిజవేతనంపై రికవరీ చేయించుకుని తగిన హయ్యర్ పెన్షన్ పొందటానికి 1996 మార్చిలో ఈపీఎస్-95 చట్టానికి చేసిన సవరణతో, నిజవేతనంపై రికవరీకి అను గుణంగా హయ్యర్ పెన్షన్‌కు ఆప్షన్ ఇవ్వవచ్చని ఈపీఎఫ్‌ఓ సర్క్యులర్ జారీ చేసింది. 2004 ఏడాది చివరివరకు ఆప్షన్ క్లోజ్ చేశారు. 2014 సెప్టెంబరులో ఈపీఎస్ గరిష్ట పరిమితి రూ.6500లు నుండి రూ.15వేలు వరకు పెంచినప్పుడు, 2004లో నిజవేతనంపై రికవరీకై ఆప్షన్ ఇచ్చినవారు కూడా రూ.15వేలు గరిష్ట పరిమితికి మించి ఉన్న నిజవేతనంపై రికవరీకి మరల ఆప్షన్ ఇవ్వాలని సర్క్యులర్ ఇచ్చారు. నిజవేతనంపై ఈపీఎస్ రికవరీకి, దానిపై హయ్యర్ పెన్షన్‌కు ఆప్షన్‌కు అవకాశం ఇచ్చారన్న విషయం, అందుకు 2004 చివర వరకే కటాఫ్ తేదీ అన్నది తమకు తెలియదని ఈపీఎస్‌లో సభ్యులు అనేక మంది ఆందోళన చెందారు. ఆప్షన్‌కు కొందరు కోర్టులను ఆశ్రయించారు. అంతేగాదు ఈపీఎఫ్ గరిష్ట వేతన పరిమితి రూ.15వేలకు పెంచిన దానిపై ఆప్షన్ గురించి వివరాలు అడిగిన



ప్రభుత్వ రంగ సంస్థలకు ఈపీఎఫ్‌ఓ నుండి క్లారిఫికేషన్ ఇవ్వలేదంటే ఈపీఎఫ్‌ఓ కమ్యూనికేషన్ వ్యవస్థ ఎంత లోపభుయిష్టంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆప్షన్‌కై సుప్రీం కోర్టుకు వెళ్ళిన ఆర్‌సీ గుప్తా కేసులో ఈపీఎస్ గరిష్ట పరిమితికి మించి ఉన్న నిజవేతనంపై రికవరి అయిన పీఎఫ్‌ను ఈపీఎఫ్‌లో జమచేసినపుడు, ఈపీఎస్‌కు బదలాయిం చటంలో అకౌంట్స్ అడ్జస్ట్ మెంటే గాని అదనంగా ఈపీఎఫ్‌ఓపై భారమేం ఉండదన్న వాస్తవాన్ని తెలుపుతూ, ఈపీఎఫ్‌ఓ ఆప్షన్ అవకాశం ఇవ్వాలని సుప్రీం తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు అమలులోనూ ఈపీఎఫ్‌ఓ మరొక మెలికను పెట్టింది. ఆర్‌సీ గుప్తా దరఖాస్తు దారుడు నాన్ ఎగ్జంప్టెడ్ ఎస్టబ్లిష్ మెంట్స్ సభ్యుడు కనుక ప్రభుత్వ రంగ సంస్థల ఎగ్జంప్టెడ్ ట్రస్ట్ సభ్యులకు ఆప్షన్ ఇచ్చే అవకాశం లేదు అని మరొక సవరణతో ఈపీఎఫ్‌ఓ సర్క్యులర్ జారీ చేసింది. 2016లో ఆర్‌సీ గుప్తా కేసు తీర్పులో నాటి నేపథ్యం, పూర్వాపరాలు పరిశీలించి, 2014 ముందు రిటైరైన ఉద్యోగులకు హయ్యర్ రికవరీ, హయ్యర్ పెన్షన్ పొందే అవకాశం కల్పించారు.

తాజా సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పులో 2014 ముందు రిటైరైన వారిలో, మిగిలిపోయిన వారికి ఇప్పుడు ఆప్షన్ ఇచ్చే అవకాశం ఉండదని చెప్పింది. ఈ తీర్పును ఈపీఎఫ్‌ఓ తనకనుగుణం గా అన్వయించుకొని 2014 ముందు రిటైరై, హయ్యర్ పెన్షన్ పొందుతున్న వారికి, తీసుకున్న పెన్షన్ వాపసు చేయమని మన రాష్ట్రంలోనే 53వేల మందికి నోటీసులిచ్చినట్లు పత్రికల్లో చూశాం. ఇస్తున్న హయ్యర్ పెన్షన్‌ను తగ్గించి పాతపద్ధతిలో తక్కువ పెన్షన్‌నే ఇస్తున్నారు. ఇది ఎంత అనైతికమో, అమానవీయమో ఆలోచించండి. అంతేగాదు 2014లో పెంచిన ఈపీఎస్ వేతన గరిష్ట పరిమితి రూ15వేలు మించి ఆదాయం వచ్చినవారు 2014 తర్వాత ఈపీఎఫ్‌లో సభ్యులైన ఉద్యోగులకు పెన్షన్‌కి అర్హత లేదని ఈపీఎఫ్‌ఓ వారు మరొక సర్క్యులర్ జారీ చేశారు. హయ్యర్ పెన్షన్ ఆప్షన్ కోసం ఈపీఎఫ్‌ఓ పెట్టిన నిబంధనలు చూస్తుంటే, పాముని చ్చెన ఆట కళ్ళముందు కదలాడుతున్నది. అన్ని ఆటంకాలను ఎదుర్కొని ఎవరైనా ఆప్షన్ కోసం వస్తే బ్రహ్మాస్త్రం లాంటి పీఎఫ్ యాక్ట్‌లోని 26(6) క్లాజును చూపుతున్నది. హయ్యర్ పెన్షన్‌కై ఆప్షన్ కోరుకునేవారు, హయ్యర్ పిఎఫ్ రికవరీ కోసం ఎంప్లాయి ప్లస్ ఎంప్లాయర్ జాయింట్ ఆప్షన్ గతంలోనే తీసుకుని ఉండాలని చెపుతున్నది. ప్రస్తుతం గరిష్ట పరిమితి కంటే మించి ఉన్న ఎంప్లాయీస్ నిజవేతనాలపై పీఎఫ్ రికవరి చేసి ఎగ్జామ్‌టెడ్ ట్రస్ట్‌లోను, నాన్ ఎగ్జంటెడ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లోనూ జమచేస్తూనే ఉన్నారు. దానిపై ఈపీఎఫ్‌ఓ నిరంతరం తనిఖీ చేస్తున్నా ఎన్నడూ అభ్యంతరాలు పెట్టిన సందర్భాలు లేవు. నేడు హయ్యర్ రికవరీతో హయ్యర్ పెన్షన్‌కై ఆప్షన్ అడిగే వారిని, హయ్యర్ పీఎఫ్ రికవరీకై గతంలో నే జాయింట్ ఆప్షన్ ఇచ్చివుండాలని చెప్పడమంటే, ఇంతకాలం నిజవేతనంపై పీఎఫ్ రికవరీ అవుతుంటే ఈపీఎఫ్‌ఓ ఏం చేస్తున్నట్టు? కళ్లు మూసు కున్నదా? దీన్ని బట్టి హయ్యర్ పీఎఫ్ రికవరీ తో హయ్యర్ పెన్షన్ ఆప్షన్ ఎవ్వరికీ అవకాశం లేకుండా చేసే అస్త్రాలుగా, కుట్రపూరిత నిబంధనలను ఈపీఎఫ్‌ఓ అమ్ముల పొదిలో పెట్టుకున్నట్లుగా స్పష్ట మవుతున్నది.

అంతేకాదు, ఈ సుప్రీం కోర్టు తీర్పుతోనూ 2014కు ముందు సర్వీస్‌లో ఉండి 2014 తర్వాత రిటైరైన, లేదా సర్వీసులో కొనసాగుతున్న వారు మాత్రమే హయ్యర్ పెన్షన్‌కు ఆప్షన్ పొందటానికి అర్హులు. 2014 ముందు రిటైరైన వారు, అప్పుడు ఆప్షన్ అడగనివారు నిజవేతనం పై ఈపీఎస్ రికవరీతో హయ్యర్ పెన్షన్ పొందలేరు. అంతే గాదు 2014 తర్వాత ఉద్యోగా ల్లో చేరిన వారిలో రూ.15వేలు మించి ఆదాయం ఉన్నవారికి ఈపీఎస్-95 పెన్షన్ వర్తిం చదు. ఈవిధంగా ఏక పక్షంగా చట్టసవరణలతో హయ్య ర్ పెన్షన్‌కు అవకాశం లేకుండా నిబంధనలను పెట్టి ఈపీఎఫ్ సభ్యుల హక్కులను కాల రాస్తున్నది.

విశ్వగురువుగా ప్రకటించుకుంటున్న కేంద్ర ప్రభుత్వ పాలకులకు కార్పొరేట్ల సంక్షేమమేగాని, వారికి సంపద కూడబెడుతున్న కార్మికులు, ఉద్యోగులకు తమ నిజవేతనాలపై ఈపీఎస్ రికవరీని- దానిపై పెన్షన్‌కు తగిన చర్యలు తీసుకోకపోవటం ఏమిటన్నది అనేక మందిలో మెదలవుతున్న ప్రశ్న. కోట్ల రూపాయల ఖర్చుతో ఐదేండ్ల కోసం పార్లమెంటుకు ఎన్నికైన పాలకులు, తమకు కనీస పెన్షన్ 50వేల రూపాయలు వచ్చేలా బిల్లు పాసు చేసుకున్నారు. 35సంవత్సరాల సర్వీసుతో రిటైరైన శ్రామికులకు పిఎఫ్ కాంట్రిబ్యూషన్‌తో వచ్చే పెన్షన్‌కై తగిన చర్యలు తీసుకోకపోవటమంటే ప్రజాపాలనకు వీరికి ఏం అర్హత ఉన్నట్టు? అంతేగాదు ఇటీవల పార్లమెంటు సెషన్ సందర్భంగా రాజ్యసభలో పెన్షన్‌పై ప్రధాని పలుకులు వింటే కార్మికుల, ఉద్యోగుల సంక్షేమం పట్ల వారి చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా కన్పిస్తున్నది. కేంద్ర ప్రభుత్వోద్యోగులకు రిటైర్మెంట్ సమయంలో వచ్చే జీతంలో సగం పెన్షన్ పొందే పాతపెన్షన్ సౌకర్యాన్ని 2004 తర్వాత జాయినయిన వారికి వాజ్‌పేయి ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వాన్ననుసరించి పాత పెన్షన్ విధానాన్ని అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తొలగించినా కేరళ, రాజస్తాన్ లాంటి కొన్ని ప్రభుత్వాలు కొనసాగించటం సరియైంది కాదని ప్రధాని హెచ్చరించటం గమనార్హం. అలాంటి వారి సారధ్యంలో కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ పరిధిలోని ఈపీఎఫ్‌ఓ ద్వారా సుప్రీం తీర్పును సక్రమంగా అమలు జరుపుతారా అన్న అనుమానాలు కలుగు తున్నాయి. అందుకే కార్మికోద్యమంతో సాధించు కున్న ఈపీఎస్ -95 చట్టాన్ని, అందు కనుగుణంగా ఇచ్చిన సుప్రీం కోర్టు తీర్పు అమలు జరగాలన్నా అంశంపై కార్మికులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి. దీని అమలు కోసం పోరాటాలు చేస్తూనే ఉండాలి.

సిహెచ్. కృష్ణారావు, 9490098586
జె. రాఘవరావు, 9989830251

కేంద్ర విధానాలతో విద్యుత్ భారాలు

విద్యుత్‌రంగంలో 1990వ దశకంలో సంస్కరణలు చేసినవారు ఏమి చెప్పినా, ఎన్ని చెప్పినా ప్రజలపై విద్యుత్ చార్జీల భారాలు వివిధ రూపాలలో పెరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలు, ముఖ్యంగా విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కాములు), నష్టాల పాలవుతునేవున్నాయి. విద్యుత్ రంగంలోకి ప్రయివేట్ పెట్టుబడిదారులు పెద్దఎత్తున చొరబడటానికి, క్రమేణా విద్యుత్ రంగ ప్రయివేటీకరణకు ఈ విధానాలు దారి తీస్తున్నాయి. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రధాన కారణం. ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థల నిర్వ హణలో లోపాలు, లోటుపాట్లను కాదనలేం. కానీ విద్యుత్ రంగ వ్యవహారాలను నియంత్రించేందుకు ఉద్దేశించిన నియంత్రణ కమిషన్లు ప్రభుత్వాల విధానాల పరిధికి లోబడే పనిచేస్తున్నాయి. అధికారంలో ఉన్నవారికి తోడు, నయా ఉదారవాద విధానాలకు, కార్పొరేట్ రంగ ప్రయోజనాలకు మద్దతుదారులుగా వ్యవహరిస్తున్న మేధావులు, నిపుణులు, పాలకవర్గ మీడియా ఏకపక్ష ప్రచారం చేస్తున్నది. కానీ విద్యుత్ చార్జీలను పెంచక తప్పదనేవారు, సామాన్య ప్రజానీకానికి ఇస్తున్న కొద్దిపాటి సబ్సిడీలను వ్యతిరేకించే వారు కొందరున్నారు. మరికొందరు ఈ చట్టాలను, నిర్ణయాలను, ఆచరణను ప్రశ్నిస్తున్నారు. వాటికి ప్రజానుకూల ప్రత్యామ్నాయాలను సూచిస్తున్నారు.

కాకులను కొట్టి గద్దలకు వేస్తున్న మోడీ సర్కార్!

మోడీ ప్రభుత్వం అనుసరిస్తూ, రాష్ట్రాలపై రుద్దుతున్న విధానాల సారాంశం 'కాకులను కొట్టి గద్దలకు' వేయడమే. ప్రజలపై విపరీత భారాలు మోపుతూ, కార్పొరేట్ సంస్థల పబ్బం గడపటం, తమ పబ్బం గడుపు కోవటం పాలకులకు నిత్యకృత్యంగా మారింది. ఫెడరల్ వ్యవస్థ స్ఫూర్తిని హరిస్తూ, రాష్ట్రాల హక్కులను, అధికారాలను కబళిస్తూ, మోడీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నది. ఇతర రంగాల్లోలాగే, విద్యుత్ రంగంలో కూడా రాష్ట్రాలపై రుద్దుతున్న సంస్కరణల అమలువల్ల తలెత్తుతున్న దుష్ఫలితాలకు, వాటిపై ప్రజల నుండి వచ్చే వ్యతిరేకతకు తనకేమీ బాధ్యత లేనట్టు మోడీ ప్రభుత్వం మోర పైకెత్తి చూస్తున్నది.

కేంద్ర ప్రభుత్వ విద్యుత్ విధానాలు, చట్టాలు, ఆదేశాల ప్రకారం ప్రయివేటు విద్యుత్ ప్రాజెక్టులకు అనుమతులనిచ్చి, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను (పీపీఏ) చేసుకొంటున్న తీరు, అధిక పెట్టుబడి వ్యయం మోసాలు, లోపభూయిష్ట నిబంధనలు వినియోగదారులపై వేల కోట్ల రూపాయల భారాలను దీర్ఘకాలికంగా మోపుతున్నాయి. దేశంలోనూ, ఆ తరువాత ఉభయ తెలుగు రాష్ట్రాలలోను ఈ చేదు అనుభవాల పరంపర కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా, ఈ నష్టదాయక విధానాలు కొనసాగుతూనే ఉన్నాయి. రెగ్యులేటరీ కమిషన్ల ఉత్తర్వులు కూడా అనేక సందర్భాలలో అందుకు వీలు కల్పించేవిగా ఉంటున్నాయి. పార్టీలు, ప్రభుత్వాలు వేరైనా, కొనసాగుతున్న ఈ ధోరణి పాలక వర్గాల స్వభావం కొంత హెచ్చుతగ్గులతో ఒకటేనని నిర్ధారిస్తుంది. పాలకవర్గ పార్టీలు పరస్పరం తీవ్ర విమర్శలు, నిందారోపణలు చేసుకొంటున్నా, ప్రజానుకూల ప్రత్యామ్నాయాలు సూచించలేని వాటి దౌర్బల్యం వాటి వర్గ స్వభావం, స్వార్థ ప్రయోజనాల సారూప్యతను నిర్ధారిస్తుంది.

తడిసి మోపెడవుతున్న విద్యుత్ కొనుగోలు వ్యయం


డిస్కములు వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసేందుకు అయ్యే మొత్తం ఖర్చులో దాదాపు 75 నుండి 80శాతం వరకు విద్యుత్ కొనుగోలు వ్యయమే. ఈ వ్యయం చార్జీల పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రధానంగా కారణమవుతున్నాయి. విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే ఇంధనాలకయ్యే వ్యయం గణనీయంగా ఉంటున్నది. ఈ వ్యయం పెరుగుదలని బట్టి అస్థిర చార్జీలు ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయి. బొగ్గు, సహజ వాయువు వంటి ఇంధనాల ధరలను వాటి ఉత్పత్తి వ్యయం, న్యాయమైన లాభం ఆధారంగా నిర్ణయించాలి. కానీ కేంద్ర అర్థంలేని విధానాల వల్ల వాటి ధరలు చాలా అధికంగా ఉంటున్నాయి. ఈ ఇంధనాలను ఉత్పత్తి చేసి, విక్రయిస్తున్న సంస్థలకు వస్తున్న అధిక లాభాలు, ప్రభుత్వ రంగ సంస్థలు కేంద్రానికి చెల్లిస్తున్న డివిడెండ్ల భారీ మొత్తాలు దీనిని నిర్ధారిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పిన నాలుగు గ్యాస్ ఆధారిత ప్రయివేట్ విద్యుత్ ప్రాజెక్టులకు రిలయన్స్ సంస్థ కేజీ బేసిన్ నుండి సహజ వాయువు సరఫరా నిలిపివేసింది. దీంతో అవి 2013 మార్చి నుండి మూతపడ్డాయి. విద్యుత్ ఉత్పత్తి చేయకపోయినా డిస్కాములు ఈ ప్రాజెక్టులకు స్థిర చార్జీలను చెల్లించాలన్న వివాదాలు అనేక సంవత్సరాలుగా కొనసాగుతూ చివరకు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులలో ఉభయ తెలుగు రాష్ట్రాల డిస్కాములకు పీపీఎల ప్రకారం వాటాలున్నాయి. రిలయన్స్ సంస్థ కేజీ బేసిన్‌లో సహజ వాయువు ఉత్పత్తిని ప్రారంభించిన, కేంద్రం చేసిన కేటాయింపుల మేరకు ఈ ప్రాజెక్టులకు దానిని సరఫరా చేయాలని రిలయన్స్‌ను ఆదేశించకుండా, స్వేచ్ఛా మార్కెట్‌లో వేలం ద్వారా విక్రయించు కొనేందుకు మోడీ ప్రభుత్వం రిలయన్స్ సంస్థకు వీలు కల్పించింది. అంటే చట్టబద్ధమైన నల్ల బజారు వ్యాపారానికి, విపరీత లాభార్జనకు ద్వారాలు తీసింది. ఆ పద్ధతిలో సహజ వాయువును కొని విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి, విద్యుత్ కొనుగోలుకు విపరీతమైన అధిక ధరలను చెల్లించాల్సి వస్తున్నది. కేజీ బేసిన్లో ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ గ్యాస్ ఉత్పత్తి పెంచడానికి కేంద్రం అనుమతించని పరిస్థితి ఒక పక్క కొనసాగుతుండగా, ఓఎన్‌జీసీ బావుల నుండి రిలయన్స్ దాదాపు రూ.30వేల కోట్ల విలువైన గ్యాస్‌ను అక్రమంగా తీసుకొన్నట్లు డైరెక్టరేట్ జనరల్ అఫ్ హైడ్రోకార్బన్స్ (డీజీహెచ్) నిర్ధారించింది.

బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ వ్యయం విపరీతంగా పెరగడానికి కేంద్రం విధిస్తున్న రకరకాల పన్నులు మరో కారణం. బొగ్గు మూల ధరపై రాయల్టీ, జీఎస్టీ, గ్రీన్ ఎనర్జీ సెస్స్ జాతీయ మైనింగ్ ఎక్స్‌ప్లోరేషన్ పన్ను రాయల్టీ, జిల్లా మినరల్ ఫౌండేషన్ ఛార్జ్ రాయల్టీపై పర్యావరణ, వికాస్ ఉపకార లెవీ వంటివి ఉన్నాయి. బొగ్గు రవాణాకు రైల్వేలు వసూలు చేస్తున్న మొత్తం కూడా బొగ్గు ధరలో 25శాతంగా ఉంది. రోడ్డు రవాణా చార్జీలు 11శాతంగా ఉన్నాయి. డివిడెండ్లు, పన్నులు, సుంకాల రూపంలో కేంద్రం విపరీతంగా ఆదాయం పొందుతున్నా, వినియోగదారులకు విద్యుత్ చార్జీల భారాలను తగ్గించేందుకు ఎటువంటి సబ్సిడీని ఇవ్వటం లేదు.

వినియోగదారులపై అనవసర భారాలు

ఆశ్రిత పెట్టుబడిదారుల, ప్రయివేటు వ్యాపారుల పబ్బం గడిపేందుకు కేంద్రం అనుసరిస్తున్న విధానాలు, విద్యుత్ వినియోగదారులపై అన్యాయంగా విపరీత భారాలను మోపుతున్నాయి. దేశంలో బొగ్గుగనుల సంస్థలకు సమృద్ధిగా నిధులు, యంత్రాలు, కార్మిక శక్తి, బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ, దేశంలో బొగ్గుకు కృత్రిమంగా కొరత సృష్టిస్తున్నారు. దీనితో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు కేంద్రం చేసిన కేటాయింపుల మేరకు బొగ్గు సరఫరా జరగక, విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయి, విద్యుత్ కొరత ఏర్పడుతున్నది. విద్యుత్ ఉత్పత్తికి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని దేశంలో బొగ్గు కొరతను కృత్రిమంగా సృష్టించిన కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల, ప్రయివేటు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులపై ఒత్తిడి తెస్తూ ఆదేశాలను జారీ చేస్తున్నది. ఇక్కడ అదానీ, టాటాల వంటి గుత్తపెట్టుబడిదారీ సంస్థల థర్మల్ ప్రాజెక్టులకు ఈ ఆదేశాలను వర్తింపచేయటం లేదు. మోడీ ప్రభుత్వం కోల్ ఇండియా లిమిటెడ్ ద్వారా ఆస్ట్రేలియాలోని బొగ్గు గనుల నుండి స్వదేశీ బొగ్గు ధరల కన్నా అనేక రెట్లు అధిక ధరలకు బొగ్గును దిగుమతి చేయించి థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అంటగట్టింది. దీంతో, విదేశీ బొగ్గుతో ఉత్పత్తి చేసే ప్రాజెక్టుల విద్యుత్ వ్యయం విపరీతంగా పెరిగింది. మరోపక్క, విద్యుత్ కొరతతో, డిస్కాములు డిమాండ్ తీర్చేందుకు విద్యుత్ ఎక్స్ఛేంజీల



> దేశంలో బొగ్గుగనుల సంస్థలకు సమృద్ధిగా నిధులు, యంత్రాలు, కార్మిక శక్తి, బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ, దేశంలో బొగ్గుకు కృత్రిమంగా కొరత సృష్టిస్తున్నారు. దీనితో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు కేంద్రం చేసిన కేటాయింపుల మేరకు బొగ్గు సరఫరా జరగక, విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయి, విద్యుత్ కొరత ఏర్పడుతున్నది. విద్యుత్ ఉత్పత్తికి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని దేశంలో బొగ్గు కొరతను కృత్రిమంగా సృష్టించిన కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల, ప్రయివేటు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులపై ఒత్తిడి తెస్తూ ఆదేశాలను జారీ చేస్తున్నది. ఇక్కడ అదానీ, టాటాల వంటి గుత్తపెట్టుబడిదారీ సంస్థల థర్మల్ ప్రాజెక్టులకు ఈ ఆదేశాలను వర్తింపచేయటం లేదు.

ద్వారా చాలా అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాయి. ఆ విధంగా ఒక పక్క ఆశ్రిత పెట్టుబడిదారుల, ప్రయివేటు విద్యుత్ వ్యాపారుల పబ్బంగడుపుతూ, వినియోగదారులపై విపరీత భారాలు మోపడానికి మోడీ ప్రభుత్వ విధానాలు దారితీస్తున్నాయి. ఉదాహరణకు, తెలంగాణ డిస్కములు ఎస్‌ఈఎంటీ కార్ప్ రెండవ యూనిట్ నుండి కొంటున్న విద్యుత్‌కు అస్థిర చార్జీలు 2021-22 నుండి 2023-24కు 49.03శాతానికి పెరుగుతున్నట్లు, 2023-24లో ఆ ప్రాజెక్ట్ నుండి కొనే విద్యుత్‌కు యూనిట్‌కు రూ.8.33 చొప్పున చెల్లించాలని వెల్లడించాయి. డిస్కములు 2020-21 సంవత్సరానికి రూ.8790 కోట్ల మేరకు ట్రూ అప్ కింద వినియోగదారుల నుండి వసూలు చేసుకునేందుకు అనుమతించాలని కోరాయి. 2022-23లో రూ.6078.73 కోట్ల మేరకు విద్యుత్ ఛార్జీలను పెంచాక కూడా ఆ సంవత్సరానికి రూ.901 కోట్ల ట్రూ అప్‌ను అనుమతిచ్చాలని టీఎస్‌ఈఆర్‌సీని కోరాయి.


ఎం. వేణుగోపాలరావు

సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నుండి కొనుగోలు చేసే విద్యుత్‌కు 2023-24లో యూనిట్‌కు రూ.6.92 చొప్పున చెల్లించాలని డిస్కాములు చూపాయి. ఈ ప్రాజెక్ట్‌కు సింగరేణి బొగ్గుగనుల నుండి బొగ్గును కేటాయించాలని అనేక సంవత్సరాలుగా కోరుతున్నా మోడీ ప్రభుత్వం ఇంతవరకు సానుకూలంగా ప్రతిస్పందించలేదు. ఇతరులకు కేటాయించిన బొగ్గు సరఫరా చేసాక కూడా తమ బొగ్గు గనులనుండి తమ విద్యుత్ ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గు సరఫరా చేయగలమని సింగరేణి కేంద్రానికి తెలిపినా కూడా స్పందన లేదు. ఒడిశాలోని నాయిని బొగ్గు బ్లాక్ నుండి కేంద్రం ఈ ప్రాజెక్టుకు బొగ్గు కేటాయించింది. మోడీ ప్రభుత్వ మొండివైఖరి వల్ల, బ్రిడ్జి లింకేజీ కింద బొగ్గు సరఫరాకు సింగరేణి మార్కెట్ ధరల ప్రకారం చాలా అధిక ధరలను ఆ సంస్థ థర్మల్ ప్రాజెక్ట్ చెల్లిస్తున్న పరిస్థితి కొనసాగుతున్నది. దీనివల్ల సింగరేణి టి.టి.సి. అధికంగా అస్థిర ఛార్జీలను చెల్లించాల్సి వస్తున్నది. పోటీ ఉంటుందని, విద్యుత్ ఛార్జీలు తగ్గుతాయని సంస్కరణల మద్దతుదారులు చేసిన వాదనలు డొల్ల అని కూడా రుజువయింది. విద్యుత్ ఎక్స్ఛేంజీలు ద్వారా వివిధ విద్యుత్ వ్యాపారులు పోటీపడి తక్కువ ధరకు విద్యుత్‌ను విక్రయించే పరిస్థితి లేకుండా పోయింది. విద్యుత్ వ్యాపారులంతా రింగ్‌గా ఏర్పడి, కొనుగోలు దారులైన డిస్కాములు ఎంత ఎక్కువ రేట్ ఇవ్వడానికి అంగీకరిస్తాయో వాటికి విద్యుత్ సరఫరా చేసే విధానం అమలు జరుగుతున్నది. ఆ విధంగా విద్యుత్ ఎక్స్ఛేంజీలు చట్టబద్ధ నల్ల బజారు వ్యాపారానికి అడ్డాలుగా మారడానికి, కొరత పరిస్థితుల సాకుతో ధరలను విపరీతంగా పెంచడానికి మోడీ ప్రభుత్వం వీలుకల్పిస్తున్నది.

(మిగతా రేపటి సంచికలో)

వలస శవం

ఊహించని కష్టమేదో...
ఊరు దాటేలా ఉసిగొల్పిందో...
భరించలేని బాధేదో, బతుకును ముల్లెగట్టి,
బంధాలకు దూరంగా విసిరేసిందో...

ఏం జరిగిందో కానీ అతడు,
మట్టి దోసిట్లో కంటి ముత్యాల్ని రాల్చి,
కన్న నేలను కన్నార్పకుండా చూస్తూ
వెళ్ళిపోయాడు...

గుండెను ఇంటికి ఝూమర్ లా వేలాడదీసి,
ఆత్మను ఊరి పొలిమేరల్లో ప్రతిష్టించి,
దేహమై దేశ సరిహద్దుతో పాటు,
అశ్రువై కంటి కంచెల్నీ ఒకేసారి దాటేశాడు...

సహ కార్మికులతో బాధల్ని పంచుకుంటూ...
గతాన్ని కన్నీళ్లలో నంజుకుంటూ...



పగటి కత్తికి తెగిపడ్డ కలల్ని పోగేసి...
రాత్రి రంగునద్ది అతికిస్తుండేవాడు....
యజమానుల తిట్లు తిని,
కన్నీళ్ళు తాగి కడుపు నింపుకునేవాడు...
అందుకేనేమో ఎప్పుడడిగినా ఆకలి లేదనేవాడు...

ఆడి, ఆడి అలసిపోయాడో,
ఓడే ఆటను ఆడననుకున్నాడో,
ఆటనాపేశాడు....

చివరికి... లోహ విహంగమై ఎగిరినవాడు,
ఇనుప పెట్టెలో ఇంటిముందు వాలాడు...

పార్థీవ దేహాన్ని తప్ప,
వలస శవాన్ని ఏనాడూ దర్శించని
పగటి వేషగాళ్ళు హఠాత్తుగా ప్రత్యక్షమై
కపట నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు...

"జాతరొస్తున్నట్లుంది"
విన్యాసాలెన్నో చేస్తున్నారు కానీ,
అదేంటో మరి..?!
"వాళ్ళ చొక్కాకున్న తెలుపులో,
కొంచెమైనా మనసుకంటడం లేదు."

- జాబేర్ పాషా
00968 78531638

నగరం నుండి మొదటి మహిళ

సయ్యద్ సాల్వా ఫాతిమా... భారతదేశంలో కమర్షియల్ పైలట్ లైసెన్స్ పొందిన కొద్దిమంది ముస్లిం మహిళల్లో ఒకరు. ఆమె శిక్షణ సమయంలో ఎల్లప్పుడూ హిజాబ్ ధరించే ఉండేది. ఒక ముస్లిం మహిళా ఇలాంటి వృత్తిని చేపట్టడంతో మన భారతదేశంలోనే కాదు విదేశాలలో కూడా ఎన్నో ప్రశంసలు అందుకుంది.

హైదరాబాద్ పాతబస్తీకి చెందిన ఫాతిమా 34 ఏండ్ల మొదటి మహిళా వాణిజ్య పైలట్. ఆమె రెండు సీట్ల సెస్నాలో ఆకాశానికి ఎగిరింది. అయినప్పటికీ ఆమె ఎయిర్ బస్ 320లో గ్లోబల్ ఎయిర్ ట్రాఫిక్‌ను నావిగేట్ చేస్తుంది. 550 గంటలు ఎగురుతూ తన గమ్యాన్ని చేరుకుంది. ఫాతిమా బేకరీ ఉద్యోగి సయ్యద్ అష్ఫాక్ అహ్మద్ కుమార్తె. ఫాతిమా పాతబస్తీలోని మొఘల్‌పురాలోని నిరుపేద కుటుంబంలో పుట్టింది. ఈమెకు నలుగురు తోబుట్టువులు ఉన్నారు.



ఆర్థిక సమస్యల కారణంగా మలక్‌పేటలోని నియో స్కూల్ ఐక్యాలో చదువుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్ ఆలీఫియా హుస్సేన్ ఆమె చదువు కోసం రెండేండ్ల పాటు స్పాన్సర్ చేసింది. తర్వాత ఆమె సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, మెహదీపట్నం నుండి ఇంటర్మీడియట్ కోర్సును పూర్తి చేసింది.

ఐదేండ్ల కఠిన శిక్షణ...

ఫాతిమా విజయానికి పేదరికం అడ్డుకట్ట వేయలేదు. తనకు చిన్నప్పటి నుంచి పైలట్ కావాలనే కోరిక బలంగా ఉండేది. 12వ తరగతి ఉత్తీర్ణత సాధించిన తర్వాత ఇంజినీరింగ్‌లో చేరింది. అప్పడే ఆమె కల గురించి అడిగారు. వెంటనే పైలట్ కావాలన్నది తన కల అని చెప్పింది. ఫాతిమా 2007లో ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ అకాడమీలో అడ్మిషన్ పొందింది. ఐదేండ్ల కఠిన శిక్షణ తర్వాత కమర్షియల్ పైలట్, ప్రైవేట్ పైలట్ & ఫ్లైట్ రేడియో టెలిఫోన్ ఆపరేటర్ లైసెన్స్ పొందింది. శిక్షణ మొత్తంలో ఫాతిమా తన 123 గంటల సోలో ఫ్లైట్‌తో సహా సెస్నా 152, 172లో 200 గంటలు ప్రయాణించింది. కానీ ఆమె కల నెరవేరడానికి ఇది సరిపోలేదు. ఆమె ఇప్పుడు బోయింగ్ లేదా ఎయిర్‌బస్ వంటి పెద్ద విమానాలలో శిక్షణ పొందవలసి ఉంది. ఆ శిక్షణ కోసం ఆమెకు 30-35 లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చింది.

ప్రభుత్వ సాయంతో...

ఫాతిమా నైపుణ్యాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం సాయం చేసేందుకు ముందుకు వచ్చింది. న్యూజిలాండ్‌లో ఆమె శిక్షణ కోసం ప్రభుత్వం రూ.36 లక్షలు మంజూరు చేసింది. న్యూజిలాండ్‌లో తన శిక్షణ సమయంలో ఫాతిమా 5 గంటల పాటు బహుళ-ఇంజిన్ విమానాన్ని నడిపింది. అలాగే 10 గంటలపాటు సిమ్యులేటర్‌పై శిక్షణ పొందింది. ఐర్లాండ్‌లోని గల్ఫ్ ఏవియేషన్ అకాడమీలో ఎయిర్‌బస్‌లో టైప్-రేటింగ్‌కు అర్హత సాధించింది.

ప్రతి అమ్మాయికి స్ఫూర్తి...

ప్రస్తుతం ఫాతిమా ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో పనిచేస్తుంది. తాను కచ్చితంగా పైలట్ కావాలనే కలలు కన్నానని, అయితే ఈ కల నెరవేరుతుందని ఎప్పుడూ అనుకోలేదని ఉప్పొంగిన ఫాతిమా చెప్పింది. అయితే ఆమె తన కల నెరవేర్చుకోవడానికి ఎన్నో సమస్యలను, అసమానతలను ధైర్యంగా ఎదుర్కొంది. అందుకే ఫాతిమా జీవితం కేవలం ముస్లిం సమాజానికే కాకుండా జీవితంలో సమస్యలను ఎదుర్కొనే ప్రతి భారతీయ అమ్మాయికి కూడా స్ఫూర్తిగా నిలుస్తుంది.

శరీరంలోని జీవక్రియలు సక్రమంగా జరగాలన్నా, కండరాలు బలోపేతం కావాలన్నా ప్రొటీన్లు ఎంతో అవసరం. ప్రత్యేకించి ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు... ఊపిరి సలపని పనులతో నిత్యం బిజీగా ఉండే వారు అలసట కలగకుండా ఉండాలంటే ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీర కండర వ్యవస్థ దృఢమవుతుంది. దీంతో ఎలాంటి ఒత్తిడి, అలసట లేకుండా సునాయాసంగా అన్ని పనులు చేసుకోవచ్చు. అలాగే ప్రొటీన్లు గుండె బలంగా ఉండేందుకు, రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకూ దోహదం చేస్తాయి. తగినన్ని ప్రొటీన్లు లభించే ఆహారం తీసుకుంటే తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండిన భావన కూడా కలుగుతుంది.



ప్రొటీన్లు చాలా అవసరం


సాధారణంగా చేపలు, చికెన్, మటన్ లాంటి మాంసాహార పదార్థాల్లో ప్రొటీన్లు అధికంగా దొరుకుతాయి. అయితే మాంసాహారం అధికంగా తీసుకోవడం వల్ల కొందరిలో కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నమవుతాయి. దీంతో చాలామంది మాంసాహారం మానేసి శాకాహారానికే ప్రాధాన్యమిస్తుంటారు. ఇదే సమయంలో శాకాహారం తీసుకునే వారిలో చాలామంది ప్రొటీన్ల లోపంతో బాధపడుతున్నట్లు ఓ అధ్యయనంలో తేలింది. అయితే ప్రొటీన్లు అధికంగా ఉండే కొన్ని శాకాహార పదార్థాలను ఆహారంలో భాగం చేసుకుంటే ఈ సమస్య నుంచి సులభంగా బయటపడవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. పైగా కూరగాయలు, పండ్ల నుంచి లభించే ప్రొటీన్లతో అమైనో యాసిడ్లు నేరుగా శరీరానికి అందుతాయని, ఇవి కండరాలను బలోపేతం చేస్తాయంటున్నారు. మరి ప్రొటీన్లు పుష్కలంగా దొరికే కొన్ని శాకాహార పదార్థాలు ఉన్నాయి.

పప్పుధాన్యాలు



కందులు, పెసలు, మినుములు మొదలైన వాటిలో ఉండే పోషకాలతో పలు ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. పప్పు ధాన్యాల్లో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిలోని పీచు పదార్థాలు కూడా శరీర బరువును పెరగకుండా చేస్తాయి. అదే విధంగా వీటిలో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిస్ లాంటి దీర్ఘ కాలిక వ్యాధుల నుంచి రక్షణ కలిగిస్తాయి.

చిక్కుళ్లు



కిడ్నీ బీన్స్ (రాజ్మా), బ్లాక్ బీన్స్ వంటి చిక్కుడు జాతికి చెందిన పదార్థాల్లో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే ప్రొటీన్లతో పాటు బి-విటమిన్, ఫైబర్ శరీరానికి పుష్కలంగా అందుతాయి. అంతే గాకుండా వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి వ్యాధుల నుంచి రక్షణ కలిగిస్తాయి.

పచ్చి బఠాణీలు



ఒక కప్పు పచ్చి బఠాణీల్లో 8 గ్రాముల వరకు ప్రొటీన్ ఉంటుంది. వీటిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గిస్తాయి. తద్వారా క్యాన్సర్, డయాబెటిస్ లాంటి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చు. ఇవేకాక వీటిలో ఎ, కె, సి విటమిన్లు, ఫైబర్ వంటి పోషకాలు కూడా సమృద్ధిగా ఉంటాయి.

సోయాబీన్స్

సోయాబీన్స్‌లో మాంసాహారంతో సమానంగా ప్రొటీన్లు ఉంటాయి. ఇందులోని బి, డి, ఇ- విటమిన్లు, క్యాల్షియం, ఐరన్, జింక్, అన్‌శ్యాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి రక్తపోటు సమస్యను నివారిస్తాయి. సోయా లో ఉండే యాంటీఆక్సిడెంట్ సమ్మేళనం మహిళల్లో మెనోపాజ్ సమస్యలను నివారించడంతో పాటు రొమ్ము క్యాన్సర్ నుంచి కూడా రక్షణ కలిగిస్తుంది.



నట్స్



ప్రొటీన్లతో నిండి ఉండే బాదం పప్పు, పిస్తా, అక్రోట్ వంటి గింజలను ప్రతిరోజూ తీసుకుంటే గుండెకు ఎంతో మేలు చేస్తాయి. వీటితో పాటు కొన్ని రకాల విటమిన్లు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి మితంగా తీసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

నైపుణ్యాలు ఉండాలి

విద్యార్థి దశ నుంచి ఒక్కసారే పోటీ ప్రపంచంలోకి అడుగుపెట్టడమంటే కొంత ఒడుదొడుకులెదురవుతాయి. ముఖ్యంగా కార్పొరేట్ సంస్థల్లో బాధ్యతలు చేపట్టాలంటే కొన్నిరకాల నైపుణ్యాలు తెలిసుండాలి. వీటినే కార్పొరేట్ సర్వైవల్ స్కిల్స్ అంటున్నారు నిపుణులు. ఆ నైపుణ్యాలేంటో మనమూ తెలుసుకుందాం...

కెరియర్‌లోకి అడుగుపెట్టేటప్పుడు తెలియని వారు, గతంలో పరిచయం లేరంటూ ఎదుటపడిన వ్యక్తులను దాటి ముందుకెళ్లకూడదు. గతంలో ముఖ పరిచయం లేని వ్యక్తులతో కూడా మాట కలపడం నేర్చుకోవాలి. ఓ పలకరింపు అవతలివారి గురించి తెలుసుకోవడానికి మార్గం అవుతుంది. తెలియనివారితోనూ సునాయాసంగా మాటకలపడం కొత్త సామర్థ్యమే. ప్రాజెక్టు సంబంధించి తెలియని వ్యక్తులతో ఏర్పాటు చేసే సమావేశాల్లో ఈ నైపుణ్యం ఉపయోగపడుతుంది. కార్పొరేట్ కార్యాలయంలో విధులు నిర్వహించాలంటే చేపట్టాల్సిన బాధ్యతలపై అవగాహన ఉంటే సరిపోదు. సహోద్యోగులతో మెలగడం, ఉన్నతాధికారితో మాట్లాడే విధానంలో మెలకువలు తెలిసుండాలి.

ఆఫీస్‌లో సహబృందంతో పరస్పర అనుబంధం ప్రాజెక్ట్ వివరించడం లాంటివి తేలిక చేస్తుంది. ఒకరి నొకరికి పరిచయం చేయడానికి ముందుగా బృందంలో ప్రతి ఒక్కరూ తెలుసుకుందాలి. ఇలా జరగాలంటే వారితో విడివిడిగా మాట్లాడటానికి ప్రయత్నించాలి. దీంతో ముందుగానే అందరి గురించి వివరాలు తెలుస్తాయి. ఆ తర్వాత బృంద నేతృత్వంలో అందరి మధ్య అనుబంధాన్ని ఏర్పరిచి విజయవంతంగా ప్రాజెక్ట్ పూర్తిచేయించొచ్చు.



ఎదుటివారు చెప్పేది పూర్తిగా వినడానికి ప్రయత్నించాలి. అవసరమైతే చర్చించడానికి ఆసక్తి చూపించాలి. స్థాయి ఏదైనా... విజయం చిన్నదైనా.. 'పెద్దదైనా'.. దానికి కారణమైనవారిని గుర్తించి ప్రశంసించాలి. అవతలివారు అపజయంతో నిరుత్సాహంగా ఉన్నప్పుడు.. మరోసారి ప్రయత్నించమంటూ ప్రోత్సహించాలి. అవసరమైతే సలహా ఇవ్వాలి. అంతే కాదు, ప్రాజెక్ట్ సొంతైనా.. అనుకున్న సమయానికి పూర్తి చేయలేకపోయినా, దానిపై సరైన అవగాహన లేకపోయినా సహాయం అడగడానికి వెనకాడొద్దు.

ఏఈ పరీక్ష రద్దు

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించారు. 48 గంటల్లో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేయకుంటే ఆమరణ దీక్ష చేస్తామంటూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. పేపర్ లీకేజీ వ్యవహారం రాజకీయ అంశంగా మారిందన్న అభిప్రాయం వినిపిస్తున్నది. బుధవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో సిట్ దర్యాప్తు చేపట్టింది. అధికారులు, సిబ్బందిని అడిగి పలు విషయాలను అధికారులు తెలుసుకున్నారు.

అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి : సీపీఐ(ఎం)

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. హాస్టళ్లలో ఉంటూ, కోచింగ్‌లకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తూ నానా ఇబ్బందులు పడ్డ నిరుద్యోగులకు ఈ ఘటన తీవ్ర నష్టదాయకమని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే మనస్తాపాన్ని కలిగించిందని పేర్కొన్నారు. విచారణ కోసం ఏర్పాటు చేయబడ్డ సిట్ ఎనిమిది మంది నిందితులను రిమాండ్‌కు పంపడంతోనే సరిపెట్టకుండా, నియామకాల విషయంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, కార్యదర్శి, మొత్తం సభ్యుల పాత్రపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లీకేజీ అయిన పేపర్ల పరీక్షలను రద్దు చేసి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని కోరారు. పేపర్ లీకేజీలో టీఎస్‌పీఎస్సీ ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. డిపార్ట్‌మెంట్ వ్యవహారాలు, పరీక్ష పేపర్లు, కీలకమైన పాస్‌వర్డ్ కమిషన్ లోని చైర్మెన్, సెక్రటరీలకు మాత్రమే తెలియాల్సిన వివరాలని, కానీ సెక్షన్ ఆఫీసర్ ఇంత కీలకమైన పేపర్లను ఫోటో తీసుకున్నాడంటే అక్కడ వాటికి భద్రత కల్పించడంలో బాధ్యులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో అర్థమవుతుందని తెలిపారు. ఇప్పటికే గ్రూప్-1 పరీక్షా పేపర్లు కూడా లీకైనట్టుగా వస్తున్న వార్తలపై టీఎస్‌పీఎస్సీ పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలకు పాల్పడ్డ నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

సమగ్ర విచారణ జరపాలి : ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ

(మొదటిపేజీ తరువాయి)

డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ మాట్లాడుతూ ప్రశ్నపత్రం లీకేజీపై టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యులు, కార్యదర్శి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రహస్య విభాగంలోకి ఇతర సిబ్బంది వెళ్లకుండా మానిటరింగ్ ఉద్యోగులు ఎలా ప్రవేశించారో చెప్పాలని డిమాండ్ చేశారు. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ లు వారి చేతికి ఎలా వచ్చాయని ప్రశ్నించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సంతోష్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, నాయకులు కిరణ్, నాగేంద్ర, డీవైఎఫ్ఐ నగర నాయకులు హస్మీబాబు తదితరులు పాల్గొన్నారు. లీకేజీ కుంభకోణం తెరవెనుక ఉన్న ప్రభుత్వ పెద్దలను అరెస్టు చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది.

ఆచార్య ఎస్వీ సత్యనారాయణకు డి.లిట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణకు మద్రాస్ విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ లిటరేచర్(డి.లిట్) పట్టాను ప్రదానం చేసింది. బుధవారం ఈ మేరకు మద్రాస్ వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆధునిక తెలుగు సాహిత్య ధోరణులు అనే అంశంపై ఆయన సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి డి.లిట్ పట్టా ఇవ్వనున్నట్టు తెలిపారు. ఎస్వీ సత్యనారాయణ 28 గ్రంథాలను వెలువరించారు. మరో 34 గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. రష్యా, ఆస్ట్రేలియా, అమెరికా, న్యూజిలాండ్, సింగపూర్, నేపాల్, ఈజిప్టు, మలేషియా, మారిషస్, తదితర దేశాల వేదికలపై తెలుగు సాహిత్యంపై ప్రసంగించారు.

ఈడీ నోటీసులు రద్దుచేయాలి

(మొదటిపేజీ తరువాయి)

చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. మనీ లాండరింగ్ కేసులో కవితను ఈడీ అధికారులు ఈ నెల 11న గంటల తరబడి ప్రశ్నించారని గుర్తు చేశారు. కవిత నివాసానికి బదులుగా ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించడంలో అర్థంలేదని పేర్కొన్నారు. తమ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించడం క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకమని వాదించారు. క్రిమినల్ ప్రొసీజర్‌లోని సెక్షన్ 160కి సంబంధించిన ప్రొవిజన్‌ను ఉల్లంఘించినట్టేనని అన్నారు. ఎఫ్ఐఆర్‌లో కవిత పేరు లేకపోయినప్పటికీ, కేంద్రంలో అధికారంలో ఉన్న అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఢిల్లీ ఎక్సైజ్ పాలసీని అడ్డుగా పెట్టుకుని ఆమెపై రాజకీయ కారణాలతో ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఇది రాజకీయ కుట్రలో భాగమని పేర్కొన్నారు. అయితే ఇప్పటికిప్పుడు ఈడీ విచారణను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేయడానికి ధర్మాసనం అంగీకరించలేదు. ఈ విషయంలో కవిత చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

వీడియో కాన్ఫరెన్స్‌లో విచారణ జరపాలి

ఈడీ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నదని కవిత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అధికార పార్టీ ఆదేశంతో ఈడీ తనను వేధిస్తున్నదని, ఈ విషయంలో ఈడీ చట్ట విరుద్ధంగా వ్యవహరించిందని తెలిపారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్‌లో తన పేరు ఎక్కడా లేదని, కొంతమంది వాంగ్మూలం ఆధారంగా ఈ కేసులో తనను ఇరికించారని పేర్కొన్నారు. తనకు వ్యతిరేకంగా ఇచ్చిన స్టేట్‌మెంట్లకు విశ్వసనీయత లేదని తెలిపారు. 'ఈడీ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నది. శరత్ చంద్రా రెడ్డి అనే సాక్షిని కొట్టడమే దీనికి నిదర్శనం. అరుణ్ రామచంద్ర పిళ్లైను బెదిరించి వాంగ్మూలం తీసుకున్నారు. ఆయన తన వాంగ్మూలాన్ని వెనక్కి తీసుకున్నారు. ఈడీ అధికారులు నా సెల్‌ఫోన్‌ను బలవంతంగా తీసుకున్నారు. చట్ట విరుద్ధంగా నా ఫోన్ సీజ్ చేశారు. నా ఫోన్ సీజ్ చేసిన సమయంలో నా వివరణ తీసుకోలేదు. నా నివాసంలో, వీడియో కాన్ఫరెన్స్‌లో విచారణ జరపాలి' అని పేర్కొన్నారు. అలాగే, ఈ కేసులో తనకు ఈడీ ఇచ్చిన సమన్లు రద్దు చేయాలని కోరారు. తనపై ఎలాంటి బలవంతపు(అరెస్ట్ వంటి) చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

నేడు ఈడీ ముందుకు కవిత

ఢిల్లీ మద్యం కుంభకోణంలో నేడు (గురువారం) ఈడీ ముందు ఎమ్మెల్సీ కె.కవిత హాజరుకానున్నారు. ఈ నెల 11న కవితను దాదాపు తొమ్మిది గంటల పాటు విచారించిన ఈడీ అధికారులు ఆమె ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. నేడు మళ్లీ ఈడీ విచారించనుంది. కవిత విచారణకు అరుణ్ పిళ్లై, బుచ్చిబాబు వాంగ్మూలాలు కీలకం కానున్నాయి.

మోడీ మహానటనకు.. ఆస్కార్ వస్తుండే

(మొదటిపేజీ తరువాయి)

పాటు దేశం మొత్తం సంపదను దోచి ఆయన దోస్తు అదానీ ఖాతాలు లక్షల కోట్లతో నింపుతుండని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి అదే దోస్తు నుంచి ఫండ్ తీసుకుని ప్రతిపక్షాల ఎమ్మెల్యేలను కొంటూ దేశాన్ని ఆగం చేస్తుండని విమర్శించారు. ప్రతేడాది రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ... వేసుకోవడం కూడా ఉద్యోగమని కొత్త నిర్వచనం ఇచ్చాడని దుయ్యబట్టారు. 'మోడీ మాటలు కోటలు దాటేలా.. చేతలు పకోడీలు' అంటూ వ్యాఖ్యానించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, నల్లధనం వెనక్కి తెస్తామని హామీలు గుప్పించి అమలు చేయడం లేదని విమర్శించారు. మన్మోహన్‌సింగ్ హయాంలో వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.400 ఉంటే సన్నాసి, దద్దమ్మ అని విమర్శించిన మోడీ... మరి తన హయాంలో రూ.1200 ధర అయిందని, మరి నిన్ను ఏమనాలంటూ ప్రశ్నించారు. తెలంగాణపై మోడీ కక్ష కట్టిందని, విభజన హామీలు అమలు చేయట్లేదన్నారు. గాలి గత్తరకేసులతో ఆగమాగం చేస్తుండని, మోడీ, ఈడీలకు భయపడబోమని, ఏం చేసుకుంటావో చేసుకోండని సవాల్ విసిరారు.

ఏదైనా ప్రజాకోర్టులోనే తేల్చుకుంటామన్నారు. ఎవరు నీతిమంతులో, ఎవరు అవినీతిపరులో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. 2023 ఎన్నికల్లో బీజేపీకి డిపాజిట్ కూడా రానివ్వకుండా ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. మళ్లీ ఒక్క ఛాన్స్ ఇవ్వాలంటూ కాంగ్రెస్ వాళ్లు గొంతులేసుకుంటున్నారని, 55 యేండ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. కరెంటు, నీళ్లు, విద్య ఇవ్వలేని తెలివిలేనోళ్లు మళ్లీ ఏం చేస్తారని విమర్శించారు. మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపించి రాష్ట్రంలో కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, జాజుల సురేందర్, బిగాల గణేష్‌గుప్తా, ఎమ్మెల్సీ రాజేశ్వర్, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభరాజు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

చైనా ఎన్నటికీ సోషలిజాన్ని వీడదు...

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభ ఉపన్యాసం చేస్తూ ప్రజలను మొదట ప్రాధాన్యత ఇచ్చే ఆధునీకరణ విధానాన్ని మాత్రమే చైనా అనుసరిస్తుందని అన్నారు. సోషలిస్టు విధానాన్ని తాము ఎన్నటికీ విడనాడబోమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం పేరుతో ప్రజల మధ్య చిచ్చు రేపేందుకు కుట్రలు చేయడం ప్రజాస్వామ్యమే కాదని స్పష్టం చేశారు. వలసవాదాన్ని, అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న అభివృద్ధి విధానాన్ని చైనా ఎప్పటికీ అనుసరించబోదని పేర్కొన్నారు. చైనా తన చేతల్లోనే అనేక సమస్యలకు పరిష్కారాలను చూపుతోందని, అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందని దేశాల (ఉత్తర, దక్షిణ దేశాలు) మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నదని స్పష్టం చేశారు. ఏ దేశానికి ఆదేశంలో ప్రత్యేక పరిస్థితులు ఉంటాయని, ఆ ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆధునీకరణ విధానాన్ని అవలంభించాలని సూచించారు. అంతేతప్ప ప్రపంచమంతా ఒకే విధంగా ఆధునీకరించబడాలనే విధానాలను రుద్దే ప్రయత్నాలు సరైనవి కావన్నారు. ఆధునీకరణ అంటే ఒక దేశం మరొక దేశాన్ని దోచుకోవడం కాదని, అన్ని దేశాలు కలిసి అభివృద్ధి చెందడమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వెనుజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, సౌత్ ఆఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, నికరాగ్వా అధ్యక్షుడు డేనియల్ ఒర్టెగా, బొలీవియా మాజీ అధ్యక్షుడు ఇవో మోరేల్స్, సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ తదితరులు మాట్లాడారు. అనేక దేశాధినేతలు, వివిధ దేశాలకు చెందిన అధికార, ప్రతిపక్షనేతలు పాల్గొన్నారు. దక్షిణాఫ్రికా, పోర్చుగీస్, వియత్నాం, బ్రెజిల్, ఉత్తరకొరియా తదితర దేశాల కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలు కూడా పాల్గొన్నాయి. సీపీఐ(ఎం) తరపున ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఏ బేబీ, కేంద్ర కమిటీ సభ్యుడు ఆర్.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



పార్లమెంట్ టు ఈడీ

(మొదటిపేజీ తరువాయి)



విదేశీ గడ్డపై దేశ ప్రజల గురించి మోడీ చేసిన అవమానకర వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలన్నారు. 'అదానీ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ దర్యాప్తును ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయని కాంగ్రెస్ లోక్‌సభ నాయకుడు అధీర్ రంజన్ చౌదరి అన్నారు. అయితే బీజేపీకి జేపీసీ అక్కర్లేదని, ఎందుకంటే బీజేపీ అవినీతి బయటపడుతుందని పేర్కొన్నారు. అలాగే బీజేపీ అసలు రూపం కూడా ప్రజలకు తెలుస్తుందని, ప్రతిపక్షంలో ఉన్నంత వరకు జేపీసీ కావాలని డిమాండ్ చేశారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు భయపడుతున్నారని పేర్కొన్నారు.

ప్రతిష్టంభన

పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో వరుసగా మూడో రోజూ కూడా అదే తీరు కొనసాగింది. అధికార బీజేపీ, ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో పార్లమెంట్ ఉభయ సభలు స్తంభించాయి. అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారంపై ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేయగా, రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని అధికార బీజేపీ ఎంపీలు.. అధికార, ప్రతిపక్షాల పోటాపోటీ ఆందోళనలతో పార్లమెంట్ ఉభయసభల్లో వాయిదాల పర్వం కొనసాగింది. బుధవారం లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు ప్లకార్డులు చేబూని ఆందోళన చేపట్టారు. అదానీ అంశంపై విచారణకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా నినాదాలు హోరెత్తించారు. దానికి పోటీగా అధికార బీజేపీ ఎంపీలు ఎదురుదాడికి దిగారు. నినాదాలతో గందరగోళం సృష్టించారు. లండన్‌లో దేశం పరువుతీసే వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ.. సభకు క్షమాపణలు చెప్పాలని పట్టుబట్టారు. సభ సజావుగా సాగేందుకు సభ్యులు సహకరించాలని లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా కోరారు. అయినప్పటికీ అధికార పక్ష ఎంపీలు వెనక్కి తగ్గలేదు. ప్రతిపక్ష ఎంపీలు కూడా తమ ఆందోళనను కొనసాగించారు. వెంటనే సభను స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో కూడా అదే పరిస్థితిలో ఎటువంటి మార్పు రాకపోవడంతో సభను గురువారానికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే తీరు కొనసాగింది.

అదానీపై విచారణ చేయాల్సిందే...

(మొదటిపేజీ తరువాయి)

చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం... కాంగ్రెస్ సృష్టించిన ప్రభుత్వ సంపదను క్రోని క్యాపిటలిస్టులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రధాని మోడీ నిర్వీర్యం చేస్తూ వ్యవస్థలను దిగజారుస్తున్నారని విమర్శించారు. 130 కోట్ల ప్రజలకు చెందిన సంపదను కార్పొరేట్లకు పంచి పెడుతూ ప్రజలను పేదలుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ఆస్తులు ఒక్కరికే కట్టబెడుతున్నారని విమర్శించారు. దేశ సంపద ప్రజలకు చెందాలన్నారు. కాంగ్రెస్ ప్రజల కోసం పని చేసిందని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక మన దేశ సంపద కోసమని చెప్పారు. దేశం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పాదయాత్ర చేశారని చెప్పారు. హిండెన్‌బర్గ్‌లో వచ్చిన కథనం ప్రపంచాన్ని షేక్ చేసిందని గుర్తు చేశారు. ఈ దేశం నుంచి మోడీని వదిలించుకోవాలని పిలుపునిచ్చారు. అదానీపై మోడీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. తమ పోరాటం ప్రజల కోసం, ఈ దేశం సంపద రక్షణ కోసమని చెప్పారు. అరెస్టు అయిన వారిలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే సీతక్క, కార్యనిర్వాహక అధ్యక్షులు అంజన్‌కుమార్ యాదవ్, మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, ఎస్సీసెల్ కార్యదర్శులు నదీమ్ జావిద్, రోహిత్ చౌదరి, జి చిన్నారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లు రవి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, నాయకులు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, ఫిరోజ్‌ఖాన్, సామ రామ్మోహన్‌రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, వెంకట్, శివసేనారెడ్డి, డీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల చైర్మెన్‌తోపాటు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మితో పేదలకు మేలు'



నవతెలంగాణ-సంతోష్ నగర్

షాదిముబారక్, కల్యాణ లక్ష్మి పథకాల వల్ల నిరుపేదలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. నియోజక వర్గంలోని చార్మినార్, సైదాబాద్, అంబర్ పేట మండల పరిధిలోని సుమారు 30 మంది లబ్దిదారులకు షాదిముబారక్, కల్యాణలక్ష్మి చెక్కు లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి లాంటి పథకాలు మహిళలకు అండగా ఉంటాయన్నారు. మహిళలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమా నికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారుల శ్రీకాంత్, హరిబాబు, సాయికిరణ్, మహ్మద్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్తీక్ రెడ్డి



నవతెలంగాణ-మీర్‌పేట్

మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదా లక్ష్మీనర్సింహ్మస్వామి ఆలయం పంచమ వార్షికోత్సవం సందర్భంగా పట్లోళ్ల కార్తిక్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలని దేవున్ని ప్రార్థించానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, కాలనీల సంక్షేమ సంఘం కార్యదర్శి వంటేరు నర్సింహారెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పరీక్షల కాలంలో వైరల్ పంజా..

- జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న హాస్టల్ విద్యార్థులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



నవతెలంగాణ-హయత్ నగర్

ప్రస్తుతం వైరల్ ఫీవర్లు పంజా విసురుతున్నాయి. అసలే ఇది పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా సీజన్ మారితే కొందరిలో జ్వరం, జలుబు,దగ్గు లాంటి అనారోగ్య సమస్యలు వస్తూ ఉంటాయి. దీంతో మాములు అనారోగ్య లక్షణాలు, వైరస్ వల్ల వచ్చే లక్షణాల మధ్య తేడా గుర్తించడం చాలా కష్టం అవుతుంది. కొన్ని వైరస్‌ల లక్షణాలు గుర్తించడం చాలా కష్టం అలాంటి వాటిలో ప్రస్తుతం అడేనో, ఇన్‌ఫ్లూయెంజా(H3N2) వైరస్ ఫీవర్స్ దేశమంతా విజృంభి స్తున్నాయి. ఈ వైరల్ ఫీవర్స్ పిల్లలతో పాటు పెద్దలకు కూడా సోకుతున్నాయి. కానీ చిన్నపిల్లల్లో రోగ నిరోధక శక్తి తక్కువ కాబట్టి పిల్లలు ఈ వైరస్ బారిన ఎక్కువగా పడుతున్నారు.

హయత్ నగర్ లోని ఓ ప్రయివేటు ఇంటర్మీడియట్ బాలికల హాస్టల్ లో ఇటీవల బాలికలు వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడినట్టు తెలిసింది. అసలే ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఉన్న పరిసరాల పరిశుభ్రతపై కనీసం సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అడేనో వైరస్

తేలిక పాటి జలుబు, జ్వరం, గొంతు నొప్పి, శ్వాస కోశ ఇబ్బందులు న్యుమోనియా, కండ్ల కలక,కడుపులో మంట, తీవ్రమైన గ్యాస్ట్రో ఎంటేరిటీస్ వంటి లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఈ వైరస్ సోకిన వ్యక్తులు దగ్గడం,తుమ్మడం తాకడంతో పాటు మాల మూత్రాల ద్వారా కూడా ఇది ఇతరులకు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఇన్ ఫ్లూయెంజా

జ్వరం,దగ్గు,ముక్కు కారడం, శ్వాస కోశ సమస్యలతో పాటు ఒళ్ళు నొప్పులు, వికారం,వాంతులు లేదా అతిసారం వంటి H3N2 ఇన్‌ఫ్లూయెంజాలో ప్రధాన లక్షణాలు. ఉబ్బసం, ఊపిరితిత్తుల సంబంధ వ్యాధులు ఉన్న వారికి ఈ ఫీవర్ ఎక్కువ నష్టాన్ని కలిగిస్తుంది .ఒకరి నుంచి ఒకరికి సోకుతుండడంతో ఆహారం కలిసి తినవద్దు. గొంతు నొప్పి తగ్గించేందుకు గోరు వెచ్చని నీటిలో కల్ల ఉప్పు వేసుకుని,తరచు పుక్కిలి ఊయడం,లేదా మార్కెట్ లో యాంటీ సెప్టిక్ లోషన్లు కలిపి పుక్కిలి పట్టడం మంచి ది. నీరు కలుషితం అయితే కాచి చల్లార్చి తాగాలి.ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి.శరీరం డీ హైడ్రేషన్ కాకుండా కొబ్బ రి నీరు ఎక్కువగా తాగాలి.వేప ఆకు డెంగ్యూ వైరస్ వ్యాప్తి ని అరికడుతుంది. వేప ఆకులతో స్నానం చేయాలి. ఆహార పదార్థాలపై మూతలు పెట్టాలి.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

ఇక ఈ వైరల్ ఫివర్‌ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. చేతులను క్రమం తప్పకుండా సబ్బుతో కడగాలని, లక్షణాలు ఉన్నవారు మాస్కులు ధరించాలని చెబుతున్నారు. అలాగే షేక్ హ్యాండ్‌లు, ఆలింగనాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మడం వంటివి చేయొద్దని సూచిస్తున్నారు.

సీఎస్, డీఎస్‌లకు ముగిసిన శిక్షణ కార్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో

పదో తరగతి వార్షిక పరీక్షల విధుల్లో పాల్గొనే చీఫ్ సూపరిటెండెంట్స్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, కస్టోడియన్‌లు, జాయింట్ కస్టోడియన్‌తో పాటు ఇతర విధులు నిర్వహించే ఉద్యోగులకు పరీక్షల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ చేపట్టింది. హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణీ ఆదేశాల మేరకు పరీక్షల విభాగం ఆధ్వర్యంలో నగరంలోని 12 జోన్లకు చెందిన సీఎస్, డీఎస్‌లతో పాటు ఇతర అధికారులకు రెండు రోజులుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం అమీర్ పేటలోని డీకే రోడ్డులోని కన్యా గురుకుల హై స్కూల్‌లో అమీర్‌పేట్, ఖైరతాబాద్, గోల్కొండ జోన్లకు చెందిన అధికారులకు టెన్త్ వార్షిక పరీక్షల నిర్వహణపై అవగాహన శిక్షణ ఇచ్చారు. పరీక్షల సమయంలో అధికారుల విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పలు సలహాలు, సూచనలు చేసినట్టు జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ జూపల్లి నర్సింగ్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఆర్.రోహిణీ, డిప్యూటీ ఈవోలు చిరంజీవి, సామ్యూల్ రాజ్, వెంకటేశ్వర్లు, యాదయ్య, డిప్యూటీ ఐవోఎస్‌లు తదితరులు పాల్గొన్నారు. వచ్చే నెల 4వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే.

పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్



నవతెలంగాణ-తుర్కయాంజల్

టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి.శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం రాగన్నగూడలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బి.శంకర్ మాట్లాడుతూ గ్రూప్ 1 పరీక్ష పేపర్ కూడా లీకైనట్టుగా వార్తలు వస్తున్నాయని, తెలంగాణ ఏర్పడిన నుంచి నియామకాలు లేక ఎన్నో యేండ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూపులు చూస్తున్న నిరుద్యోగులు ఇలాంటి చర్యలు తీవ్ర నష్టం చేస్తాయన్నారు. లక్షల రూపాయలు వెచ్చించి, విలువైన సమయం కేటాయించి లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలకు కోచింగ్ తీసుకుంటున్నారన్నారు. బోర్డులో ఇంత జరుగుతున్నా కనీసం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వహించిన బోర్డు చైర్మెన్ బి. జనార్దన్ రెడ్డి, బోర్డు కార్యదర్శి పాత్రపైనా, సభ్యుల పాత్రపైనా విచారణ జరిపించాలని కోరారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి చైర్మెన్‌ను తొలగించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హెచ్చరించారు. వీరితోపాటు బోర్డులో వీరి వెనక ఉన్న వారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రణయ్, జిల్లా ఉపాధ్యక్షులు మస్కు చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధు, జిల్లా కమిటీ సభ్యులు విప్లవ్, శ్రీకాంత్, మద్దెల శ్రీకాంత్, తరంగ్, స్టాలిన్, శివ పాల్గొన్నారు.

నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

- మేయర్ జక్క వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ కమాన్ నుంచి ప్రతాప్ సింగారం క్రాస్ రోడ్డు వరకు చేపట్టిన నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులలో వేగం పెంచాలని మేయర్ జక్క వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారులతో కలిసి వారు రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు తగు సూచనలు చేయడంతో పాటు రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనుల పట్ల మేయర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందుతున్న నగరం మరింత విస్తరిస్తున్న క్రమంలో పెరుగుతున్న జనాభాకు సరిపడ మౌలిక వసతుల కల్పన కోసం మున్సిపల్ కార్పోరేషన్ బహత్తర ప్రణాళికలను అములు చేస్తుందని మేయర్ అన్నారు. ఇందులో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ కమాన్ నుంచి ప్రతాప్ సింగారం క్రాస్ రోడ్డు వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులను చేపట్టడం జరిగిందన్నారు.

ఇరువైపులా డ్రయినేజీ నిర్మాణంతో పాటు ఇప్పటికే వినియోగంలో ఉన్న పాత సి.సి లైన్ల స్థానంలో ప్రజల అవసరాల నేపథ్యంలో 200 డయా కలిగిన పైప్ లైన్ నిర్మాణ పనులు హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ సీవరేజ్ బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అదేవిదంగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, స్తంబాలను మార్చే ప్రక్రియ పనులు సుమారు 75 శాతం పూర్తయిందని తెలిపారు. పాత గ్రామంలో రోడ్డు విస్తరణకు ప్రజల స్వచ్చంద సహకారం వల్ల ప్రభుత్వం టీడీఆర్ బాండ్స్ త్వరగా అందిస్తుండటంతో గహ యజమానులు తమ ఇండ్లను వెనక్కి జరుపుతుండడంతో రోడ్డు విస్తరణ పనులు జాప్యంలేకుండా జరుగుతున్నాయన్నారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే టీడీఆర్ అందజేయాలని మేయర్ అధికారులకు ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనులు నిర్ణిత గడువు లోపు పూర్తి చేయాలని అధికారులను మేయర్ ఆదేశించారు. కార్పొరేటర్లు మద్ది యుగేందర్ రెడ్డి, కౌడే పోచయ్య, టీపీఎస్ రాజీవ్ రెడ్డి, విద్యుత్ అధికారులు, జలమండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్

నవతెలంగాణ-సరూర్‌నగర్

సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లలో ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఎక్కడ అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. మొదటి రోజు కావడంతో విద్యార్థులు సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 538 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 532 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారు. సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్‌తో పాటు ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి వెంక్యా నాయక్ సందర్శించారు. ఎక్కడా లోటుపాట్లు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని కళాశాల నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు.



అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ -ఎల్బీనగర్

ఎస్.ఎన్.డి.పి. పనుల్లో భాగంగా లింగోజిగూడా డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో జరుగుతున్న పనులను బుధవారం ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు కలిసి పరిశీలించారు. పది రోజుల క్రితం ఎస్.ఎన్.డి.పి.అధికారులచే ఎమ్మెల్యే సమావేశం ఏర్పాటు చేసి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్ర గార్డెన్స్ నుంచి ఉదయ్ నగర్ కాలనీ మీదుగా ఒక ప్యాకేజీ, వంగ శంకరమ్మ నుంచి పద్మ నగర్ కాలనీ మీదుగా ఒక ప్యాకేజీ పనులు చేయడం జరుగుతుందన్నారు. ఈ పనుల్లో వేగం పెంచి వచ్చే మే వరకు పూర్తి స్థాయిలో పనులు చేయాలని అధికారులకు, గుత్తేదారులకు తెలిపారు. అలాగే పనుల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్షణ చర్యలు పాటిస్తూ పనులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వరప్రసాద్ రెడ్డి,మధు సాగర్, ఆశిష్ యాదవ్, అనిల్, రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన 'వార్షిక స్పోర్ట్స్'







నవతెలంగాణ-సిటీబ్యూరో

గోషామహల్‌లోని శివ కుమార్‌లాల్ పోలీస్ స్టేడియంలో పోలీసుల ఆధ్వర్యంలో 'వార్షిక స్పోర్ట్స్' అట్టహా సంగా ప్రారంభమైయాయి. ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీనటుడు అడవి శేష్, నగరపోలీస్ కమిషనర్ సీపీ ఆనంద్ ప్రారంభించారు. నాలుగురోజులపాటు కొనసాగే ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్ బాల్‌తోపాటు పలు క్రీడల్లో సీపీ ఉత్సాహంగా పాల్గొన్నారు. అయితే సీపీ ఆడిన తీరు ప్రతి ఒక్కరిని విశేషంగా ఆకట్టుకుంది. సీపీ ఫిట్‌నెస్ చూసి ప్రతీ ఒక్కరు ఆశ్చర్యపోయారు.



'సంప్రదాయాలను పిల్లలకు తెలియజేయాలి'

నవతెలంగాణ-బోడుప్పల్

నేటి తరం విద్యార్థులకు విద్యతో పాటు కుటుంబ సంప్రదా యాలు, బంధాలు, మానవ సంబం ధాల గురించి తెలియజే యాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని శ్రీ చైతన్య విద్య సంస్థక చైర్మెన్ మల్లెంపాటి శ్రీధర్ అన్నారు. బుధవారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో "ఫ్యామిలీ గ్లోరీ" పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ బంధాలు తెలిపేలా మన వ్యవహారికం ఉండాలని అన్నారు. డైరెక్టర్ శ్రీ విద్యా, ప్రిన్సిపాల్ ఎ.రాజేం దర్, ఎజీఎం వెంకట్, కో ఆర్డినేటర్ రమేష్ బాబు, డీన్ మల్లికార్జున్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌంటింగ్‌కు భారీ బందోబస్తు ఏర్పాటు



నవతెలంగాణ-హయత్‌నగర్

సరూర్‌నగర్ స్టేడియంలో గురువారం టీచర్స్ ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎల్బీనగర్ జోన్ డీసీపీ సాయి శ్రీ తెలిపారు. బుధవారం ఆమె నవతెలంగాణతో మాట్లాడుతూ గురువారం ఉదయం 8గంటలకే కౌంటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు 660మంది పోలీస్ సిబ్బందితో 4అంచెల బందోబస్తును ఏర్పాటు చేశామని చెప్పారు.

గొప్ప మహానుభావుడు మాన్యశ్రీ కాన్షీరామ్

- డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

భారతదేశంలో నిస్వార్థంగా జీవిత కాలం అణిచివేతకు గురై ప్రజల కోసం పని చేసి, వారిని అధికారంలోకి తీసుకు రావడం కోసం జీవించి నిరూపించిన గొప్ప మహాను భావుడు బీఎస్పీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షిరామ్ అని డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్ అన్నారు. బుధవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలాపూర్ గ్రామంలో కాన్షీరామ్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ హాజరై కాన్షీరామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇబ్రం శేఖర్ మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో తాను మాత్రమే నాయకుడు కావాలని కోరుకుని ఎందరో ఉంటారని, కానీ అందుకు అందుకు భిన్నంగా తాను కాకుండా ఇతరులను నాయకులుగా చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ముఖ్యంగా పేదలు మహానుభావుల చరిత్రను అధ్యయనం చేయకపోవడం వల్లనే, వారు రాజ్యాధికారం సాధించలేక పోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అణగారిన ప్రజలు పూలే, అంబేద్కర్ కన్షిరామ్ చరిత్రలను అధ్యయనం చేయాలని సూచించారు. డబ్బుతోనే అధికారం వస్తుందని వేల సంవత్సారాలుగా భావిస్తున్న ప్రజలకు పూలే, అంబేద్కర్, కన్షిరామ్‌లు డబ్బు లేకుండానే అధికారం సాధించి చరిత్ర సృష్టించినట్టు గుర్తు చేశారు. కులం లేదని చెప్పేవారు మనల్ని మోసం చేస్తున్నట్లేనని, అందుకు ఉదాహరణ అత్యున్నత పదవిలో ఉన్న దేశ ప్రథమ పౌరుడు మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, దివంగత మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ వంటి నాయకులను కూడా దేవాల యాలలోకి రానియ్యక పోవటం అందుకు నిదర్శమన్నారు. కులం పోయేంతవరకూ కులంతోనే పోరాటం చేయాలని కాన్సిరామ్ చెప్పారన్నారు. అధికారంతోనే బలవంతంగానైన ఆత్మగౌరవం దక్కుతుందని కాన్షీరామ్ తెలిపినట్టు ఆయన పేర్కన్నారు. అది నిరూపించుటకు మాయావతిని ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి చేసి చూపించారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా రానున్న ఎన్నికల్లో రాష్ట్ర బీఎస్పీ అధినేత డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అధ్వర్యంలో బీఎస్పీ అధికారంలోకి రావాలని, అప్పుడే అన్ని వర్గాల ప్రజలకు తగిన న్యాయం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్ నర్సింగ్, పి.బాబు,అశోక్, ప్రత్యూష్, గుణ,సిద్ధు,కళ్యాణ్, మహేష్, నాగేష్, ఇబ్రహీం శాంతి కుమార్, రజనీకాంత్, వేణు, సంజీవ, శరత్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

తూకాలలో మోసాలను అరికట్టేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలి

- వినియోగదారుల రాష్ట్ర కమిటీ సభ్యులు పగిళ్ల జోజి



నవతెలంగాణ-నాగోల్

నిత్యావసర వస్తువులలో జరిగే కల్తీలను నియంత్రించి తూకాల్లో మోసాన్ని అరికట్టేందుకు సంబంధించిన శాఖ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని వినియోగదారుల రాష్ట్ర కమిటీ సభ్యులు పగిళ్ల జ్యోజి డిమాండ్ చేశారు. బుధవారం అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని నాగోల్‌లోని ప్రజాసంఘాల కార్యాలయం డాంగే భవన్‌లో వినియోగదారుల జిల్లా బాధ్యులు బొడ్డుపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులను మోసం చేస్తున్న సంస్థలపై సంబంధిత శాఖల అధికారులు ఉక్కు పాదం మోపాలన్నారు. సామాన్య ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కొంతమంది వ్యాపారస్తులు కల్తీ వస్తువులను విక్రయిస్తూ తమ ఇష్టారాజ్యంగా అధిక ధరలకు అమ్ముతూ మోసం చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా తూకాలలో కూడా మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ అటువంటి వాటిని గుర్తించి నేరంగా పరిగణిస్తూ చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. తప్పుడు తూకాలపై, కల్తీ వస్తువులపై మండల, జిల్లా స్థాయిలలో కమిటీలను ఏర్పాటుచేసి వినియోగదారులను చైతన్య పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో వై యాదగిరి, ఎండీ ఇస్మాయిల్, బీ యాదయ్య కే రవి ,విక్రంలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి అమ్మాయి పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ చేయూత



నవతెలంగాణ-నాగోల్

పేద కుటుంబానికి చెందిన ఆడబిడ్డ పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్, ఉప్పల పౌండేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త చేయూతనిచ్చారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని, మేడిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం జంగయ్య గౌడ్ - లక్ష్మి ల కూతురు మానస వివాహం కోసం హైదరాబాద్ నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసంలో తమ కూతురు పెండ్లికి సహకారం అందించాలని కోరారు. దాంతో ఉప్పల శ్రీనివాస గుప్త వారి ఆర్థిక పరిస్థితులను తెలుసుకొని ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సతీమణి ఉప్పల ఫౌండేషన్ కో- చైర్ పర్సన్ ఉప్పల స్వప్నతో కలసి మంగళ సూత్రం, మెట్టెలు,చీర, గాజులు విరాళంగా అందజేశారు. ఒక్క ఆర్యవైశ్యులకు మాత్రమే కాకుండా అన్ని కులాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి పుస్తె, మెట్టెలు సహాయం చేయడం జరుగుతుందని శ్రీనివాస గుప్త తెలిపారు. ఈ కార్యక్రమంలో వధువు మానస, వారి కుటుంబ సభ్యులు రాములు, బీఆర్ఎస్ పార్టీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో మరో దారుణం

- భార్యను గొడ్డలితో నరికి చంపి, మూడు నెలల కుమారుడిని సంపులో పడేసిన వ్యక్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

కట్టుకున్నోడే కడతేర్చాడు. కంటికిపాపలా కాపాడాల్సిన కన్నతండ్రే అంతమొందించాడు. భార్యను గొడ్డలితో నకిరి, ఆపై మూడు నెలల పసికందును సంపులో పడేసిన దారుణ సంఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం రేపింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, బండరావిరాల గ్రామానికి చెందిన కందికంటి నర్సింగ్ రావుకు ముగ్గురు కుమార్తెలతోపాటు ఓ కుమారుడున్నాడు. పెద్ద కుమార్తె లావణ్య(28)కు 2018లో అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన ఏర్పుల ధన్‌రాజ్‌తో వివాహం జరిపించారు. దంపతులకు కూతురు ఆద్య(2ఏండ్లు), కుమారుడు క్రియన్స్(3 నెలలు) లున్నారు. కుమారిడి డెలివరీ కోసం వెళ్లిన లావణ్య పుట్టింట్లోనే ఉంది. పెండ్లయినప్పటి నుంచి అదనపు కట్నం డబ్బులు తీసుకురావాలంటూ లావణ్యతో ధన్‌రాజ్ గొడవపడుతున్నాడు. అప్పటి నుంచి మాన సికంగా వేధించడం, శారీరకంగా చితకబాదేవాడు. రోజురోజుకు ధనరాజ్ వేధింపులు అధికం కావడంతో లావణ్యా తన తల్లిదండ్రులకు విషయం చెప్పింది. దాంతో రెండు మూడు సార్లు పెద్దమన ఉషులు వచ్చి నచ్చజెప్పి వెళ్లారు. అయినా కూడా ధన్‌రాజ్ ప్రవర్తనలో మార్పురాలేదు ఇదిలావుండగా బుధవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో తన కొడుకుకు టీకా వేయించాలని లావణ్యను, పిల్లలను పుట్టింటి నుంచి ధన్‌రాజ్ ఇంటికి తీసుకొ చ్చాడు. ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే భార్యతో గొడవ పడిన ధనరాజ్ ఒక్కసారీగా గొడ్డలితో ఆమెను దారు ణంగా నరికి చంపాడు. అనంతరం మూడు నెలల కుమారుడిని సంపులో పడేసి హతమార్చాడు. ఇది చూసిన రెండేండ్ల కుమార్తె ఆద్య భయంతో ఇంటి నుంచి బయటకు పారిపోయింది. దారుణానికి పాల్పడిన ధన్‌రాజ్ మాత్రం అందరూ చూస్తుం డగానే రక్తపు మరకలు అంటిన బట్టలతోనే పరార య్యాడు. స్థానికుల సమాచారంతో వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం, సీఐ ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

నూతన పైప్ లైన్ పనుల పర్యవేక్షణ



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్ పరిధిలోని మంగాపురం కాలనీలలో మంచినీటి సరఫరా మెరుగుకై చేపట్టిన నూతన పైప్ లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ పర్యవేక్షించారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ మంచినీటి సరఫరా శాశ్వత పరిష్కారానికి చేపట్టిన పైప్ లైన్ పనుల నాణ్యతా ప్రమాణాలు పరిశీలించిన ఆయన ఎల్లవేళలా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళ్తామని అన్నారు. వాటర్ వర్క్స్ ఏఈ వేణు గోపాల్, శానిటరీ సూపర్వైజర్ మోహన్, కాలనీ అధ్యక్షులు అశోక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డును అందుకున్న అనురాధరెడ్డి

నవతెలంగాణ-మల్కాజిగిరి

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మనం ఫౌండేషన్ (ప్రొద్దుటూరు, కడప) వారు శక్తి మహిళా మండలి అధ్యక్షురాలు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణా రాష్ట్ర అధ్యక్షురాలు కె.అనురాధరెడ్డిని ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డుకు ఎంపిక చేసినట్లు మనం ఫౌండేషన్ ఛైర్మెన్ చక్రవర్తి తెలిపారు. నేటి సమాజంలో మహిళల సమస్యలపై నిరంతరం స్పందిస్తున్న తీరు బాగుందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల కోసం నేను చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపి అవార్డును ఇచ్చి ప్రోత్సహిస్తున్న నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు సావిత్రిభాయ్ పూలే అవార్డు రావడం గర్వంగ ఉందన్నారు.



టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సీబీసీఐడీతో సమగ్ర విచారణ జరిపించాలి

- టీఎస్‌పీఎస్‌సీ చైర్మెన్ జనార్ధన్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలి
- ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్

నవతెలంగాణ-కాప్రా

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సీబీసీఐడీతో సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ కమిషన్ చైర్మెన్ తక్షణమే రాజీనామా చేయాలని, సిట్‌తో కాకుండా సీబీసీఐడీతో విచారణ జరిపించాలని, పేపర్ లీకేజీ, చైర్మెన్, కార్యదర్శి, కమిషన్ సభ్యుల బాధ్యతా రాహిత్యాన్ని నిరసిస్తూ టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడిస్తుంటే అక్రమంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటు.. పేపర్ లీకేజీపై సీబీసీఐడీతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాన్ఫిడెన్షియల్ విభాగంలోకి ఇతర సెక్షన్లలో డ్యూటీ చేసే వ్యక్తులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎలా ప్రవేశించారో, యూజర్ ఐడీ, పాస్ వర్డ్‌లు వారి చేతికి ఎలా వచ్చాయో, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పులిదిండి ప్రవీణ్ కుమార్ మరియు నెట్వర్క్ మేనేజర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రాజశేఖర్ రెడ్డిల పాత్రపై పూర్తి స్థాయి దర్యాప్తు చేయాలన్నారు.



తెలంగాణ రాష్ట్రంలో వేలాది నిరుద్యోగులు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పట్ల నమ్మకం కోల్పోయారని, వేల రూపాయలు కోచింగ్ సెంటర్లలో వెచ్చించి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువత తీవ్ర మానసిక ఒత్తిడికి గురౌతున్నారని అన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో 350పైగా ఉద్యోగ సిబ్బంది అవసరం ఉండగా కేవలం 80 మంది సిబ్బందితో కాలం వెళ్ళదీస్తున్నారని, కాన్ఫిడెన్షియల్ విభాగంలోకి ఎవరు వెళ్తున్నారో పర్యవేక్షణ లేదని, టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ జనార్ధన్ రెడ్డి ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నెట్వర్క్ మేనేజర్ రాజశేఖర్, బీజేపీ కార్యకర్త అని, రాజకీయ కోణంలోనూ దీనిపై సీబీసీఐడీతో విచారణ జరిపించాలని కోరారు. అసిస్టెంట్ ఇంజినీర్, వెటర్నరీ సర్జన్ పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయని, ఇటీవల నిర్వహించిన అన్ని పోటీ పరీక్షలు గురుకుల ప్రిన్సిపాల్, గ్రూప్-1 తదితర ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయనే సందేహం అభ్యర్థులలో నెలకొందని, దీనంతటిపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని కోరారు. సిట్ వేసి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. కమిషన్ సభ్యులందరిపైనా విచారణ చేపట్టాలని తెలంగాణ నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని, అవసరమైతే కొత్త కమిషన్ వేయాలని, ప్రస్తుత కమిషన్ రద్దు చేయాలని కోరారు. తెలంగాణ నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని నిరసన తెలుతున్న మాపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి తీవ్ర తోపులాట నడుమ అరెస్టు చేశారనీ, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకత్వానికి పలువురికి గాయాలయ్యాయని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ లెనిన్ గువేరా, నాయకులు కిరణ్, నాగేంద్ర, అస్మి పాల్గొన్నారు.

ఉద్రిక్తంగా మారిన చలో రాజ్‌భవన్

నవతెలంగాణ-కాప్రా



అదానీ షేర్ల స్కామ్‌పై దర్యాప్తునకు డిమాండ్ చేస్తూ బుధవారం కాంగ్రెస్ నేతలు చేపట్టిన ఛలో రాజ్‌భవన్ కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. గాంధీ భవన్ నుంచి ర్యాలీగా బయలు దేరిన రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో పాటు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డిని పంజాగుట్ట పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న కాంగ్రెస్ నేతలను మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు పరామర్శించారు. ఈ క్రమంలో పోలీసులు, నేతల మధ్య తోపులాట జరిగింది. రోడ్డుపై కూర్చుని కాంగ్రెస్ నేతలు ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ సందర్భంగా సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ దేశంలోని ఆస్తులు ఒక్కరిద్దరికి కట్టబెడుతున్నారని ఆరోపించారు. దేశ సంపద దేశ ప్రజలకే చెందాలన్నారు. కాంగ్రెస్ ప్రజల కోసం పనిచేసిందని... కానీ మోదీ వచ్చాక దేశ సంపదను ఒక్కరిద్దరికే కట్టబెడుతున్నారని మండిపడ్డారు. దేశం ప్రమాదంలో పడిందన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దేశం కోసం పాదయాత్ర చేశారన్నారు. అదానీపై మోదీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. తమ పోరాటం ప్రజల కోసం, ఈ దేశం సంపద, రక్షణ కోసమని స్పష్టం చేశారు. రాజ్‌భవన్‌కు వెళ్లి తమ నిరసన తెలపడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఛలో రాజ్‌భవన్ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరీ, చిన్నారెడ్డి, మాజీ పీసీసీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, వర్కింగ్ ప్రసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, నాయకులు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, సంగిశెట్టి జగదీష్, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని గోదావరి పాలిమర్స్ పరిశ్రమలో 140 మంది కార్మికులకు గత 8 నెలలుగా వేతనాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒక కార్మికుడు కుటుంబాన్ని పోషించుకునేందుకు అప్పులు చేసి వాటిని తిరిగి చెల్లించలేక మానసిక వేదనకు గురై గుండెపోటుతో మరణించాడు. ఈ విషాద సంఘటన గురించి తెలుసుకున్న ప్రేరణ ఫౌండేషన్ ఒక్కో కార్మికుని కుటుంబానికి పది కిలోల బియ్యం, కిలో కంది పప్పు చొప్పున 60 కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మెన్ శరత్ సుదర్శి మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలను తమ ఫౌండేషన్ నిర్వహిస్తుందన్నారు. అలాగే అనాథ, నిరుపేద పిల్లలకు చదువుకునేందుకు దాతల సహకారంతో ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. అమ్మాయిలు రుతుస్రావ సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ పంచుతున్నామన్నారు. ఈ విధంగా మహిళా సాధికారత కోసం సరుకులు స్పాన్సర్ చేసినటువంటి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. సహృదయా ఫౌండేషన్ (యుఎస్ఎ) వ్యవస్థాపకులు బిందు తాడివాకా, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రివ్యాల్ ఉయ్యూరి, దయానంద వరప్రసాద్, లయన్స్ క్లబ్ ఆఫ్ కుషాయిగూడ సభ్యులు మధుసుదన్ రెడ్డి, రాంచదర్, కోయా వెంకటేశ్వరరావు, గోపి, హేమంత్ రాజులకు ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ధర్నా

అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

ఎన్.బాలమల్లేష్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్. బాలమల్లేష్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ అల్వాల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్. బాలమల్లేష్ మాట్లాడుతూ... అర్హులైన పేదలందరికీ ఇండస్థలాలు ఇవ్వాలని, ఇల్లు లేని పేదలకు డబుల్ బెడ్ రూమ్స్ ఇవ్వాలని కోరారు. ఇంటి స్థలం ఉన్న వాళ్లకు ఇల్లు నిర్మించుకోవడానికి ఆరు లక్షల రూపాయలు సహాయం చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు తెల్ల రేషన్ కార్డులు అందించాలన్నారు. ఏప్రిల్ లో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 171లో అక్రమ నిర్మాణంలో ఉన్నాయని, పట్టా స్థలం కబ్జా అవుతుందని అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని విమర్శించారు. అధికారులు ఇకనైనా సర్వే చేసి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరారు. కౌకూర్ భాష పేటలో సర్వేనెంబర్ 27లో చెరువును కబ్జా చేస్తూ భూ కబ్జాదారులు అమ్ముకుంటున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నాపత్రాలు లీకేజీ పై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంపును పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాయి లు గౌడ్, అల్వాల్ మండల సిపిఐ కార్యదర్శి సహదేవ్ , జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



హామీలు అమలు చేయలేని బీఆర్ఎస్ ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

నవతెలంగాణ-మల్కాజిగిరి



హామీలు అమలు చేయలేని అసమర్ధ ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ విమర్శించారు. బుధవారం హాత్ సే హాత్ జూడో యాత్ర మౌలాలి డివిజన్‌లో ఉల్బత్ నగర్, హనుమాన్ నగర్, కృష్ణానగర్, శివాజీ నగర్, ఆర్టీసీ కాలనీలో బుధవారం రోజున నందికంటే శ్రీధర్ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని బీఆర్ఎస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన రాష్ట్ర ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ ఉమామహేశ్వరి యాదవ్, వంశీ ముదిరాజ్, వినోద్ యాదవ్, వి శ్రీనివాస్ గౌడ్, సంతోష్ ముదిరాజ్ సానాది శంకర్ మహేందర్ గౌడ్ హమీద్ భాయ్ అరుణ్ కుమార్ కిరణ్ హైదర్ బాయ్ రైముద్దీన్ శ్యామ్ సత్యనారాయణ ఆలీ జాన్ అల్ మదర్ సలీం బాకర్ రవి జయరాం నాగరాజ్ గౌడ్ చక్రం శ్రీను ముక్తర్ మజీద్ చంద్రకళ భాగ్యరాణి అన్నమ్మ ఆషారాణి స్వప్న, ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ ఉమామహేశ్వరి వినోద్ యాదవ్, అరుణ్ గౌడ్, వంశీ ముదిరాజ్, అమిద్, లిజన్ హైదర్, నరసింహ, ముక్తర్, భాగ్యరాణి, చంద్రకళ, ఆషారాణి, అన్నమ్మ, చక్రం సలీం, శ్యామ్, క్రాంతి, కిస్తీ థామస్, మాజీ త్ హైమద్, కిరణ్, సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి, ఉమేష్ సింగ్, వి శ్రీనివాస్ గౌడ్, సంతోష్ ముదిరాజ్, యువత అధ్యక్షులు రెబ్బ వాసు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించిన పలువురిపై కేసులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించిన పలువురిపై బేగంబజార్ పోలీసులు కేసులు నమోదు చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో మంగళవారం పలువురు విద్యార్థులు, వివిధ సంఘాలు టీఎస్‌పీఎస్సీ ముట్టడిం చేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఈ మేరకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు ఏ.బానుప్రకాష్‌తో పాటు మరో ఆరుగురిపై వివిధ సెక్షన కింద నాన్‌బెయి లబుల్ కేసులు నమోదు చేసిన బేగంబజార్ పోలీసులు వారిని అరెస్టు చేశారు.

కుషాయిగూడ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా రజిత



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా కె.రజిత బుధవారం బాధ్యత స్వీకరించారు. చెంగిచెర్ల డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసి బదిలీపై కుషాయిగూడ డిపోకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ డిపో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

సాంసంగ్ గెలాక్సీ ఎ23 సిరీస్‌పై ఆసక్తికరమైన ఆఫర్స్

నవతెలంగాణ - హైదరాబాద్

సాంసంగ్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ ఫ్లాప్ గెలాక్సీ ఎస్ 23 అల్ట్రా, గెలాక్సీ ఎస్ 23 ప్లస్, గెలాక్సీ ఎస్ 23 స్మార్ట్ ఫోన్స్‌పైన ఆసక్తికరమైన ఆఫర్స్‌ని ప్రకటించింది. గెలాక్సీ ఎస్ 23 సిరీస్ పరికరాలు ఒక తరాన్ని, పర్యావరణం మీద చెప్పుకోతగ్గ తక్కువ ప్రభావం ఉన్న ఉత్తమశ్రేణి ఇన్నోవేషన్స్‌తో అధిగమించాయి. దేశంలో అమ్మబడుతున్న అన్ని గెలాక్సీ ఎస్ 23 స్మార్ట్ ఫోన్స్ కంపెనీ యొక్క నోయిడా కర్మాగారంలో తయారు చేయబడుతున్నాయి. వినియోగదారుల కోసం గెలాక్సీ ఎస్23 అల్ట్రాతో రూ.18000 వరకు ప్రయోజనాలు, 12 నెలల వరకు ఖర్చులేని బ్యాంక్ ఈఎంఐ పొందవచ్చు. ఎస్ 23 సిరీస్ ఇప్పుడు ప్రతినెలా కేవలం రూ.5209 (ఖర్చులేని ఈఎంఐ 24నెలల వరకు) వద్ద అదనంగా రూ. 10000 వరకు అప్ గ్రేడ్ బోనస్తో చేజిక్కించుకోవచ్చు. వినియోగదారులు గెలాక్సీ ఎస్ 23 ప్లస్, గెలాక్సీ ఎస్23ని రూ.13000 ప్రయోజనాలు, 12నెలల ఖర్చులేని బ్యాంక్ ఈఎంఐతో పొందవచ్చు. రూ.3125 నెలకి (ఖర్చులేని ఈఎంఐ 24నెలల వరకు) అదనపు రూ 8000 అప్ గ్రేడ్ బోనస్తో అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది.

హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశంలో కార్పొరేటర్

నవతెలంగాణ-ఓయూ



హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ వారితో బుధవారం సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ సమావేశమయ్యారు. సీతాఫలమండిలోని కుట్టి వెళ్లోడి హాస్పిటల్‌లో డిప్యూటీ డీఎంహెచ్ఓ సక్కుబాయి ఆధ్వర్యంలో జరిగిన హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడారు. కుట్టి వెళ్లోడి, చిలకలగూడలోని యూసీహెచ్‌సీ హాస్పిటల్ అభివృద్ధి పనుల గురించి వాటికి కావాల్సిన పరికరాల గురించి చర్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రత్యూష, పాని, సూపర్వైజర్ విజయ రాణి, బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌తో యూనియన్ నాయకుల భేటీ

నవతెలంగాణ-ఓయూ



స్వచ్ఛ గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ సభ్యులు నగర డిప్యూటీ మేయర్ శ్రీలత, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డిలను తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో యూనియన్ ఆఫీస్ కోసం ప్రత్యేక రూంను కేటాయించాలని కోరారు. డిప్యూటీ మేయర్ స్పందిస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్‌తో మాట్లాడి యూనియన్ ఆఫీస్ ఏర్పాటుకు సహకరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బండారి యాదగిరి, సభ్యులు నాగేష్, కర్ణం గోపి, సభ్యులు పాల్గొన్నారు.

మొదటి రోజు ప్రశాంతం

- మొదలైన ఇంటర్ పరీక్షలు
- హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో 4,596 మందికి పైగా విద్యార్థుల గైర్హాజరు
- చివరి నిమిషంలో విద్యార్థుల ఉరుకులు పరుగులు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్
- నేడు ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం





షెడ్యూల్ ప్రకారమే సెకండియర్ పరీక్ష

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. హైదరాబాద్ జిల్లాలో మొదటి పరీక్షకు 3091 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. పరీక్షల సమయం కావడంతో నగరంలో అక్కడక్కడ ట్రాఫిక్ జామ్‌లు కావడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంలో కొంత గందగోళానికి గురయ్యారు. అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించినప్పటికీ.. అక్కడక్కడ విద్యార్థులు రోడ్లపై ఉరుకులు పరుగులు తీస్తూ కనిపించారు. 9 గంటల తర్వాత వచ్చిన విద్యార్థులను కొన్ని కేంద్రాల్లో అనుమతించకపోవడంతో వారు వెనుతిరిగారు. ఇక నగరంలోని పలు పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్‌తో పాటు హైపవర్ కమిటీలు ఆకస్మికంగా తనిఖీలు చేశాయి. తొలి రోజు ఎలాంటి మాల్ ప్రాక్టీస్, మాస్ కాపియింగ్ వంటి ఘటనలు చోటుచేసుకోలేదనీ, ప్రశాంతంగా జరిగినట్టు సంబంధిత అధికారులు ప్రకటించారు. ఇక ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు షెడ్యూలు ప్రకారం నేడు జరగనున్నాయి.

షెడ్యూల్ ప్రకారమే సెకండియర్ పరీక్ష

హైదరాబాద్ జిల్లాలో తొలిరోజు ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసిన నేపథ్యంలో ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే జరగనున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి.ఒడ్డెన్న తెలిపారు. విద్యార్థులు నిర్దేశిత సమయానికి గంట ముందే ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఆలస్యంగా వచ్చిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించరని తెలిపారు. పరీక్షల నిర్వహణకుగాను జిల్లా వ్యాప్తంగా 233 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

హైదరాబాద్, మేడ్చల్‌లో 4596 మంది గైర్హాజరు

హైదరాబాద్ జిల్లాలో మొత్తం 84,253 మంది ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 81,162 మంది హాజరయ్యారు. ఇందులో జనరల్ 79,723 ఉండగా.. అందులో 76,880 మంది హాజరు కాగా, 2843 గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 4,530 మంది విద్యార్థులకు గాను 4,282 మంది హాజరు కాగా.. 248 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా తొలిరోజు 3091 మంది గైర్హజరయ్యారు. ఇకపోతే కొన్ని చోట్ల ఉదయం 8.45 తర్వాత వచ్చిన విద్యార్థులను మొదటి తప్పిదంగా హెచ్చరించి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఆయా సెంటర్ల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో విద్యార్థులు కొంత ఇబ్బంది పడ్డారు. ఇక మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం జనరల్ విద్యార్థులు 64,301 మందికిగాను 62,892 మంది హజరు కాగా.. 1409 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 1,452 మంది విద్యార్థులకు గాను, 1,356 మంది హాజరు కాగా, 96 మంది గైర్హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

హైదరాబాద్ జిల్లా పరిధిలో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్, ఎనిమిది సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. వీటితోపాటు హైపర్ కమిటీ, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయగా.. ఆయా బృందాలు పరీక్షల నిర్వహణపై తనిఖీలు చేశారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారులను నియమించారు. హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పలు పరీక్షా కేంద్రాలను బుధవారం సందర్శించారు. రత్న కాలేజీ, పేజ్ కాలేజీ, కేశవ్ మెమోరియల్, ప్రగతి మహావిద్యాలయ కాలేజీల్లో పరీక్షల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంబడి ఇంటర్ విద్యాధికారి ఒడ్డెన్న, ఇతర అధికారులు ఉన్నారు. ఇక మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో డీఐఈవో కిషన్ పర్యవేక్షించారు.

బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించి మద్యం ఉత్పత్తులను నిలిపేయాలి

- మానవ హక్కుల వేదిక నాయకులు జీవన్ కుమార్



నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణలో బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించి సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలని మానవ హక్కుల వేదిక నాయకులు జీవన్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళల పోరాటాల వారోత్సవాల సభను బుధవారం బాగ్ లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు జీవన్ కుమార్, ప్రజా గాయకురాలు విమలక్క, తెలంగాణ రైతు కూలీ పోరాట సంఘం నాయకులు కొమురయ్య తదితరులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవన్ కుమార్ మాట్లాడుతూ బీడీ కార్మికులకు కనీస వేతనాలు అందించి అర్హులైన వారందరికీ జీవనభృతి చెల్లించాలన్నారు. దేశవ్యాప్తంగా మద్యపానాన్ని నిషేధించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రముఖ గాయని విమలక్క మాట్లాడుతూ రాష్ట్రంలో ఒకవైపు విద్యాసంస్థల్లో బలవన్మరణాలు మరోవైపు అవినీతి వ్యవస్థల్లో జరుగుతున్న ఉద్యోగరహిత పరీక్ష పత్రాల లీకేజీ లక్షలాదిమంది జీవితాలతో చెలగాటమాడినట్లే అన్నారు. పీఓడబ్ల్యూ స్త్రీ విముక్తి కన్వీనర్ ఏ పద్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అరుణోదయ నాయకులు రాకేష్, శ్రామిక శక్తి తెలంగాణ వీడియో వర్కర్స్ యూనియన్ నాయకురాలు రాజేశ్వరి, పీడీఎస్‌యూ విజంభన నాయకులు అల్లూరి విజయ్, అరుణోదయ నగర అధ్యక్షులు పోతుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జూలో రాయల్ బెంగాల్ టైగర్ దత్తత

నవతెలంగాణ-హైదరాబాద్





నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని రాయల్ బెంగాల్ టైగర్‌ని ఐదేండ్ల చిన్నారి రియా కాళహస్తి తన 5వ పుట్టిన రోజు సందర్భంగా దత్తత తీసుకున్నారు. రియా పుట్టినరోజు సందర్భంగా తల్లి తండ్రులు డాక్టర్ ప్రత్యూష, దిలీప్ జూను సందర్శించారు. జూను చుట్టేస్తూ జూలోని రాయల్ బెంగాల్ టైగర్‌ని 3 నెలల 20 రోజుల పాటు అయ్యే ఖర్చు రూ.30 వేలు ఆన్ లైన్ తో జూ క్యూరేటర్ ఎస్ రాజశేఖర్‌కు చెల్లించారు. ఈ సందర్భంగా క్యూరేటర్ ఎస్.రాజశేఖర్ మాట్లాడుతూ నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని జంతువులను దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చినందుకు రియా కాళహస్తికి, ఆమె తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. జంతుపక్షాదుల పట్ల ఉన్న ప్రేమను బట్టి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం రియా కాళహస్తి, ఆమె తల్లిదండ్రులు జూని చుట్టివచ్చి జూ నిర్వహణ, పరిశుభ్రతను చూసి ప్రశంసించారు.

రెండవ సంవత్సరం గ్రేట్ ప్లేస్ టు వర్క్ సర్టిఫికేషన్ పొందిన వియాట్రిస్ ఇండియా

నవతెలంగాణ - హైదరాబాద్

మైలాన్ లేబరేటరీస్ లిమిటెడ్ (వియాట్రిస్ కంపెనీ) గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇన్‌స్టిట్యూట్ ఇండియా ద్వారా వరుసగా రెండవ సంవత్సరం భారతదేశంలో గ్రేట్ ప్లేస్ టు వర్క్‌గా గుర్తించబడింది. ఉద్యోగులు తాము విలువైన వారిగా భావించబడి, సహాయ సహకారాలు పొంది, తమ అభిప్రాయాలు, విచారాలు గురించి యాజమాన్యం శ్రద్ధ వహిస్తుందని భావించబడే సమీకృత పని వాతావరణం మరియు నిమగ్నం చేయడాన్ని ప్రోత్సహించడానికి ఈ ధృవీకరణ వియాట్రిస్ వారి నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. సానుకూలమైన పని ప్రదేశం సంస్కృతిని కల్పించడంలో, ఉద్యోగి సంక్షేమాన్ని ప్రోత్సహిం చడంలో మరియు కెరీర్ అభివృద్ధి అవకాశా లను కేటాయించడంలో వియాట్రిస్ ప్రయత్నాలకు ఈ విజయం ఒక సాక్ష్యం. గ్రేట్ ప్లేస్ టు వర్క్ అనేది పని చేసే ప్రదేశంలోని సంస్కృతిపై ఒక అంతర్జాతీయ సంస్థ. 1992 నుండి, ఇది ప్రపంచవ్యాప్తంగా 100 మిలియన్‌లకు పైగా ఉద్యోగులను సర్వే చేసింది మరియు ఒక గొప్ప పని చేసే ప్రదేశంగా ఏది చేస్తుందో నిర్వచించడానికి ఆ విస్తృతమైన అంశాలను ఉపయోగించింది. నమ్మకం. భారతదేశంలో, సంస్థ సుస్థిరమైన వ్యాపార ఫలితాలను అంద చేయడానికి సంస్కృతులు రూపొందించబడేలా సహాయ పడటానికి 22 పరిశ్రమలలో ఏటా 1,400 సంస్థలకుపైగా సంస్థలతో భాగస్వామం చెందింది. వియాట్రిస్‌ను అయిదు శ్రేణులలో -నమ్మకం, గౌరవం, న్యాయం, గర్వం మరియు సహకారంలో అంచనా వేసిన గ్రేట్ ప్లేస్ టు వర్క్ ట్రస్ట్ ఇండెక్స్‌లీ ఎంప్లాయి సర్వే ప్రకారం-వియాట్రిస్ ఇండియా సంస్థ పని చేయడానికి ఒక గొప్ప ప్రదేశంగా 80%కి పైగా జవాబు ఇచ్చిన వారు తమ అభిప్రాయం తెలియచేసారు.

యూనిఫామ్ కుట్టే కార్మికులకు కూలీ రేట్లు పెంచాలి

నవతెలంగాణ-అంబర్‌పేట



రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్కూల్స్ యూనిఫామ్ కుట్టే కార్మికులకు కూలీ రేట్లు పెంచాలని తెలంగాణ టైలర్స్ జేఏసీ ప్రతినిధులు విజ్ఞప్తి చేసింది. బుధవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ పెరిగిన ధరల వల్ల తమకు ఒక్క యూనిఫాంకు ప్రభుత్వం ఇచ్చే రూ.50 సరిపోవడం లేదనీ, కనీసం రూ.100 ఇవ్వాలని కోరారు. విద్యార్థినీ, విద్యార్థులకు ఇచ్చే యూనిఫామ్లకు కలర్ సైతం మార్పు చేయడంతో తమకు పనిభారం పెరిగిందన్నారు. యూనిఫామ్ కుట్టే దారంతో పాటు రవాణా, లేబర్ చార్జీలు పెరగడం వల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2022-2023 విద్యా సంవత్సరానికి సకాలంలో యూనిఫామ్ కుట్టి అన్ని ప్రభుత్వ స్కూల్స్ సకాలంలో పంపిణీ చేసిన తమకు ఇప్పటివరకు బకాయి డబ్బులు రాలేవనీ, తక్షణమే వాటిని విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత విద్యా సంవత్సరంలో రావాల్సిన రూ.26 కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ స్కూల్ యూనిఫామ్ టైలర్స్ జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మంది టైలర్లు ఈ పనిపై ఆధారపడి పని చేస్తున్నామని వారు తెలిపారు. తాము అప్పులు చేసి పిల్లలకు యూనిఫామ్ లు కుట్టామని వారు పేర్కొన్నారు. 2014 నుంచి ఒక్కో జత కుట్టడానికి రూ.50 ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. పదేండ్లుగా అదే కూలికి యూనిఫామ్ లు కుడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ నూతన విద్యా సంవత్సరం నుంచి కార్పొరేట్ విద్యాసంస్థల తరహాలో యూనిఫామ్ ప్యాటన్ మార్చి కుట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని కానీ కూలిన మాత్రం పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక్కో జతకు రూ.100 చెల్లించాలని వారు కోరారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.26 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేసి తమను ఆదుకోవాలని వారు వేడుకున్నారు. ఈ సమావేశంలో రమేష్, బి.కల్పన, రాజేశ్వరి, నర్సింగారావు, వెంకట్ రెడ్డి, నిరంజన్, వెంకటేష్, కరుణాకర్, కనకరాజు, అర్చన, వెంకటయ్య కాశినాథ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరుస ఆందోళనలతో పోలీసుల అప్రమత్తం

- భారీ బందోబస్తు, పలు ప్రాంతాల్లో 144 సెక్షన్ విధింపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంలో రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపుతోంది. రోజురోజుయిజూ టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారం మరిన్ని కొత్త మలుపులు తిరుగుతోంది. దాంతో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పింస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పలువురు విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు టీఎస్‌పీఎస్సీ ముట్టడించేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. బుధవారం సైతం ఎస్ఎఫ్ఐ నాయకులు టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. బుధవారం టీపీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు చలో రాజభవన్ ముట్టడికి ప్రయత్నించారు. నగరంలో జరుగుతున్న వరుస ఆందోళనలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. టీఎస్‌పీఎస్సీ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తులను ఏర్పాటు చేశారు. రాజ్‌భవన్, ప్రగతీభవన్‌తోపాటు నాంపల్లి పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. ర్యాలీలు, ధర్నాలకు అనుమతులను నిరాకరించారు. టీఎస్‌పీఎస్సీ పరిసర ప్రాంతాల్లో ఐదుగురికి మించి గుమిగూడడాన్ని నిషేధించారు. పలు ప్రాంతాల్లో బారికేడ్లను ఏర్పాటు చేసిన పోలీసులు, అటువైపు వచ్చిన వారిపై నిఘా నుంచారు. ఎవరైనా ఆందోళన చేసేందుకు వచ్చినట్టు అనుమానం కలిగితే చాలు వారి వివరాలను సేకరించి వదిలేస్తున్నారు.

నాంపల్లి సుజాతకు 'విశిష్ట సేవా పురస్కారం'

నవతెలంగాణ-సిటీబ్యూరో



తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ జయంతిని పురస్కరించుకుని అఖిల భారత శాలివాహన సంఘం వారు మొదటిసారి రెండు తెలుగు రాష్ట్రాల్లో సాహిత్యం, కళా, క్రీడా, సామా జిక, రాజకీయ, సేవా, ఉద్యోగ, కులవృత్తి రంగాల్లో ప్రతిభ కనబరిచిన శాలివాహన మహిళలకు "విశిష్ట వనితా పురస్కారం" అందజేసి ఘనంగా సన్మానించా రు. ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాయంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ మేరకు సాహితీ రంగంలో కృషి చేసినందుకు గాను సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రముఖ కవయిత్రి నాంపల్లి సుజాతకు 'విశిష్ట వనితా పురస్కారం' ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మొల్ల రామాయణ విశేషాలు, వారి జీవిత చరిత్రని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఆధారంగా కండ్ల ముందు ఉంచారు. మొల్లమాంబపై గీతాలాపనలు, గేయాలు శ్లోకాలు, కవిత్వ పఠనం, ప్రముఖుల సందేశాలు, ఎస్పీ కేజీవీ సరిత ఆకట్టుకునే స్పీచ్ ఇచ్చారు. చిన్నారి నాగశ్రీ ప్రవల్లిక భరతనాట్యం, వీర కృష్ణ పాటలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ జె.పూర్ణచంద్రరావు, ఎస్పీ కేజీవీ సరిత, మోటివేషనల్ స్పీకర్, ఐలాపురం రాజా, మొల్లమాంబ విరచిత రమాయణ తాళపత్ర గ్రంథాలపై పరిశోధన చేసిన మున్నెల్లి శివశంకర్, మొల్లమాంబ విగ్రహాన్ని అద్భుతంగా, జీవకళ ఉట్టిపడేట్టు రూపుదిద్దిన ప్రఖ్యాత శిల్పి రాజకుమార్ వడయార్, కర్ణాటక శాసనసభ సెక్రెటరీ నిర్మల లాంటి ఎందరో మహానుభావులు, శాలివాహన ప్రముఖుల ఈ మధ్య అఖిలభారత శాలివాహన సంఘం కార్యదర్శి ఇటికాల వీరయ్య ప్రజాపతి నేతృత్వంలో జరిగింది.

బహుజన రాజ్యం స్థాపించాలి : పిడమర్తి రవి



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో బహుజన రాజ్యం రావాలంటే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మందకృష్ణ మాదిగ, విశారదన్ మహారాజ్ ఏకమై బహుజన రాజ్యం స్థాపించాలనీ, అందుకు రాష్ట్రంలో అవకాశాలు మెండుగా ఉన్నాయని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. కాన్సిరాం 89వ జయంతి పురస్కరించుకుని బుధవారం ఓయూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లైబ్రరీలో గల ఐసిఎస్ఎస్ఆర్ హాల్‌లో బీఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహుజన రాజకీయ చైతన్య సభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన పిడమర్తి మాట్లాడుతూ "బహుజన రాజ్యాధికార పితామహులు, బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరామ్ ఆశయాన్ని కొనసాగించాలంటే రాష్ట్రంలో ప్రవీణ్ కుమార్, మందకృష్ణ, విశారదన్ మహారాజ్ ఏకమై బహుజన రాజ్యాన్నిలి స్థాపించాలనీ, అందుకు తగిన ఐక్యవేదిక ఏర్పాటు చేసుకోవాలనీ, లేదంటే అందరూ ఐక్యవేదికతో మాన్య కాన్షీరామ్ స్థాపించిన బహుజన్ సమాజ్ పార్టీలో పనిచేసి బహుజన రాజ్యం స్థాపించవచ్చు అన్నారు. ఈ దేశంలో బహుజనులకు జాతీయ పార్టీ అందించిన మహాయోధుడు మాన్య శ్రీకాంత్ అనీ, అతనికి నిజమైన నివాళి అర్పించడం అంటే రాష్ట్రంలో ఎన్నో అద్భుతమైన ఉద్యమాలు చేస్తున్న ఈ ముగ్గురు నాయకులు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రంలో బ్లూ మార్చ్ నిర్వహిస్తామనీ, మే నెలలో ఈ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామనీ, ఏప్రిల్ మొదటి వారంలో పార్లమెంటుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలనీ, ఎస్సీల రిజర్వేషన్ పెంచాలనీ, మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని చలో ఢిల్లీ చేపడుతామని తెలిపారు. సూర్యాపేట జిల్లాకు చెందిన కొండమీది గోవిందరావు మాదిగ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు భవిష్యత్తులో అన్ని కులాలను కలుపుకుని ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గాద వెంకట్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పద్ధతి శ్రీకృష్ణ, తెలంగాణ దళిత దండు రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగులయ్య, రాష్ట్ర అధ్యక్షులు మైస ఉపేందర్, మాదిగ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ వడ్డె ఎల్లన్న, జోగారావు, జెర్రిపోతుల సాయన్న, రాష్ట్ర నాయకులు మొగిలిగిద్ద ప్రసాద్, జోగు నరేందర్, బెజయవాడ శ్రవణ్, నాగేశ్వర రావు, సాంబశివుడు, రాజారా ప్రకాష్, పెద్దరాజు, మీసాల మహేష్, నక్క మహేష్, ఆర్. నాగరాజు, బొట్టు శీను, తదితరులు పాల్గొన్నారు.

'ఫ్రీడమ్' రైస్ బ్రాన్ ఆయిల్‌తో ఆరోగ్యం

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్‌ఆయిల్స్ తమ నూతన ప్రచారాన్ని ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్‌పై ప్రారంభించింది. ఈ ప్రచారం ద్వారా వినియోగదారులకు రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గురించి వెల్లడించ నుంది. రైస్ బ్రాన్ ఆయిల్ ప్రయోజనాలను తెలుపుతూ ప్రారంభించిన ఫ్రీడమ్ ఆయిల్ నాలెడ్జ్ సిరీస్‌కు ఇది కొనసాగింపు. ఈ నూతన ప్రచారం ద్వారా అత్యధిక స్థాయిలో కొలెస్ట్రాల్ ఉండటం వల్ల కలిగే ప్రమాదాలు, దాన్ని నియంత్రించేందుకు తమ రోజువారీ వంటలో రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు వెల్లడించనున్నారు. ఈ ప్రచారంలో భాగంగా ఓ వీడియోను సైతం విడుదల చేశారు. సుప్రసిద్ధ న్యూట్రిషియనిస్ట్ డాక్టర్ మతీన్ అస్రార్ (పీహెచ్‌డీ, న్యూట్రిషియనిస్ట్) ప్రజలకు సమతుల ఆహారం తినా ల్సిందిగా సూచిస్తూనే, క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయాల్సిన ఆవశ్య కత, ఆరోగ్యవంతమైన ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్ వంటి నూనెలను ప్రతి రోజూ వంటలో వినియోగించడం ద్వారా ఆరోగ్యంగా జీవించడం గురించి వెల్లడించారు. ఈ ప్రచారాన్ని సోషల్, డిజిటల్, ఎలక్ట్రానిక్, ప్రింట్ ప్లాట్‌ఫా మ్స్‌పై చేయనున్నారు. ఇది ఇప్పటికే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై ఒక మిలియన్‌కు పైగావ్యూస్‌ను సాధించింది. ఫ్రీడమ్ ఆయిల్ నాలెడ్జ్ సిరీస్ ప్రచారాల్లో భాగంగా, గతంలో రూపొందించిన యానిమేటెడ్ చిత్రంలో ఫ్రీడమ్ రైస్ బ్రాన్‌ఆయిల్‌లో 10000ం పీపీఎం ఒరైజనాల్, టోకోఫెరాల్, టోకోట్రైనాల్స్ వంటివి ఉన్నాయనీ, అవి సహజసిద్ధమైన యాంటీ ఆక్సిడెంట్లుగా పని చేయడంతో పాటు చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గించ డంలో సహాయపడటంతో పాటు చక్కటి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) నిర్వహించ డంలోనూ తోడ్పడుతుందని వివరించారు. ఈ నూతన ప్రచారంలో సుప్రసిద్ధ డైటీషియన్, గుండె ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు. ఈ ప్రచారాన్ని, సరళంగానే అయినప్పటికీ ప్రభావవంతమైన రీతిలో నిపుణుల చేత నిర్వహించడంతో పాటు తమ రోజువారీ కుకింగ్‌లో ఫ్రీడమ్ రైస్‌బ్రాన్ ఆయిల్ వినియోగం గురించి ప్రజలను ప్రోత్సహిస్తారు. ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్ర శేఖర రెడ్డి మాట్లాడుతూ ఫ్రీడమ్ ఆయిల్ నాలెడ్జ్ సిరీస్‌లో భాగంగా తాము లక్షిత ప్రచారాలను నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నాం అని తెలిపారు. వీటి ద్వారా వినియోగదారులకు వంట నూనెల ఆరోగ్య ప్రయోజాలను సైతం వెల్లడి స్తున్నాం అని తెలిపారు. ఫ్రీడమ్ రైస్ బ్రాన్‌ఆయిల్‌పై ఈ నూతన ప్రచారంను ఆరోగ్యవంతమైన జీవనంపై ఓ నిపుణురాలు డాక్టర్ మతీన్ అస్రార్ (పీహెచ్‌డీ న్యూట్రిషి యనిస్ట్) చెప్పే అంశాలను చూపాం. ఆరోగ్యవంతమైన జీవనశైలి అనుసరించాల్సిన ఆవశ్యకత, సమతుల ఆహారం తినాల్సిన అవసరం, ఆరోగ్య వంతమైన నూనె అయిన రైస్ బ్రాన్ ఆయిల్‌లో ఆహారం వండుకో వడం గురిం చి వెల్లడించారు. ఫ్రీడమ్ ఫిజికల్లీ రిఫైండ్ రైస్ బ్రాన్ ఆయిల్‌లో ఒరైజ నాల్ చక్కటి పరిమా ణంలో ఉంది. అంటే 10000ంపీపీఎం ఉంది. దీంతో మేం ప్రజలను ఫ్రీడమ్‌కు మారాల్సిందిగా ఆహ్వా నిస్తున్నాం. ఛేంజ్ ఫర్ ద బెటర్, రైస్ బ్రాన్ ఆయిల్‌తో ఆరోగ్యంగా ఉండాల్సిందిగా వెల్లడిస్తున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ సొంత ప్రయోజనాలకే లీకేజీలు

నవతెలంగాణ-అడిక్‌మెట్



గత, ప్రస్తుత ఉన్నత ఉద్యోగ పోస్టులైన గ్రూప్ -1, ఏఈ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నోటిఫికేషన్లు తమ సొంత ప్రయోజనాలకే ప్రభుత్వమే లీకేజీలు చేసిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం టీఎస్పీఎస్సీ పరీక్షా పత్రాల లీకేజీ పై విద్యానగర్ బీసీ భవన్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, యువజన సంఘం అధ్యక్షుడు నీలా వెంకటేష్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీలపల్లి అంజి హాజర య్యారు. ఈ సందర్భంగా ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ టీఎస్పీఎస్సీలో అవకతవకలు తమ కార్యాలయం నుండి జరిగావని సాక్షాత్తు టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి ధృవీకరించిన నేపథ్యంలో ఆయన రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ 9వ ఏండ్లలలో 66 వేల పోస్టులకు అనుమతించి, అందులోనూ ఉన్నత ఉద్యో గ పోస్టులను తమ వారికే వచ్చే విధంగా పరిమిత లీకేజీ లకు అనుమతించగా ఆ ప్రయత్నం వికటించి బహిర్గత మైందని ఆరోపించారు. ఇది సంచలన వివాదాస్పద కాగానే సంబంధం కార్యాలయానికి మాత్రమే పరిమితం చేస్తూ 'స్కాం' ప్రభావం తమపై పడకుండా విఫలయత్నం చేస్తుందని తెలిపారు. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి ప్రత్యక్ష దోషులు, మూల దోషులను విచారణ జరిపి శిక్షించాలని కోరారు. ఈ నేపథ్యంలో నియమకాలు నిరవ ధిక వాయిదా పడకుండా తగు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ ముదిరాజ్, నందగోపాల్, రాజ్ కుమార్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

ఏడో తరగతి నుంచి పీజి అర్హత గల వారందరికీ ఉద్యోగావకాశం

నవతెలంగాణ - కూకట్‌పల్లి
జాబ్ మేళాకు సంబంధించిన కరపత్ర ఆవిష్కరణలో మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే కృష్ణారావు ఏప్రిల్ 2వ తేదీన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో, కూకట్‌పల్లి మెట్రో ట్రక్ పార్క్ వద్ద జరగబోవు మెగా జాబ్ మేళాకు సంబంధించి కరపత్రాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూకట్‌పల్లిలో జరగబోవు ఈ మెగా జాబ్ మేళాలో దాదాపు 108 కంపెనీలు పాల్గొంటాయని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఏడవ తరగతి నుంచి పీజీ, ఇంజినీరింగ్, టెక్నికల్, నాన్ టెక్నికల్ ఎవరైనా అర్హత బట్టి అందరికీ ఉద్యోగాలు లభించే చక్కని అవకాశం ఉందని అన్నారు. కరపత్రంలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అవ్వొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, యూత్ ప్రెసిడెంట్ సాయి శ్రీనివాస్, సోషల్ మీడియా అధ్యక్షుడు కిరణ్ పుచ్చకాయల పాల్గొన్నారు.

ఉచిత 'కంటి వెలుగు' ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-దుండిగల్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మునిసిపల్ పరిధిలోని బహదూర్‌పల్లిలోని 14వ వార్డులోని డబుల్ బెడ్ రూమ్ నందు నిర్వహించిన కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంను దుండిగల్ వైస్ చైర్మెన్ తుడుము పద్మారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మెన్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ అర్హులని, కంటి పరీక్షలకు వెళ్ళేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డ్ తీసుకువెళ్లాలని కోరారు. కంటి వెలుగు కేంద్రాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు సంబంధిత వైద్య సిబ్బంది పరీక్షలు చేస్తారని, అనంతరం పూర్తి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేసి కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తారని, ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణ రావు, కౌన్సిలర్ ఎలుగారి సత్యనారాయణ, రెవిన్యూ ఆఫీసర్ బి.శ్రీహరి రాజు, ఆరోగ్య వైద్య సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త
- రాచకొండ పోలీస్ కమిషనర్ డి.ఎస్.చౌహాన్



నవతెలంగాణ-సిటీబ్యూరో
ఆధునిక సాంకేతిక యుగంలో వివిధ రకాల అవసరాలకు వివిధ రకాల సాంకేతిక పరికరాలు ఉపయోగించడం జరుగుతోందని, వాటి వల్ల పలు రకాల మార్గాలలో జరిగే నేరాల వల్ల ఎంతో మంది బాధితులు నష్టపోతున్నారని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. బుధవారం రాచకొండ పోలీసులు, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురునానక్ విద్యా సంస్థలలో సైబర్ నేరాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో అపరిచితుల వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలని రాచకొండ కమిషనర్ డి.ఎస్ చౌహాన్ యువతకు సూచించారు. డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డుల వివరాలను సురక్షితంగా ఉంచుకోవాలని, సరైన సైబర్ సెక్యూరిటీ లేని ప్రదేశాల్లో అటువంటి కార్డులు వీలైనంత వరకు ఉపయోగించకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. లాటరీలో డబ్బు గెలుచుకున్నారని వచ్చే మోసపూరిత, ఫోన్ కాల్స్ మరియు మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపరిచితులతో సోషల్ మీడియా స్నేహాలకు దూరంగా ఉండాలని, తమ వ్యక్తిగత వివరాలను, ఫోటోలను సోషల్ మీడియా అకౌంట్లలో పోస్టు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని యువతకు సూచించారు. అంతర్జాలంలో ఎటువంటి వేధింపులు ఎదురైనా తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ క్రైమ్ పోలీస్ టోల్ ఫ్రీ నంబర్ 1930 ద్వారా సైబర్ నేరాల మీద ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అనురాధ, శ్రీ బాల దేవి, శ్రీనివాస్, ఏసీపీలు ఉమా మహేశ్వర రావు, వెంకటేశం, ఎండ్ నౌ ఫౌండేషన్ స్థాపకుడు అనిల్ రాచమల్ల, గగన్ దీప్ కోహ్లి, సావిత్రితోపాటు తదితరులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమ ఫలాలు

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ- కూకట్‌పల్లి
కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి శ్మశానవాటికల అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధి ఎల్లమ్మబండ ముస్లిం శ్మశాన వాటిక కమిటీ ఆధ్వర్యంలో వేస్తున్న బోర్‌వెల్ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఎల్లమ్మబండ పరిధిలోని ముస్లిం, హిందూ, క్రిస్టియన్ శ్మశానవాటికలను కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామని, ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి అదనంగా కోటి రూపాయల నిధులకుగాను ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. త్వరలో నిధులు మంజూరు చేయించి శ్మశానవాటిక అభివృద్ధి పనులలో భాగంగా మిగిలిన పనులను పూర్తిచేస్తామని అన్నారు. శ్మశానవాటిక ప్రహరి, వాకింగ్ ట్రాక్, ఉద్యానవనం, శ్మశాన వాటికలో మొక్కలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. డివిజన్‌లో కులమతాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం శ్మశానవాటిక కమిటీ సలహాదారులు ఎండి.ఇస్మాయిల్, షబ్బీర్, ఖాజా, ఎం.ఏ.కరీమ్, అధ్యక్షుడు ఎంఏ. సమ్మద్, ప్రధాన కార్యదర్శి షౌకత్ అలీ, మున్నా, కమిటీ సభ్యులు షేక్ గౌస్, మొహమ్మద్ గౌస్, షేక్ ఖాజా, మొహమ్మద్ సలీమ్, షకీల్ మున్నా, అఫ్జల్ హుస్సేన్, షేక్ హియాజ్, ఫజల్ తదితరులు పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్ల స్థలాలు అందేలా టీయూడబ్ల్యూజే ప్రత్యేక చర్యలు

ప్రెస్ అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ



నవతెలంగాణ - కూకట్‌పల్లి
కూకట్‌పల్లి టీయూడబ్ల్యూజే (143) నూతన కమిటీ ఏర్పాటు అయిన సందర్భంగా బుధవారం టీయూడబ్ల్యూజే వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రెస్ అకాడమీ చైర్మెన్ అల్లంనారాయణను నూతన కమిటీ మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని లకడీకాపూల్‌లో గల ప్రెస్ అకాడమీ కార్యాలయంలో, అల్లంనారాయణతోపాటు టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్‌లను కలిసి శాలువాతో సత్కరించి పూలబోకే అందజేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను అల్లం నారాయణ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా 2005 సంవత్సరంలో రాజేంద్రనగర్ డివిజన్ గంధంగూడలో అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు ఇప్పుడు చెల్లుబాటు కావని, స్థలాల్లో ఇల్లు కట్టుకోవడానికి అనుమతించడంలేదని జర్నలిస్ట్ ప్రతినిధులు అల్లంనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించి సమస్యను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా కూకట్‌పల్లి ఎల్లమ్మ బండ ప్రాంతంలో ఉన్న స్థలాల విషయంలో కొంతమంది వివాదాస్పదంగా మార్చేస్తూ జర్నలిస్టులకు దక్కకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తన దృష్టిలో ఉందని, ఉద్యమ సమయంలో కూడా స్థలాలను సందర్శించి కోర్టులో కేసులు వేసిన వారితో మాట్లాడిన విషయాన్ని అల్లం నారాయణ గుర్తుచేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ముందు నుండి టీయూడబ్ల్యూజే కృషి చేస్తూ వస్తుందన్నారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు ఇంటి స్థలం, అక్రిడేషన్ కార్డు, హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలన్నదే టీయూడబ్ల్యూజే మొదటి ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగానే అన్ని జిల్లాల్లో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ ఇళ్ల స్థలాలు లేదా డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పించడానికి ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారని, ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఈ ప్రక్రియను పూర్తిచేయడం జరిగిందని స్పష్టం చేశారు. నగరంలోనే స్థలాలు ఇప్పించడం ఇబ్బందిగా ఉందని, అయినప్పటికీ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నట్లు మీడియా అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ టీయూడబ్ల్యూజే బృందానికి హామీ ఇచ్చారు.

కూకట్‌పల్లి సమస్యపై స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌లతో సమావేశమై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాన్ మారుతి సాగర్, రాష్ట్ర నాయకులు ఆర్కే దయాసాగర్, నిమ్మల శ్రీనివాస్, కూకట్‌పల్లి శాఖ అధ్యక్షులు చేగూరు మహేందర్, ప్రధాన కార్యదర్శి లోకల్ శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి భాస్కరాచారి, సీనియర్ నాయకులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ బండలో ఓమ్ని హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ - కూకట్‌పల్లి
ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ, శివమ్మ కాలనీలో ఓమ్ని హాస్పిటల్ ఆధ్వర్యంలో, హాస్పిటల్స్ సీఓఓ మంజునాథ్ పర్యవేక్షణలో శివమ్మ కాలనీ అధ్యక్షుడు మోతే నరసింహులు సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్ పల్స్ రేట్ తదితర ఆరోగ్య పరీక్షలు డాక్టర్ సతీష్ కుమార్ పర్యవేక్షణలో చేసి అవసరమైన వారికి మందులు రాసి ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యుల సూచన మేరకు తగిన మందులు వాడాలని అన్నారు. పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని ప్రతిరోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని ప్రజలకు తమ ఆరోగ్యంపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్ కుమార్, కోఆర్డినేటర్ సురేంద్ర, ఓమ్ని హాస్పిటల్ సిబ్బంది, శివమ్మ కాలనీ అధ్యక్షుడు మోతే నరసింహులు, ఈశ్వర్, పుట్ట మోహన్, ఆటో కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

22వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద 'ప్రగతి యాత్ర'...

కుత్బుల్లాపూర్ డివిజన్ వెంకటేశ్వర నగర్, వాణి నగర్, ఇంద్రసింగ్ నగర్‌లలో పాదయాత్ర



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కుత్బుల్లాపూర్ 131 డివిజన్ పరిధిలో "ప్రగతి యాత్ర"లో భాగంగా 22వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్‌తో కలిసి వెంకటేశ్వర నగర్, వాణి నగర్, ఇంద్రసింగ్ నగర్‌లలో ఎమ్మెల్యే పాదయాత్ర చేస్తూ ఆయా కాలనీలలో దాదాపు పూర్తి చేసిన అన్ని సీసీ రోడ్లు, తదితర అభివృద్ధి పనులు పరిశీలించారు. కాగా వర్షపు నీటి నాలా నిర్మాణానికి చొరవ చూపాలని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా త్వరలోనే పూర్తి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అదేవిధంగా కాలనీలో ఉన్న ఖాళీ స్థలంలో కమిటీ హాల్ నిర్మాణం కొత్త కరెంట్ కేబుల్ ఏర్పాట్లు వంటి సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అందుకు చర్యలు తీసుకొని పరిష్కరిస్తామని చెప్పారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతు న్నాయని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారంలో ఎల్లవేళలా ముందుంటానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, నియోజకవర్గం బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ సోమేశ్ యాదవ్, డివిజన్ బీఆర్ఎస్ సెక్రెటరీ సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, కాలనీ అధ్యక్షులు నాగదీప్ గౌడ్, మధుకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, మల్లేశం, భగవాన్ రెడ్డి, మనోహర్ కుమార్, చందు, ఇమ్మడి నరసింహ, మహేష్, విజయ్, వెంకటేష్, సుబ్బన్న ,శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, కేశవరెడ్డి, సంపత్, జ్యోతి రెడ్డి, పట్టాభి ,విష్ణు, సురేందర్ రెడ్డి, రమణమూర్తి ,ప్రభాకర్ ,సదానంద గౌడ్ పాల్గొన్నారు.

15-19 మార్చి వరకు అమెజాన్.ఇన్ లో వరల్డ్ స్లీప్ డే ఆఫర్స్

నవతెలంగాణ - హైదరాబాద్
నిద్ర అనేది ప్రతి ఒక్కరి పూర్తి ఆరోగ్యం మరియు సంక్షేమానికి సంబంధించిన అంశం. కాబట్టి, మనకు మనం నాణ్యతతో కూడిన నిద్ర మరియు మంచి మానసికమైన ఆరోగ్యాన్ని బహుమతిగా ఇచ్చుకుందాం. ఈ వరల్డ్ స్లీప్ డే కోసం 15-19 మార్చి వరకు తమ సేల్ తో అమెజాన్.ఇన్ ఉత్తేజభరితమైన డీల్స్ మరియు ఆఫర్స్ ను అందిస్తోంది. కస్టమర్స్ మ్యాట్రెసెస్, బెడ్స్, దిండ్లు, బెడ్ షీట్స్ మరియు మీ నిద్రకు కావలసిన అన్నింటి పై అమెజాన్ 75% వరకు డిస్కౌంట్ కు పొందవచ్చు మరియు తమ ఇంటిని ఆనందకరమైన ప్రపంచంగా మార్చవచ్చు. 50+ ప్రముఖ బ్రాండ్స్‌లో 1000+ డీల్స్ పొందండి మరియు ఈ వరల్డ్ స్లీప్ డే నాడు మీ నిద్రకు పరిష్కారం పొందండి. కస్టమర్స్ మీ రోజువారీ నిద్ర అవసరాలు కోసం షాపింగ్ చేసేటప్పుడు ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డ్స్ పై తక్షణమే 10% డిస్కౌంట్ మరియు ఈఎంఐ ఆఫర్స్ పొందవచ్చు.

IN THE COURT OF THE HONELE PRINCIPAL DISTRICT & SESSIONS JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT : MALKAJGIRI
AS. NO. 37 OF 2021

Between
S. Mangamma ..Appellant/Plaintiff
AND
Rachuri Rajini and others ....Respondents/Defendants

To.
Rachuri Sathwik Reddy, s/o. Lale, Rachuri Anji Reddy,Aged about 26 years, Occ: Business,R/o. H.No. 5-8, Kundanpally Village,Keesara Mandal, Medchal-Malkajgiri District.

Please take notice that the Appellant/Plaintiff herein has filed the above appeal suit along with an IA by challenging the Judgment and Decree dated 16-10-2021 in O.S.No.293/2018 possed by the Hon'ble I Addl. Junior Civil Judge-cum-XVIII MM Cyberabad of Malkajgiri, vide AS No. 37 of 2021 and along with the IA vide IA No.1038 of 2021 and the Hon'ble Court has granted the Statue Quo orders in IA over the Suit Schedule Property vide plot No. 90 and 89 'B" admeasuring to an extent of 300 Sq.yards,in Sy. No. 3 and 7, situated at Kundanpally village, Godumakunta GP, Keesara Mandal, Medchal-Malkajgiri District. And bounded by: NORTH: Plot No. 91, SOUTH: Plot No. 89 A.EAST: 25 Wide Road, WEST: PLOT NO.56 and 55, and Plot No. 88 and 89 A' admeasuring to an extent of 300 Sq.Yards, in survey number 3 and 7, situated al Kundanpally village, Godumakunta GP, Keesara Mandal. Medchal-Malkajgiri District.. And bounded by:NORTH: Plot No. 89 B. SOUTH: 30' Wide Road, EAST: 25' Wide Road, WEST: Plot No. 57 and 56, before the Hon'ble Principal District Judge. Medchal Malkajgiri District, at Malkajgiri, and the above appeal suit vide No. 37 of 2021 and IA No. 1038 of 2021 both are posted for your appearance on 04.04.2023.

Therefore, you, the respondent/defendant No.2, hereby informed that if you have got any objection or interest, you should appear and file the same before the above said Hon'ble Court on 04/04/2023 at 10.30 A.M through counsel or in person falling which the matter will decided on merits.

(BY ORDER OF THE COURT)
KOTA RAMCHANDRA REDDY
Advocate
M/S. KOTA LAW ASSOCIATES
H.No. 40-254/1/1, Raghavendra Nagar, Mouta All, Hyderabad -40.
Cell No. 98493 25055.

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT, AT: SECUNDERABAD
IA NO. 2183 of 2022
In
OS.N0. 106 of 2022

Between:
Sri Dandamudi Harish Kumar .... Petitioner/Plaintiff
And
Sri Joseph Lawrence& others .... Respondents/Defendants

TO
1) Sri Joseph Lawrence Bola, S/o. Late Sri Joseph,Aged about: 60 years, Occ: Software Engineer,R/o. Flat No.12, Vasundhara Apartments,Saraswathi Nagar Colony, Lothkunta,Alwal, Secunderabad. (Respondent No.1/ Defendant No.1)
2) Sri G. Venkat Reddy, S/o.G.Vidya Sagar Reddy,Aged about: 45 Years, Occ: Business,R/o. Flat No.502, Sapthagiri Towers,Street No.8, Habsiguda, Hyd (RespondentNo.2/Defendant No.2)
3) Sri Sardahr Kamal Jeeth Singh Gill S/O. Late Sardar Channan Singh, Aged about 59 years, Occ: Business, R/O. H.NO.21-4-985, Garuda Wara Saheb,Charmahal, Petla Burj,Hyderabad-500064.
(Respondent No.7/Defendant No.7)

Please take notice that the above named Petitioner/Plaintiff has filed the above petition against the Respondents/ Defendants herein in the above case, restrain the Respondent NO.1, 2,&3/Defendant No.1,2,&3 to alienate or charge or mortgage or create any third party interest in and over the Petition Schedule Properties to third parties till disposal of the above suit and same is posted to 10-04-2023 for your appearance either in person or through your counsel at 10-30 AM in the above Hon'ble court, if you fail to appear either in person or through your counsel on the above said date and time, the court will pass orders against you in your absence.

"By the court order"
Sd/-
SRI G.BALESH
Advocate,
Office at: Flat No.201,H.NO.10-3-40/C, MaruthiApartment, East Marredpally, Secunderabad-500 026.
Ph: 98489 92415
Counsel for Petitioner/Plaintiff

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT, AT: SECUNDERABAD
OS N0. 106 of 2022

Between:
Sri Dandanmudi Harish Kumar .... Plaintiff
And
Sri Joseph Lawrence & others .... Defendants

TO
1) Sri Joseph Lawrence Bola, S/o. Late Sri Joseph, Aged about: 60 years, Occ: Software Engineer,R/o. Flat No.12, Vasundhara Apartments,Saraswathi Nagar Colony, Lothkunta,Alwal, Secunderabad.
2) Sri G. Venkat Reddy, S/o.G.Vidya Sagar Reddy,Aged about: 45 Years, Occ: Business, R/o. Flat No.502, Sapthagiri Towers, Street No.8, Habsiguda,Hyd.
3) Sri S. Rajashekar, S/o. S.Sundaraiah, Aged about: 48 Years, Occ: Business, Besidea H.No.152/A,Sri Sai Ansa Arcade, in Sy.Nos.96 to 99,DurgaVilla".Colony, TrimulgherryVillage,Secunderabad.
4) Smt Gade Satyavathi, W/o. Dr.Ramdass,Aged about: 72 Years, Occ: House-Wife,R/o. H-NO: 8-2-510, Kummariguda, Secunderabad.
5) Sri P. Rodnay John, S/o.Jai Babu, Aged about: 48 Years, Occ: Business, R/o. Plot No.48, Road No.2, Telephone Colony,Near Telephone Colony Park,Kothapet,Saroornagar(M), Hyderabad --500035.
6) Sri Alla Ashok Kumar,S/o.Papaiah, Aged about: 48 Years, Occ: Business, R/o. H-No:18-3-508/A,Hamqm Bowli, Chathrinaka, Hyderabad.
7) Sri Sardahr Kamal Jeeth Singh Gill S/O. Late Sardar Channan Singh, Aged about 59 years, Occ: Business, R/O. H.NO.21-4-985, Garuda Wara Saheb,Charmahal, Petla Burj,Hyderabad-500064.

Please take notice that the above named Plaintiff has filed the above suit against the Defendants herein for Declaration of Title and Recovery of Possession and other Consequential reliefs and same is posted to 10-04-2023 for your appearance either in person or through your counsel at 10-30 AM in the above Hon'ble court, if you fail to appear either in person or through your counsel on the above said date and time, the court will pass orders against you in your absence.

"By the court order"
Sd/-
SRI G.BALESH
Advocate,
Office at: Flat No.201,H.NO.10-3-40/C, MaruthiApartment, East Marredpally, Secunderabad-500 026.
Ph: 98489 92415
Counsel for Plaintiff

IN THE COURT OF THE HONELE PRINCIPAL DISTRICT & SESSIONS JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT : MALKAJGIRI
AS. NO. 38 OF 2021

Between
N.Sukkamma and Another ..Appellant/Plaintiff
AND
Rachuri Rajini and others ....Respondents/Defendants

To.
Rachuri Sathwik Reddy, s/o. Lale, Rachuri Anji Reddy,Aged about 26 years, Occ: Business,R/o. H.No. 5-8, Kundanpally Village,Keesara Mandal, Medchal-Malkajgiri District.

Please take notice that the Appelant/Plointiff herein has filed the above appeal suit along with an IA by challenging the Judgment and Decree dated 16-10-2021 In O.S.No.290/2018 passed by the Hon'ble Addl. Junior Civil Judge-cum-XVII MM Cyberabad at Malkajgiri, vide AS No. 38 of 2021 and along with the IA vide IA No.1-31of 2021 and the Hon'ble Court has granted the Statve Quo orders in IA over the Suit Schedule Property vide plot No. 118 admeasuring to an extent of 200 Sq.Yards, in survey number 3, 7 and 180, situated at Kundanpally village, Godumakunta gram Panchayat, Keesara Mandal, Medchal-Malkajgiri District. And bounded by: NORTH: Plot No. 117, SOUTH: Plot No. 119, EAST: 25' Wide Road, WEST: Owner's land, before the Hon'ble Principal District Judge, Medchal Malkajgiri District, at Malkajgiri.. and the above appeal suit vide No. 38 of 2021 and IA No. 1031 of 2021 both are posted for your Wappearance on 04.04.2023.

Therefore, you, the respondent/defendant No.2, hereby informed that if you have got any objection or interest, you should appear and file the same before the above said Hon'ble Court on 04/04/2023 at 10.30 A.M through counsel or in person falling which the matter will decided on merits.

(BY ORDER OF THE COURT)
KOTA RAMCHANDRA REDDY
Advocate
M/S. KOTA LAW ASSOCIATES
H.No. 40-254/1/1, Raghavendra Nagar, Mouta All, Hyderabad -40.
Cell No. 98493 25055.

LOST OF DOCUMENT

I, Missing sale Deed Documents.of **Darshanam Lavanya Jyothi w/o M Sampat Kumar.**On 06-11-2022 at about 18.00 while travelling from Malaysian town ship to Kukatpally meanwhile she lost her files.which contains her original sale Deed Documents.Doucment no.**1:9107/2010, docno.2:7061/2015. doc no.3:7991 /2015** If Any Body Found Please **Call Me 8247483787..**

IN THE COURT OF THE HONELE PRINCIPAL DISTRICT & SESSIONS JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT : MALKAJGIRI
AS. NO. 36 OF 2021

Between
Jupally Ramesh .....Appellant/Plaintiff
AND
Rachuri Rajini and others ....Respondents/Defendants

To.
Rachuri Sathwik Reddy, s/o. Lale, Rachuri Anji Reddy,Aged about 26 years, Occ: Business,R/o. H.No. 5-8, Kundanpally Village,Keesara Mandal, Medchal-Malkajgiri District.

Please take notice that the Appellant/Plaintiff herein has filed the above appeal suit along with an IA by challenging the Judgment and Decree dated 16-10-2021 In O.S. No. 292/2018 passed by the Hon'ble I Addl. Junior Civill Judge-cum-XVIII MM Cyberabad at Malkajgiri, vide AS No. 36 of 2021 and along with the IA vide IA No.1037 of 2021 and the Hon'ble Court has granted the Statue Quo orders in IA over the Suit Schedule Property vide plot No. 134 and 89'B' admeasuring to an extent of 300 Sq.Yards, in survey number 3 and 7, situated at Kundanpally Village, Godumakunta GP, Keesara Mandal, Medchal-Makojgiri District, And bounded by: NORTH: 25' Wide Road, SOUTH: Owner's land, EAST: Plot No. 133, WEST: Plot No. 135, before the Hon'ble Principal District Judge, Medchal Makojgirl District, at Malkajgir., and the above appeal suit vide No. 36 of 2021 and IA No. 1037 of 2021 both are posted for your appearance on 04.04.2023.

Therefore, you, the respondent/defendant No.2, hereby informed that if you have got any objection or interest, you should appear and file the same before the above said Hon'ble Court on 04/04/2023 at 10.30 A.M through counsel or in person falling which the matter will decided on merits.

(BY ORDER OF THE COURT)
KOTA RAMCHANDRA REDDY
Advocate
M/S. KOTA LAW ASSOCIATES
H.No. 40-254/1/1, Raghavendra Nagar, Mouta All, Hyderabad -40.
Cell No. 98493 25055.

IN THE COURT OF HON'BLE 1 st JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURT AT: SECUNDERABAD
O.S.No. 511 OF 2020

Between:-
INDIAN BANK,
Secunderabad Branch, Hyderabad. ... Plaintiff
AND
M/s.Suvarchala Fashion World, Rep. by its Prop. - R. Suvarchala ... Defendant

To
M/s.Suvarchala Fashion World, Rep. by its Prop. R. Suvarchala, M.No.2-2, Shop Nos.4 & 5,Ground Floor, Nizampet, Hyderaba – 90. .... Defendant

Whereas the above named Plaintiff has filed the Suit for recovery of amount against the Defendant and the case is posted for your appearance on 23-03-2023. Therefore you are hereby summoned to appear either in person or through Advocate with your defenses if any on 23-03-2023 at 10.30 AM before the Hon'ble Court, failing which the case will be heard and decided as per law.

// BY ORDER OF THE COURT //
Sd/-
RAKESH KUMAR HEDA
Advocate
610-A, 6 th Floor, Amrutha Estates, Himayatnagar, Hyderabad-29.

LOST OF DOCUMENT

I, V RRAMAKRISHNA S/O VENKATAIAH, R/O 14-68, S N COLONY, UPPAL, HYDERABAD-500039,HAVE LOST MY ORIGINAL LINK DEED BEARING DOCUMENT NO.**3478/1984** and Along with blank signed two sbi cheques WHILE TRAVELLINGFROM AMEERPET TO NAMPALLY IF ANY ONE FOUND PLEASE **CONTACT 9515154770**

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT & SESSIONS JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT MALKAJGIRI
AS. NO. 44 OF 2021

Between
M. Nagaraju .....Appellant/Plaintiff
AND
Rochuri Rajini and others ....Respondents/Defendants

To.
Rachuri Sathwik Reddy. S/o. Late. Rochuri Anji Reddy. Aged about 26 year, Occ: Business. R/o. H.No. 5-8, Kundanpally Village.Keesara Mandal, Medchal-Malkajgiri District.

Please take notice that the Appellant/Plaintiff herein has filed the above appeal suit along with an IA by challenging the Judgment and Decree dated 16-10-2021 in O.S.No.294/2018 passed by the Hon'ble I Addl. Junior Civill Judge-cum-XVII MM Cyberabad at Malkajgiri, vide AS No. 44 of 2021 and along with the IA vide IA No. 1045 of 2021 and the Hon'ble Court has granted the Statue Quo orders in IA over the Suit Schedule Property vide plot No, 135 and 89'B' admeasuring to an extent of 300 Sq.Yards, in Survey Number 3 and 7, situated at Kundanpally village, Godumakunta GP. Keesara Mandal, Medchal-Malkajgiri District, And bounded by: NORTH: 25' Wide Road, SOUTH: Owner's lond, EAST: Plot No. 133, WEST: Plot No. 135, before the Hon'ble Principal District Judge, Medchal Malkajgiri District, of Malkajgirl, and the above appeal suit vide No. 44 of 2021 and IA No. 1045 of 2021 both are posted for your appearance on 04.04.2023.

Therefore, you, the respondent/defendant No.2, hereby informed that if you have got any objection or interest, you should appear and file the same before the above said Hon'ble Court on 04/04/2023 al 10.30 AM through counsel or in person failing which the matter will decided on merits.

(BY ORDER OF THE COURT)
KOTA RAMCHANDRA REDDY
Advocate
M/S. KOTA LAW ASSOCIATES
H.No. 40-254/1/1, Raghavendra Nagar, Mouta All, Hyderabad -40.
Cell No. 98493 25055.

IN THE COURT OF THE HONELE PRINCIPAL DISTRICT & SESSIONS JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT : MALKAJGIRI
AS. NO. 42 OF 2021

Between
S. Pallavi ..Appellant/Plaintiff
AND
Rachuri Rajini and others ....Respondents/Defendants

To.
Rachuri Sathwik Reddy, 5/o. Late, Rachuri Anji Reddy,Aged about 26 years, Occ: Business,R/o. H.No. 5-8, Kundanpaly Village,Keesara Mandal, Medchal-Malkajgiri District.

Please take notice that the Appelant/Plaintiff herein has filled the above appeal suit along with an IA by chalenging the Judgment and Decree dated 16-10-2021 In O.S.No.291/2018 passed by the Hon'ble I Addl. Junior Civil Judge-cum-XVII MM Cyberobad al Malkajgiri, vide AS No. 42 of 2021 and along with the IA vide IA No. 1043 of 2021 and the Hon'ble Court has granted the Statve Quo orders in IA over the Suit Schedule Properties vide Plot No. 22 South Part, admeasuring to an extent of 100 Sq. Yards. In Sy. No. 3 and 7. situated at Kundanpally (V). Godumakunta GP, Keesara (M). Medchal-Malkajgiri District. And bounded by: NORTH: Plot No. 22 North Part, SOUTH: Plot No. 21. EAST: 25' Wide Road, WEST: Plot No. 6, before the Hon'ble Principal District Judge, Medchal Malkajgiri District, at Malkajgirl, and the above appeal suit vide No. 42 of 2021 and IA No.1043 of 2021 both are posted for your appearance on 04.04.2023,

Therefore, you, the respondent/defendant No.2, hereby informed that if you have got any objection or interest, you should appear and file the same before the above said Hon'ble Court on 04/04/2023 at 10.30 A.M through counsel or in person falling which the matter will decided on merits.

(BY ORDER OF THE COURT)
KOTA RAMCHANDRA REDDY
Advocate
M/S. KOTA LAW ASSOCIATES
H.No. 40-254/1/1, Raghavendra Nagar, Mouta All, Hyderabad -40.
Cell No. 98493 25055.

ఆర్ఎస్ఎస్‌పై సరైన బాణం సాంస్కృతికోద్యమమే

ఆ దిశగా అడుగులు వేస్తున్న ప్రజానాట్యమండలి

- బీజేపీపై పోరుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు
- ప్రజల్లో చైతన్యం నింపుతున్న వీధినాటకోత్సవాలు
- సీపీఐ(ఎం) జనచైతన్య యాత్రలకు మద్దతు





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కళ ప్రజల కోసం అనే నినాదంతో పురుడుపోసుకున్న ప్రజానాట్యమండలి తెలుగునాట ప్రజా సాంస్కృతికోద్యమ సారథిగా పనిచేస్తున్నది. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో దేశ ప్రగతిని తిరోగమనం వైపు తీసుకెళ్తున్న మోడీ పాలనపై ప్రజలను చైతన్యపరిచేందుకు కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నది. మనువాద భావజాలంతో ప్రజలను అణచివుంచుతున్న ఆర్ఎస్ఎస్ తీరును, దాని ఆసరాతో రాజకీయ లబ్ది పొందుతున్న బీజేపీ నిజస్వరూపాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించేందుకు శాయశక్తులా కృషిచేస్తున్నది. సమాజ మార్పు కోసం సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాన్ని తీసుకురావడానికి తనవంతు పాత్ర పోషిస్తున్నది. ఆర్ఎస్ఎస్ భావజాలంపై పోరు చేస్తున్న పార్టీలకు, ప్రజాసంఘాలకు అండగా నిలుస్తున్నది. ఈ క్రమంలోనే సీపీఐ(ఎం) తలపెట్టిన జనచైతన్య యాత్రలకు సంఘీభావంగా కార్యాచరణకు పూనుకుంటున్నది.

జనచైతన్య యాత్రకు మద్దతుగా క్యాసెట్

కవులు, రచయితలు, గాయకులను పీఎన్ఎమ్ ఒక్కతాటిపైకి తీసుకొచ్చి వారు సృష్టించిన ప్రజలను చైతన్యపరిచే సాహిత్యాన్ని జనబాహుళ్యంలోకి తీసుకెళ్తున్నది. ప్రత్యేకంగా 10 పాటలతో ఓ ఆడియో క్యాసెట్‌ను రూపొందిస్తున్నది. అదే సమయంలో జనచైతన్య యాత్ర లక్ష్యాలను, ప్రజల సమస్యలను బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను తెలియజేసే కళారూపాలను తయారుచేస్తున్నది. ఇందుకోసం ఇప్పటికే మూడు ప్రాంతాల్లో శిక్షణాశిబిరాలను ప్రారంభించింది. సామాన్యుల ఇబ్బందులకు కారణకులెవరు? వివరించేలా ప్రత్యేక నాటికను పీఎన్ఎమ్ ప్రదర్శించనున్నది.

యాత్రకు సంఘీభావంగా వేలాదిగా కళాకారులు

యాత్రకు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజానాట్యమండలి బృందాలు గ్రామాల్లో సిద్ధమవుతున్నాయి. వీరితోపాటు జానపద కళారంగంలో వందలాది కళాబృందాలను, వేలాది కళాకారులను యాత్ర కోసం కదిలించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.


ఇందుకోసం అన్ని జిల్లాల్లో ప్రజానాట్యమండలి కమిటీలు కృషి చేస్తున్నాయి. ప్రజా, కళారంగంలో భావసారూప్యం కలిగిన పలు సంస్థలను, ప్రసిద్ధ సినీ, నాటక రంగ ప్రముఖులను కూడా ఈ యాత్రలో భాగస్వాముల్ని చేయడానికి ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకత్వం సంప్రదింపులు జరుపుతున్నది. ఇప్పటికే అనేక సంస్థలు కలిసి వచ్చేందుకు తమ సంసిద్ధతను తెలియజేస్తున్నాయని నాయకత్వం తెలియజేసింది.

మూడు టీమ్‌లు..60 మంది కళాకారులు



జన చైతన్య యాత్రలతో పాటు ప్రజానాట్యమండలికి చెందిన మూడు బృందాలు కలిసి సాగనున్నాయి. ఒక్కో బృందంలో 20 మంది సభ్యులు ఉండనున్నారు. డప్పు, నృత్యం, పాటలు పాడటం, నాటికలను ప్రదర్శించడం ఇలా విభిన్న ప్రతిభాపాటవాలను ప్రదర్శించే కళాకారులు ఈ బృందాల్లో ఉండనున్నారు. ఆ బృందాలు యాత్ర కొనసాగే ప్రాంతాలకు ముందే చేరుకుని తమ ప్రదర్శనల ద్వారా ప్రజలను ఉత్తేజ, చైతన్యపర్చనున్నాయి.

జనచైతన్య యాత్రలకు కళాకారుల సంపూర్ణ మద్దతు



సీపీఐ(ఎం) పార్టీ తలపెట్టిన జనచైతన్య యాత్రలకు ప్రజానాట్యమండలి సంపూర్ణ మద్దతు ఉంటుంది. యాత్ర సాగే ప్రాంతాల్లో కళాకారులంతా నేరుగా పాల్గొని మద్దతు తెలుపనున్నారు. రాజ్యాంగం స్థానంలో మనుధర్మశాస్త్రాన్ని తీసుకురావడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు, అది అమలైతే ప్రజలు బానిసలుగా ఏవిధంగా అణచివేయబడతారనే అంశంపై ప్రజలను నిరంతరం చైతన్య పరిచడంలో పీఎన్ఎమ్ ముందు వరుసలో ఉంటుంది. ప్రజలకు మేలు చేసే ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేసేందుకు బీజేపీపై ఎక్కుపెట్టడానికి సరైన బాణం సాంస్కృతికోద్యమే.

ప్రజానాట్యమండలి
రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ్మ

నవచిత్రం

స్వచ్ఛమైన ప్రేమకథ



లావణ్య, చైతన్యరావు

'పెళ్లి చూపులు, డియర్ కామ్రేడ్, దొరసాని' వంటి వైవిధ్యమైన సినిమాలతో అభిరుచిని చాటుకున్న బిగ్ బెన్ సినిమాస్ బ్యానర్‌లో వస్తున్న 6వ చిత్రం 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. ఇచ్చట అందమైన ఫోటోలు తీయబడును అనేది ఉపశీర్షిక. చైతన్యరావు హీరోగా, లావణ్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రొడ్యూసర్ సురేష్ బాబు ఆవిష్కరించి, ఈ చిత్రం మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

దర్శకుడు చెందు ముద్దు మాట్లాడుతూ,'ఈ చిత్రం 1980స్ బ్యాక్‌డ్రాప్‌లో గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ. దీంతో పాటు కొన్ని ట్విస్ట్‌లు, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయి' అని తెలిపారు.

'ఇది ఓ కాన్సెప్ట్ బేస్డ్ సినిమా. అందరూ కొత్తవాళ్లే. ఈ సినిమాకు ప్రధాన బలం కథ. 'ఓ పిట్టకథ' చిత్రంతో మెప్పించిన చెందు ముద్దు ఈ కథను బాగా రాసుకున్నారు. ఫన్‌తో పాటు క్రైమ్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ కూడా బాగా కుదిరాయి. స్క్రీన్‌ప్లే చాలా బావుంటుంది. సినిమాటోగ్రఫీ, మ్యూజిక్, ఎడిటింగ్ అన్నీ అద్భుతంగా కుదిరాయి. త్వరలోనే సినిమాని విడుదల చేస్తాం' అని నిర్మాత యష్ రంగినేని అన్నారు.

మరిన్ని ఘన విజయాలు




హీరో ఆనంద్ దేవరకొండతో 'బేబీ' చిత్ర యూనిట్

విజయవంతమైన చిత్రాలతో ప్రతిభావంతమైన నటుడుగా పేరు తెచ్చుకున్నారు ఆనంద్ దేవరకొండ. విజయ్ దేవరకొండ తమ్ముడుగా ఎంట్రీ ఇచ్చినా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్నారు. 'దొరసాని, మిడిల్ క్లాస్ మెలోడీస్, పుష్పక విమానం' వంటి సక్సెస్ ఫుల్ మూవీస్‌తో సత్తా చాటుకున్నాడు. ప్రస్తుతం ఆయన నటించిన 'బేబీ, గంగం గణేశా' చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో 'బేబీ' చిత్రానికి కలర్ ఫోటోతో నేషనల్ అవార్డ్ అందుకున్న సాయి రాజేశ్ దర్శకుడు. ఎస్కేఎన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్‌తో 'బేబీ' సినిమా మోస్ట్ ప్రామిసింగ్ అనిపించుకుంటోంది. ఈ వేసవిలోనే ఈ చిత్రం విడుదల కాబోతోంది.

ఇక ఆనంద్ నటించిన మరో వైవిధ్యమైన వినోదాత్మక చిత్రం 'గంగం గణేశా'. త్వరలోనే ఈ మూవీ ప్రమోషన్స్ స్టార్ట్ కాబోతున్నాయి. బుధవారం ఆనంద్ బర్త్ డే సందర్భంగా ఈ రెండు చిత్రాల నుంచి స్పెషల్ పోస్టర్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. వీటితో పాటు మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను త్వరలోనే ప్రకటించబోతున్నారు ఆనంద్ దేవరకొండ. తన బర్త్‌డేను అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో ఆనంద్ దేవరకొండ మరిన్ని పెద్ద విజయాలు సాధించాలని అభిమానులు ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

నలుగురిలో ఉంటే.. చిలిపిగ పోతుంటే..



నాగశౌర్య, మాళవిక నాయర్

నాగశౌర్య, శ్రీనివాస్ అవసరాల కలయికలో వస్తున్న మూడవ చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, దాసరి ప్రొడక్షన్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. మాళవిక నాయర్ హీరోయిన్. ఈనెల 17న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో ఈ చిత్రం నుంచి వివేక్ సాగర్ సంగీతం సమకూర్చిన 'కఫీఫీ' పాట విడుదలైంది. ఇప్పటిదాకా కళ్యాణిమాలిక్ స్వరపర్చిన పాటలు విడుదలై హాయిగా సాగే మెలోడీలు అయితే.. ఈ పెప్పీ నెంబర్ మాత్రం అందరిలో ఉత్సాహాన్ని నింపేలా ఉంది. 'నలుగురిలో ఉంటే.. చనువుకి నో నో చెప్పేదే కఫీఫీ" అంటూ పాట సందర్భానికి తగ్గట్టుగా కిట్టు విస్సాప్రగడ అందించిన సాహిత్యం అందంగా, అర్థవంతంగా ఉంది.

సమ్మర్‌లో సిసలైన వినోదం



రమేష్, కిరణ్ అబ్బవరం

మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో కిరణ్ అబ్బవరం హీరోగా రూపొందుతున్న చిత్రం 'మీటర్'. నూతన దర్శకుడు రమేష్ కడూరి దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోంది. మేకర్స్ మొదటి సింగిల్ 'చమ్మక్ చమ్మక్ పోరీని' విడుదల చేయడం ద్వారా మ్యూజికల్ ప్రమోషన్‌ను ప్రారంభించారు. హైదరాబాద్‌లోని సంధ్య 70 ఎమ్ఎమ్‌లో భారీ జనసందోహం సమక్షంలో ఈ పాటను గ్రాండ్‌గా లాంచ్ చేశారు. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ,' ఈ పాట షూటింగ్ జరిగిన సెట్ చూసి అసలు ఇది మన సాంగేనా ఇంతపెద్ద సెట్‌లో షూట్ చేయబోతున్నామా అనిపించింది. యూనిట్ అంతా ఇదే ఫీలయ్యాం. దీనికి కారణం నిర్మాత చెర్రీ. నన్ను నమ్మి ఇంత పెద్ద సెట్ వేసిన ఆయనకు కృతజ్ఞతలు. సాయి కార్తిక్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఈ పాటే కాదు ఇందులో పాటలన్నీ బావుంటాయి. భాను మాస్టర్ చాలా చక్కగా కొరియోగ్రఫీ చేశారు. మంచి మాస్ మూమెంట్స్ కంపోజ్ చేశారు. పరీక్షలన్నీ చక్కగా రాయండి. ఏప్రిల్ 7న మీ కోసం మంచి ఎంటర్‌టైన్ మెంట్ ప్లాన్ చేశాం. సినిమాలో ఎంటర్‌టైన్‌మెంట్ మీటర్ ఎక్కడా తగ్గదు. సమ్మర్‌లో మీటర్ సాలిడ్ ఎంటర్‌టైన్‌మెంట్' అని తెలిపారు. 'సాయి కార్తిక్ చాలా మంచి సాంగ్ ఇచ్చారు. జేవీ అద్భుతమైన సెట్ చేశారు. ఈ పాట కోసం యాభై లక్షలు అనుకున్న సెట్ కోటి రూపాయిలు అయ్యింది (నవ్వుతూ). పాట అద్భుతంగా వచ్చింది. రమేష్ చాలా అద్భుతంగా తీశారు. తను చాలా పెద్ద దర్శకుడు అవుతాడు' అని నిర్మాత చెర్రీ చెప్పారు.

మంచి కాన్సెప్ట్ బేస్ట్ సినిమా



చిత్రా శుక్లా, ఆదర్శ

నిజ ఘటనలు ఆధారంగా రూపొందిన ఇన్‌టెన్స్ ఎమోషనల్ డ్రామా 'గీత సాక్షిగా'. ఆదర్శ్, చిత్రా శుక్లా హీరో, హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రాన్ని ఈనెల 22న తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేస్తున్నారు. లేటెస్ట్‌గా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ జరిగింది. 'నాంది' సినిమా దర్శకుడు విజయ్ కనకమేడల, నిర్మాత సతీష్ వేగేశ్న ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో ఆదర్శ్ మాట్లాడుతూ, 'నాకు వండర్‌ఫుల్ అవకాశాన్ని నాకు ఇచ్చిన మా నిర్మాత చేతన్‌కి థ్యాంక్స్. డైరెక్టర్ ఆంథోని డేడికేషన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. దానికి తగ్గట్టు మంచి కథ దొరికింది.. మూవీ చేశారు' అని చెప్పారు.

'మహిళా సమస్యలపై తెరకెక్కించిన చిత్రం. నటిగా న్యాయం చేశాను' అని హీరోయిన్ చిత్ర శుక్ల అన్నారు.

నిర్మాత చేతన్ రాజ్ మాట్లాడుతూ, 'మన దేశంలో మహిళలను అమ్మగా పూజిస్తాం. అలాంటి వారిపై దురాగతాలు జరుగుతున్నాయి. ఆంథోని సినిమాను చక్కగా తెరకెక్కించాడు' అని తెలిపారు.

'అమ్మాయిలపై దురాగతాలు జరిగినప్పుడు పోలీస్ డిపార్ట్‌మెంట్, కోర్టులు ఎలా రియాక్ట్ అవుతున్నాయనే దాన్ని రీసెర్చ్ చేశాను. నేను చదివిన చాలా ఘటనల్లో నుంచి ఓ పాయింట్ తీసుకుని ఈ సినిమా చేశాను. ఇది రెగ్యులర్ మూవీ కాదు. మంచి కాన్సెప్ట్ బేస్డ్ మూవీ. మహిళా సమస్యలపై బాగా ఫోకస్ చేసిన చిత్రమిది. ఇలాంటి సినిమా తీసే అవకాశం ఇచ్చిన మా నిర్మాత చేతన్ రాజ్‌కి థ్యాంక్స్' అని దర్శకుడు ఆంథోని మట్టిపల్లి చెప్పారు.

ఈ చెంగారెడ్డి మామూలోడు కాదట..



జోజు జార్జ్

పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్త నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న చిత్ర నిర్మాణ కార్యక్రమాలు ముగింపు దశకు చేరుకున్నాయి. వైష్ణవ్ తేజ్ కెరీర్‌లో నాలుగో సినిమాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ద్వారా శ్రీకాంత్.ఎన్.రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని నిర్మాతలు ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ చిత్ర సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ప్రతినాయకుడి పాత్రను పరిచయం చేస్తూ తాజాగా చిత్ర యూనిట్ ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రముఖ మలయాళ నటుడు జోజు జార్జ్ ఈ చిత్రంలో చెంగా రెడ్డి అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. 'ఇరాట్ట, జోసెఫ్, నయత్తు, తురముఖం, మధురం' వంటి ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించారు. ఇప్పుడు ఆయన ఈ చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. ఇది పూర్తి స్థాయి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ అని దర్శక,నిర్మాతలు తెలిపారు.

విల్లా 369లో ఏం జరిగింది?



'విల్లా 369' చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

విగన్ క్రియేషన్స్ సమర్పణలో విజయ్, శీతల్ బట్ హీరో, హీరోయిన్లుగా తెరకెక్కుతున్న సినిమా 'విల్లా 369'.

సురేష్ ప్రభు దర్శకత్వంలో విద్య గణేష్ నిర్మాతగా, డా.రాకేష్ సహ నిర్మాతగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు తేజ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'దర్శకుడు సురేష్ ప్రభు మంచి సబ్జెక్ట్‌తో ఈ సినిమా నిర్మాతలకు మంచి విజయం అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని చెప్పారు. నిర్మాత విద్య గణేష్ మాట్లాడుతూ,'ఈ చిత్రానికి దర్శకుడు మంచి నటీ నటులను సెలెక్ట్ చేసుకున్నాడు. డి. ఓ. పి ర్యాడీ రఫీ కెమెరా పనితనం, సంగీత దర్శకుడు మహావీర్ అద్భుతమైన మ్యూజిక్ సినిమాకి హైలెట్స్ అవుతాయి. ఈ సినిమాను త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం' అని అన్నారు.

'ఇలాంటి మంచి కథను చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమా అనుకున్న విధంగా చాలా బాగా వచ్చింది' అని చిత్ర దర్శకుడు సురేష్ ప్రభు అన్నారు. రవి వర్మ, జ్యోతి, చిత్రం శ్రీను, శివారెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ : చిత్రం శ్రీను, లక్ష్మణ్ బాబు.

కంట తడి పెట్టించే లిల్లీ



దిల్‌రాజుతో 'లిల్లీ' చిత్ర బృందం

గోపురం స్టూడియోస్ పతాకంపై నేహా ముఖ్యపాత్రలో వేదాంత్ వర్మ, ప్రణీతారెడ్డి బాలనటులుగా నటించిన చిత్రం 'లిల్లీ'. రాజ్‌వీర్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. శివమ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో కె.బాబురెడ్డి, జి.సతీష్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో గ్రాండ్‌గా లాంచ్ చేశారు.

ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత దిల్ రాజు ఈ చిత్ర ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'చిన్న పిల్లలు సినిమాలు తియ్యాలని ఎంకరేజ్ చేస్తున్న శివ కృష్ణ అన్నకి ధన్యవాదాలు. నాకు 'లిటిల్ సోల్జర్స్, అంజలి' సినిమాలు చాలా ఇష్టం. మంచి కాన్సెప్ట్‌తో చిల్డ్రన్స్ మీద సినిమాలు చేస్తే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. ఈ ట్రైలర్ చూస్తుంటే పిల్లలందరూ చాలా బాగా చేశారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ సినిమా బిగ్ హిట్ అవ్వాలని ఆశిస్తున్నా' అని తెలిపారు.

'దర్శకుడు శివమ్ చిన్న పిల్లలపై చెప్పిన కథ నచ్చడంతో ఈ సినిమా తీశాం. శివకృష్ణ చాలా మంచి సపోర్ట్ చేశారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న మా సినిమాను అందరూ ఆదరించండి' అని నిర్మాతలు కె.బాబురెడ్డి, జి.సతీష్ కుమార్ అన్నారు. దర్శకుడు శివమ్ మాట్లాడుతూ, 'మా 'లిల్లీ' సినిమా చూసిన ప్రతి ఒక్కరూ కూడా కచ్చితంగా కంట తడి పెట్టకుండా బయటికి పోరు.కాబట్టి ప్రతి పేరెంట్స్ కూడా తమ పిల్లలకు మా సినిమా చూపించాలని కోరుతున్నాం' అని అన్నారు.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు



వేణు ఎల్దండి

దిల్ రాజు సారథ్యంలో శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హర్షిత్, హన్షిత నిర్మించిన సినిమా 'బలగం'. ప్రియదర్శి, కావ్యా కళ్యాణ్ రామ్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ మూవీని వేణు ఎల్దండి తెరకెక్కించారు.

ఈనెల 3న విడుదలైన చిత్రం ప్రేక్షకుల విశేష ఆదరాభిమానాలను పొందుతుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సక్సెస్ గురించి దర్శకుడు వేణు ఎల్దండి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'నేను 20 ఏళ్లుగా నటిస్తున్నాను. మంచి కమర్షియల్ సక్సెస్ రాలేదు. ఎప్పుడొస్తుందో తెలియదు. అందుకే రాయటం మొదలు పెట్టాను. కొన్ని సినిమాలకు రాశాను. అయితే కథలు రాసే విషయంలో రొటీన్‌కి భిన్నంగా వెళ్లాలనిపించింది. తెలంగాణ కల్చర్‌లో చేదు నోరు అనేది ఉంది. మా నాన్న చనిపోయినప్పుడు మా ఫ్యామిలీ మెంబర్స్ అందరూ వచ్చారు. అక్కడ ఏడుపులు, తాగడాలు, తినడాలు అన్నీ చూస్తే నాకు కొత్తగా కనిపించింది. అవన్నీ నా మైండ్‌లో నాటుకు పోయాయి. వీటిని బేస్ చేసుకుని రాసిన కథని విని శివరాం మాట్లాడుతూ ఇది చాలా పెద్ద కథ. పెద్ద వ్యక్తి చేతిలో ఉంటే మరో లెవల్‌కు రీచ్ అవుతుందన్నారు. ఆయన దిల్ రాజు దగ్గరకు తీసుకొచ్చారు. ఆయనకు కూడా కథ నచ్చడంతో ఈరోజు సినిమా ఇలా మీ ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. సినిమా రిలీజైన తర్వాత మెగాస్టార్ చిరంజీవి నుంచి వచ్చిన అప్రిషియేషన్స్ మరచిపోలేని ఎక్స్‌పీరియెన్స్. ఇకపై నేను చేయబోతున్న సినిమాల్లో వినోదం ఉంటుంది. ఇప్పటికే దిల్ రాజుకి రెడీ ఓలైన్ చెప్పాను. ఇది కాస్త పెద్ద స్పాన్‌లోనే ఉంటుంది' అని చెప్పారు.

సెట్ అంటే ఎవరూ నమ్మలేదు



అవినాష్ కొల్లా

నాని నటించిన పాన్ ఇండియా చిత్రం 'దసరా'. శ్రీకాంత్ ఒదెల దర్శకుడు. కీర్తి సురేష్ కథా నాయికగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రం ఈనెల 30న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఏకకాలంలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో దీనికి ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేసిన అవినాష్ కొల్లా మీడియాతో మాట్లాడుతూ, 'నానితో 'కృష్ణగాడి వీర ప్రేమగాథ, జర్సీ, శ్యామ్ సింగారాయ్ సినిమాలు చేశాను. కానీ 'దసరా' కథా నేపథ్యం పూర్తిగా భిన్నమైనది. తెలంగాణలోకి ఒక ఊరికి సబంధించిన కల్చర్, అలవాట్లు, కట్టుబాట్లు ఉంటాయి. ఆ ఊరికి కోల్ మైన్ దగ్గరగా ఉండటం వలన పెద్దపెద్ద వాహనాలు ఆ ఊరి నుంచే వెళ్తాయి. దాని కారణంగా సహజంగానే రస్టిక్ టోన్ ఉంటుంది. దీని కోసం 22 ఎకరాల్లో అడవి లాంటి ఒక ఖాళీ ప్రదేశం తీసుకొని భారీ విలేజ్ సెట్ వేశాం. ఐదు వందల మంది నివసించే గ్రామాన్ని నేచురల్‌గా క్రియేట్ చేశాం. 98 శాతం షూటింగ్ సెట్‌లోనే జరిగింది. సెట్‌లో ప్రతి రోజు మూడు వందల మంది ఉండేవారు. ఫస్ట్ షెడ్యుల్ అయ్యేవరకూ అది సెట్ అని ఆ మూడు వందల మందికి తెలీదు. సెట్ మొత్తం రెడీ అయ్యాకా కరెంట్ బోర్డ్ వాళ్ళు వచ్చి బోర్డ్ లేకుండా కరెంట్ ఎలా వాడేస్తున్నారు? అని ప్రశ్నించారు. మాకు కరెంట్ అక్కర్లేదు.. జనరేటర్‌తో నడిపిస్తాం. ఇది సెట్ అని చెబితే ఎంతకీ నమ్మలేదు (నవ్వుతూ). దర్శకుడు శ్రీకాంత్‌ది తెలంగాణ నేపథ్యం. తన ఊరు గురించే కథ రాసుకున్నాడు. మంచి క్లారిటీ ఉన్న దర్శకుడు. నిర్మాత ఎక్కడా రాజీ పడలేదు. ప్రస్తుతం రామ్ చరణ్, నాని 30, 'ఏజెంట్' సినిమాలు చేస్తున్నాను' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్



తీవ్ర ఒత్తిడిలో మరో అమెరికన్ బ్యాంక్..!

- ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్ షేర్ 70 శాతం పతనం

వాషింగ్టన్ : అమెరికన్ బ్యాంక్‌ల సంక్షోభం ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. తాజాగా మరో బ్యాంక్ మూత పడనుందని రిపోర్టులు వస్తున్నాయి. తాజాగా రిపబ్లిక్ బ్యాంక్ షేర్ 70 శాతం పతనంతో మూతవేత దిశగా పయనిస్తోందని సమాచారం. ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్‌తో పాటు మరో ఐదు బ్యాంకింగ్ సంస్థల పరపతిని సమీక్షిస్తున్నామని ఆదివారం మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీసెస్ పేర్కొంది. దీంతో సోమవారం ఆ బ్యాంక్ షేర్ ఏకంగా 70 శాతం పడిపోయింది. ఫెడరల్ రిజర్వ్, జెపి మోర్గాన్ చేజ్ అండ్ కోతో సహా ఒప్పందాల కార్యకలాపాల ద్వారా నిర్వహణ కోసం 70 బిలియన్ డాలర్లకుపైగా నగదు నిల్వలు ఉన్నాయని ఆ బ్యాంక్ ప్రకటించినప్పటికీ.. స్టాక్ మార్కెట్‌లో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. సిలికాన్ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్‌ల మూత తర్వాత అమెరికా సహా యూరప్ మార్కెట్‌లలో పెద్ద బ్యాంక్‌ల షేర్లు వేగంగా పడిపోతున్నాయి. గత వారంలో ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్ షేర్ 74.25 శాతం పడిపోయింది. గడిచిన పది రోజుల్లోనే సిల్వర్ గేట్ బ్యాంక్, సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌విబి), సిగ్నేచర్ బ్యాంక్‌లు దివాళా తీసిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలు ప్రపంచ వ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంపై తీవ్ర ఆందోళనలు, భయాలు వ్యక్తం అవుతోన్నాయి.

ఎగమతుల వరుస పతనం

- ఫిబ్రవరిలో 9 శాతం క్షీణత



న్యూఢిల్లీ: ప్రపంచ మార్కెట్‌లో భారత సరుకులకు డిమాండ్ పడిపోతోంది. వరుసగా మూడో మాసంలోనూ ఎగుమతులు తగ్గాయి. ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో దేశ ఎగుమతులు 8.8శాతం పతనమై 33.88 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే మాసంలో 37.15 బిలియన్ల ఎగుమతులు జరిగాయి. గడిచిన నెలలో దిగుమతులు 8.21 శాతం తగ్గి 51.31 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. దీంతో దేశ వాణిజ్య లోటు 17.43 బిలియన్ డాలర్లకు ఎగిసింది. 2022 జనవరిలో వాణిజ్య లోటు 17.42 బిలియన్ డాలర్లుగా, ఫిబ్రవరిలో 17.75 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి కాలంలో భారత సరుకు ఎగుమతులు 7.5 శాతం పెరిగి 405.94 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు ఏకంగా 18.82 శాతం ఎగిసి 653.47 బిలియన్ డాలర్లకు చేరాయి. ప్రపంచ దేశాల ఉత్పత్తులతో పోటీ పడలేకపోవడం, గ్లోబల్ డిమాండ్‌లోనూ స్తబ్దత నేపథ్యంలో భారత ఎగుమతులు తగ్గిపోతున్నాయని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు దిగుమతులు పెరగడంతో భారత వాణిజ్య లోటు ప్రమాదకరంగా మారుతోంది.

ఐదో రోజూ పతనమే..

- సెన్సెక్స్‌కు 344 పాయింట్ల నష్టం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదో రోజూ నష్టాలు చవి చూశాయి. బుధవారం సెషన్‌లోనూ అమ్మకాల పరంపర కొనసాగింది. అంతర్జాతీయ ప్రతికూల పరిణామాలకు తోడు దేశీయంగా ఎలాంటి సానుకూల అంశాలు కానరావడం లేదు. ఈ పరిణామాలతో బిఎస్ఇ సెన్సెక్స్ 344 పాయింట్లు కోల్పోయి 57,556కు దిగజారింది. ఐదు సెషన్లలో ఈ సూచీ 2,792 పాయింట్లు నష్టపోయింది. దీంతో మదుపర్ల సంపద దాదాపుగా రూ.8 లక్షల కోట్లు పైగా ఆవిరయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 71 పాయింట్లు తగ్గి 16,972 వద్ద ముగిసింది. నిఫ్టీ 50లో భారతీ ఎయిర్‌టెల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ సూచీలు అధికంగా 2 శాతం చొప్పున విలువ కోల్పోయాయి. రిలయన్స్ 1.7 శాతం నష్టపోగా, ఎస్‌బిఐ, హెచ్‌యుఎల్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, నెస్లే, యాక్సిస్ బ్యాంక్ షేర్లు 1 శాతం చొప్పున తగ్గాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్సియల్, టెలికాం స్టాక్స్ ఎక్కువగా ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

అతిమూత్ర వ్యాధికి ఎంఎస్ఎన్ ఔషధం



హైదరాబాద్ : అతి మూత్ర వ్యాధితో బాధపడుతున్న వారి కోసం ఎంఎస్ఎన్ గ్రూపు బయోఈక్వలెంట్ జనరిక్ వెర్షన్ అయిన ఫెసొబిగ్‌ను ఆవిష్కరించింది. బుధవారం దీన్ని హైదరాబాద్‌లో ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భరత్ రెడ్డి విడుదల చేశారు. ఓవరాక్టివ్ బ్లాడర్ (ఒఎబి), యూరినరీ ఇన్‌కాంటినెన్స్ చికిత్స కోసం వివిధ అంతర్జాతీయ చికిత్స మార్గదర్శకాల ద్వారా అత్యంత సురక్షిత, వినూత్నత ఫస్ట్ లైన్ ఫార్మాకోథెరపీ ఎంపికగా ఈ ఔషధం సిఫారసు చేయబడిందని భరత్ రెడ్డి తెలిపారు. "ఫెసొబింగ్ టాబ్లెట్‌ల ఆవిష్కారం భారతీయ రోగుల బాధలను తగ్గించడానికి క్లిష్టమైన చికిత్సలలో సరసమైన మందులను తీసుకురావడానికి పరిశోధన చేయడానికి మా కొనసాగుతున్న నిబద్ధతకు అనుగుణంగా ఉంది" అని భరత్ రెడ్డి పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో బ్లాక్‌బెర్రీ ఐఒటి సెంటర్ ఏర్పాటు

BlackBerry

హైదరాబాద్: బ్లాక్‌బెర్రీ లిమిటెడ్ కొత్తగా హైదరాబాద్‌లో తన ఐఒటి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ, ఇంజనీరింగ్, ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. కెనడా తరువాత అంతర్జాతీయంగా బ్లాక్‌బెర్రీ ఐఒటి డివిజన్‌లలో రెండవ అతిపెద్ద కేంద్రంగా ఇది నిలువనుందని తెలిపింది. ఇక్కడ 100మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీరులు పని చేయనున్నారని పేర్కొంది. ఈ ప్రపంచ శ్రేణి ఇంజినీరింగ్ కేంద్రం, భారతదేశపు అత్యుత్తమ ఎంబీడెడ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను నియమించుకోవడం ద్వారా భావితరపు వాహన సాఫ్ట్‌వేర్ వేదిక (ఎస్‌డివిలు) నిర్మించడంలో సహాయపడనున్నట్లు పేర్కొంది. అదే విధంగా ఇతర ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పరిశ్రమలలో అత్యాధునిక ఆవిష్కర ణలకు చేపట్టనున్నట్లు తెలిపింది. మార్చి 29న బెంగళూరులో జరగనున్న వార్షిక టెక్ ఫోరమ్ ఇండియాకు ముందుగా తమ తమ కార్యకలాపాలను విస్తరించేందుకు తగిన ప్రణాళికలను వెల్లడించనున్నట్లు బ్లాక్‌బెర్రీ ఐఒటి ప్రెసిడెంట్ మత్తియాస్ ఎరిక్‌సన్ పేర్కొన్నారు.

ఒనిట్సుకా టైగర్ ప్రచారకర్తగా రష్మిక

హైదరాబాద్ : జపనీస్ ఫ్యాషన్ బ్రాండ్ ఒనిట్సుకా టైగర్ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటీ రష్మిక మందాన్నను నియమించుకున్నట్లు తెలిపింది. భారత్‌లో కంపెనీ కార్యకలాపాలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొంది. ఈ క్రమంలోనే మందానన్న ప్రచారకర్తగా ఎంచుకున్నట్లు పేర్కొంది. ఫ్యాషన్‌తో పాటు స్పోర్ట్స్, ఇన్నోవేషన్‌తో కలిపి అత్యుత్తమ సమకాలీన కలెక్షన్‌లను అందించనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది.

మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు



న్యూఢిల్లీ . మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, ఆమోదించాలని 13 పార్టీల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం నాడిక్కడ లిమెరిడియన్ హొటల్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. 13 రాజకీయ పార్టీలు, వివిధ ప్రజా, మహిళా సంఘాల నేతలు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ దేశం, సమాజం ,సమగ్రాభివృద్ధి నిర్ణయం తీసుకోవడంలో మహిళలకు ప్రధాన భూమిక పోషించాలన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాజకీయ పార్టీలు, ప్రత్యేకించి ప్రతిపక్షాలు మద్దతిస్తున్నాయనీ, ప్రభుత్వం చొరవ చూపడం లేదన్న సందేశం ఈ వేదిక ద్వారా స్పష్టమవుతోందని అన్నారు. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

రాజకీయాల్లో మహిళ భాగస్వామ్యంతోనే సాధికారిత సాధ్యం :జాన్ బ్రిట్టాస్, సీపీఐ(ఎం)ఎంపీ

తాను ఎంపీ కాకముందు జర్నలిస్టుననీ, పార్లమెంట్‌లో మహిళ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు తాను జర్నలిస్టునని సీపీఐ(ఎం)ఎంపీ జాన్ బ్రిట్టాస్ అన్నారు. పార్లమెంట్‌లో మహిళ రిజర్వేషన్ బిల్లుకు చాలా పార్టీల వైఖరి వ్యతిరేకంగా ఉన్నదని తెలిపారు. రిజర్వేషన్ అంటే ఏదో పాలనలో బాధ్యలు ఇవ్వడం కాదనీ, దేశ ప్రజల్లో సగం మంది ఉన్న మహిళలకు భాగస్వామ్యం కల్పించడమని స్పష్టం చేశారు. పురుషులు కంటే మహిళలు ఎక్కువ మంది ఓటు వేస్తున్నారనీ, వారికి రాజకీయాల్లో సముచిత స్థానం లభించాలని అన్నారు. దశాబ్దాలుగా మహిళ రిజర్వేషన్ బిల్లు గురించి ఎదురు చూస్తున్నామనీ, ఇప్పటికే లోక్‌సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో మహిళ భాగస్వామ్యంతోనే నారీశక్తి, మహిళా సాధికారిత సాధ్యం అవుతాయని స్పష్టం చేశారు. దేశంలో అనేక వర్గాలు రాజకీయాల నుంచి బయటకు వెళ్లిపోయాయనీ, ఇది దురదృష్టకరమని అన్నారు. పార్లమెంట్, అసెంబ్లీల్లో మైనార్టీలు, మహిళలు ప్రాతినిధ్యం ఎంత? అని ప్రశ్నించారు. అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యానికి ఒక అర్థం ఉంటుందని అన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లుకు తమ పార్టీ మద్దతు ఇస్తోందనీ, బిల్లును తెచ్చి ఆమోదించాలని డిమాండ్ చేస్తుందని తెలిపారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇచ్చినప్పుడు బిల్లు ఎందుకు ఆమోదం పొందటం లేదని ఆర్ఎస్‌పీ ఎంపీ ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ అన్నారు. అన్ని పక్షాలు చేయాలని అనుకుంటే బిల్లు ఆమోదం కష్టమేమీ కాదని స్పష్టం చేశారు.

మహిళలకు ఎందుకు రిజర్వేషన్ కల్పించదు? ప్రియాంక చతుర్వేది, శివసేన

ఓటు వేయడంలో రాజ్యాంగ నిర్మాతలు మహిళలకు సమాన హక్కు కల్పించినప్పుడు, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచడానికి అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలకు ఎందుకు రిజర్వేషన్ కల్పించదనిశివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది ప్రశ్నించారు. ఈ అంశంపై చట్టసభల్లో ఉన్న మహిళలు ప్రభుత్వాలను మరింతగా డిమాండ్ చేయాలని సూచించారు. ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ రిజర్వేషన్ బిల్లుకు తాము మద్దతిస్తున్నాని ప్రకటించారు. అయితే, రిజర్వేషన్‌లో రిజర్వేషన్ కోటా ఉండాలని ప్రతిపాదించారు. ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతంగా నిర్మించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు.

వ్యూహాత్మక నిర్ణయాల్లో మహిళల భాగస్వామ్యం్ణ సుమతి, డీఎంకే ఎంపీ

వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో మహిళల భాగస్వామ్యం అవసరమని డీఎంకే ఎంపీ తమిళ్ సై తంగపంద్యాన్ (సుమతి) మాట్లాడుతూ పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కార్యరూపం దాల్చడానికి చేసే ఈ పోరాటంలో తాము కలిసి నడుస్తామని అన్నారు. సీపీఐ ఎంపీ బినయ్ బిశ్వం మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లుకు పితృస్వామ్య వ్యవస్థలు అడ్డొచ్చాయని విమర్శించారు. 21వ దశాబ్దంలో కూడా మహిళా హక్కులు ఇవ్వకపోవడం సరికాదని అన్నారు. ఈ ఉద్యమంలో తాము భాగస్వాములు అవుతామని ప్రకటించారు. జేఎంఎం ఎంపీ మౌహ మాఝి మాట్లాడుతూ ఒకవైపు ఆజాదీ కా అమృత్ మహొత్సవం జరుపుకుంటున్న ఈ తరుణంలో చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువ ఉండడం మంచిగా అనిపించడం లేదని అన్నారు. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం కోసం రిజర్వేషన్ బిల్లు రావాల్సిందే, ఈ పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు.

ప్రజలకు మంచి బిల్లులను తీసుకురావాల్ది రాఘవ చద్దా, ఆప్ ఎంపీ

ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ల కోసం కవిత లేవనెత్తిన డిమాండ్‌కు తాము సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని ప్రకటించారు. ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉన్నదనీ, దాన్ని సంస్కరణలు తీసుకురావడంతో పాటు ప్రజలకు మంచి చేసే బిల్లులను తీసుకురావడానికి ఉపయోగించాలని సూచించారు. సమాజ వాది పార్టీ ఎంపీ ఎస్‌టీ హసన్ మాట్లాడుతూ మహిళలకు తగిన వాటా కల్పించకుండా, గౌరవం ఇవ్వకుండా ఏ దేశం కూడా సూపర్ పవర్ కాబోదని స్పష్టం చేశారు. దేశం అభివృద్ధి కావాలంటే చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగాలని అన్నారు. వీసీకే ఎంపీ తిరుమావలవన్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు తక్షణ అవసరమని తెలిపారు. ఆలస్యం చేస్తే దేశానికి , ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆర్‌ఎల్‌డీ పార్టీ మహిళా విభాగం నేత ప్రతిభా సింగ్, ఆ పార్టీ నేత భూపేంద్ర చౌదరి మాట్లాడుతూ రిజర్వేషన్లపై మహిళల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా బిల్లుపై జరుగుతున్న చర్చల గురించి గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అవగాహన లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాజ్యసభ ఎంపీ సంతోష్ కుమార్, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రైతు నేతలు గుర్నామ్ సింగ్ ఛదౌని, రాజేవాలా, బీఆర్ఎస్ ఎంపీలు మాలోతు కవిత, జోగినపల్లి సంతోష్ కుమార్, వద్దిరాజు రవిచంద్ర, వెంకటేష్ నేత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా..

- ఒకపూట బడి, మే నెలంతా ఒకేసారి సెలవులు: ఐసీడీఎస్ కమిషనర్‌కు అంగన్వాడీ యూనియన్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేసవి కాలంలో ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక పూట బడితో పాటు మే నెలంతా అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు అందరికీ ఒకేసారి సెలవులు ఇవ్వాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఐసీడీఎస్ కమిషనర్ భారతి హొళ్లికేరికి ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, సహాయ కార్యదర్శి జి.పద్మ, ఉపాధ్యక్షురాలు జి.కవిత వినతిపత్రం సమర్పిం చారు. రాష్ట్రంలో ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ప్రభుత్వం మార్చి 15 నుంచి ప్రభుత్వ పాఠశాలలను ఒక పూట నిర్వహించాలని ఆదేశాలిచ్చిందని తెలిపారు. ఐసీడీఎస్ పరిధిలో అతి చిన్న వయస్సు పిల్లలతో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రాలకు ఇంకా ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో సాయంత్రం వరకు నడుపుతున్నారని చెప్పారు.

అత్యధిక శాతం కేంద్రాలు అద్దె భవనాల్లో ఎలాంటి సౌకర్యాలు లేక ఇరుకు గదుల్లో ఉన్నాయనీ, కొద్దిపాటి కేంద్రాలు పక్కా భవనాల్లో ఉన్నప్పటికీ సరైన సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద వయస్సు పిల్లలు మధ్యా హ్నం తర్వాత ఇంటి వద్ద ఉంటున్నప్పుడు చిన్న వయస్సు పిల్లలను సాయంత్రం వరకు ఉంచాలంటే పిల్లలు తల్లిదండ్రులు ఇష్టపడటం లేదని చెప్పారు. మే నెలలో ఇప్పటి వరకు అంగన్‌వాడీ టీచర్లకు 15 రోజులు, హెల్పర్లు, మినీ వర్కర్లకు 15 రోజులు సెలవులు ఇస్తున్నారని ఇస్తున్నారని తెలిపారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఇద్దరి పని ఒక్కరే చేయడం సాధ్యం కావడం లేదని పేర్కొన్నారు. సౌకర్యాలు లేకపోవడంతో నిర్వహణ అంత్యంత కష్టంగా మారిందనీ, గర్భిణీ, బాలింతలు, పిల్లలు ఎండలో సెంటర్‌కు రావడానికి ఇబ్బందులు పరిష్క రించాలనీ, మే నెలంతా ఒకేసారి సెలవులివ్వాలనీ అనేక సంవత్సరాల నుంచి కోరుతున్నప్పటికీ సమస్యను ప్రభుత్వం సమస్యను పరిష్కరించడం లేదనీ, దీంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురౌతున్నారని తెలిపారు.

జాతీయ అటవీ క్రీడోత్సవాల్లో తెలంగాణకు 16 పతకాలు

క్రీడాకారులను అభినందించిన సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హర్యానాలోని పంచకులలో జరిగిన జాతీయ అటవీ క్రీడోత్సవాల్లో తెలంగాణ అధికారులు, సిబ్బందికి16 పతకాలు లభించాయి. జాతీయ స్థాయిలో తెలంగాణ తొమ్మిదో స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన అటవీ శాఖ అధికారులను బుధవారం హైదరాబాద్‌లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి అభినందించారు. జాతీయ స్థాయి క్రీడలకు సంబంధించిన వివరాలను సీఎస్‌కు ఐఎఫ్ఎస్ అధికారి బాలాదేవి వివరించారు. తెలంగాణకు ఎనిమిది బంగారు, రెండు రజత, ఆరు కాంస్య పతకాలు దక్కాయని తెలిపారు. చత్తీస్‌గఢ్, కర్నాటక, కేరళ రాష్ట్రాలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయన్నారు.

బిలియడ్స్‌లో బాలాదేవి రెండు బంగారు పతకాలు సాధించారు. అథ్లెటిక్స్‌లో బి.ఖాజా, ఎం.సునీత, వి.సాంబయ్య, స్విమ్మింగ్‌లో జి.కిష్టాగౌడ్, బి.సక్రు, క్యారమ్స్‌లో ఫాజీ కమాలుద్దీన్‌లతో పాటు చెస్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో తెలంగాణ అటవీ శాఖ ఉద్యోగులు పతకాలు సాధించారు. క్రీడాపోటీలకు పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియల్ స్వయంగా హాజరై ఉద్యోగులను ఉత్సాహపరిచారు. పీసీసీఎఫ్ (ఎఫ్ఏసీ) ఎంసీ. పర్గెయిన్ తెలంగాణ అటవీశాఖ తరపున సమన్వయకర్తగా వ్యవహరించారు.

బీజేవైఎం కార్యకర్తల అరెస్టును ఖండించిన బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీని నిరసిస్తూ నిరుద్యోగుల పక్షాన ఆందోళ చేస్తున్న బీజేవైఎం కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఖండించారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంపై రాష్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేయడాన్ని తప్పుపట్టారు. సిట్‌కు అప్పగించిన కేసులన్నీ నీరుగారి పోయాయని గుర్తు చేశారు. నయీం, డ్రగ్స్, డేటా చోరీ కేసులు సిట్ అప్పగిస్తే అవన్నీ నీరుగారిపోయాయని విమర్శించారు. ప్రశ్నపత్రాల లీకేజీ కేసును సైతం రాష్ర ప్రభుత్వం నీరుగార్చేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అరెస్టులను ఖండిస్తూ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

ప్రశ్నపత్రం లీకేజీపై బీజేపీ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ అంశంపై అధ్యయనం చేసి నిజనిజాలు వెలికితీసేందుకు, పోరాట కార్యాచరణ రూపొందించేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ప్రకటించారు. దానికి కన్వీనర్‌గా ఏపీపీఎస్సీ మాజీ సభ్యులు సీహెచ్ విఠల్ ఉండనున్నారు. సభ్యులు మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, రిటైర్డ్ సీఎస్ చంద్రవదన్, రిటైర్డ్ డీజీపీ టి.కృష్ణప్రసాద్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్, ఎస్సీ మోర్చా కార్యదర్శి ఎస్. కుమార్, అడ్వకేట్ కరుణగోపాల్ ఉంటారు.

ఐద్రోజుల పాటు వర్షసూచన

- పలుప్రాంతాల్లో ఈదురు గాలులతో వడగండ్ల వాన పడే అవకాశం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న వెల్లడించారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. అదే సమయంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగండ్ల వాన పడే సూచనలు కనిపిస్తున్నాయి. నిజామాబాద్, కామారెడ్డి, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, కొమ్రం భీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, జనగాం జిల్లాల్లో అక్కడక్కడా వడగండ్ల వాన పడే అవకాశముంది. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణ వరకు ద్రోణి కొనసాగుతున్నది. అది ఒరిస్సా వైపు కదులుతున్నది. రాష్ట్రం మీదుగా కిందిస్థాయిలో తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తున్నాయి. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జూలూరుపాడులో అత్యధికంగా 38.7, అశ్వాపురంలో 38.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా తాళ్ల మడుగులో 6.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఖమ్మం అభివృద్ధికి కట్టుబడి ఉన్న సర్కార్

గోళ్లపాడు ఛానల్ అభివృద్ధే నిదర్శనం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

"ఖమ్మం జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. మురికికూపంగా ఉండే గోళ్లపాడు ఛానల్‌ను అభివృద్ధి చేసిన తీరే దీనికి ప్రత్యక్ష నిదర్శనం. ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఖమ్మం జిల్లా సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నారు" అని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొంది. గోళ్లపాడు ఛానల్‌ను ముఖ్యమంత్రి హామీ పథకం కింద రూ.70 కోట్లతో ఆధునీకరించి, ఉద్యానవన పార్కులు, క్రీడా ప్రాంగణాలుగా అభివద్ధి చేసినట్టు తెలిపారు. రోజువారీ రెండు కోట్ల లీటర్ల సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధి కేంద్రంతో దీనిని అనుసంధానం చేయడం వల్ల ఖమ్మం నగరంలోని 22 కాలనీలవాసులకు దుర్గంధం, వరద ముంపు నుంచి విముక్తి కలిగించినట్టు అయ్యిందన్నారు. గోళ్లపాడు ఛానల్ అభివృద్ధి పనుల్లో భాగంగా 10.60 కిలోమీటర్ల సీవరేజి పైపులైన్లు వేసి, మురుగునీటిని శ్రీనివాసనగర్ లో నెలకొల్పిన 20 ఎల్.ఎం.డి. సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు మళ్లించారు. అలాగే వరద ముంపు నివారణలో భాగంగా 6.50 కిలోమీటర్లు పొడవున స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు నిర్మించి వరద నీటిని మున్నేరు నదిలోకి వెళ్లే వెసులుబాటు కల్పించినట్టు వివరించారు. ఈ ఛానల్ ఆధునీకరణ కోసం 812 ఆక్రమణలను తొలగించి, అక్కడ నివసిస్తున్న కుటుంబాలకు"వెలుగుమట్ల లే అవుట్‌లో పునరావాసం కల్పించారు. రోడ్లు, విద్యుత్తు, వీధిదీపాలు, మరుగుదొడ్లు, తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసి, అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించినట్టు తెలిపారు. ప్రకాశ్ నగర్, సుందరయ్య నగర్, పంపింగ్ వెల్ రోడ్, రంగనాయకులగుట్ట, వనజీవి రామయ్య పార్క్, జూబ్లీ క్లబ్ తదితర ప్రాంతాల్లో విశాలమైన పార్కింగ్ స్థలాలు, అందమైన శిల్పాలు, పెయింట్ చేసిన గోడలతో ప్రవేశ ద్వారం తోరణాలు, ల్యాండ్‌స్కేపింగ్ రౌండ్ బెంచీలు, పచ్చదనం, పచ్చిక బయళ్లు, ఫౌంటైన్‌లు ఏర్పాటు చేసినట్టు వివరించారు. అలాగే ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రన్ ప్లే ఎక్విప్‌మెంట్, చెస్ ప్లేయింగ్ టేబుళ్లు, మెగా చెస్ బోర్డ్, స్కేటింగ్ రింక్, బ్యాడ్మింటన్ కోర్టులు, ఖోఖో, వాలీబాల్ కోర్టులు, బాస్కెట్‌బాల్ కోర్ట్ వంటి క్రీడా సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు.

ఉచిత ఆర్థోపెడిక్ ఆపరేషన్ క్యాంపు..అభినందనీయం

నవతెలంగాణ-సూర్యాపేట

ఉచిత ఆర్థోపెడిక్ ఆపరేషన్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పుల్లారావు అన్నారు. మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఎంవీఎన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఐఎంఏ, లయన్స్ క్లబ్ సహకారంతో బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్థానిక భీమిడి రమేశ్‌రెడ్డి ఆర్థోపెటిక్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆర్థోపెటిక్ మోకాలు లిగమెంట్ ఉచిత ఆపరేషన్ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఉచిత ఆర్థోపెడిక్ మెడికల్ క్యాంపు నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఇలాంటి క్యాంపులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



వేగంగా అంబేద్కర్ విగ్రహ నిర్మాణం

- పనులను పరిశీలించిన మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ తీరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారీ విగ్రహ నిర్మాణం పనులు పూర్తి కావొచ్చాయి. బుధవారం సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ విగ్రహం నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ నెల 10వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా విగ్రహం నిర్మాణం పనులు పరిశీలించారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి రోజున విగ్రహం ఆవిష్కరించనున్నట్టు మంత్రి కొప్పుల ఈశ్వర్ వెల్లడించారు. అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనలను భవిష్యత్ తరాలు నిత్యం స్మరించుకునేలా హుస్సేన్‌సాగర్ తీరంలో భారీ విగ్రహాన్ని నిర్మించ తలపెట్టినట్టు మంత్రి చెప్పారు. విగ్రహ ఆవిష్కరణ గడువు సమీపిస్తుండటంతో నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా వేగంగా పనులు చేసి గడువులోపు పూర్తి చేయాలని వర్క్ ఏజెన్సీలను ఆదేశించారు. ఏప్రిల్ 14న అట్టహాసంగా జరిగే ఈ విగ్రహావిష్కరణకు దేశంలోని పలువురు ప్రముఖులు హాజరవుతున్నందున ఏప్రిల్ 5లోగా అన్ని పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని రకాల పనులకు చార్ట్ రూపొందించుకొని, ఆ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని, అందుకు సరిపడా మానవ వనరులను పెంచాలని సూచించారు.

28న ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్‌కు అభినందన సభ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ సినీ గేయ సాహిత్యానికి విశ్వఖ్యాతిని తెచ్చిన ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్‌కు ఈనెల 28న రవీంద్రభారతిలో అభినందన సభ నిర్వహిస్తున్నట్టు తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. 'నాటు నాటు' పాటతో తెలుగు పల్లీయుల పదబంధాలను ఉపయోగించి, సంగీతంలో హుషారెత్తించిన గీతంగా ప్రపంచ ప్రజల అభిమానాన్ని అందుకోవటం తెలంగాణ సమాజం గర్వించతగిందని పేర్కొన్నారు. సాహిత్య అకాడమీ కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన చంద్రబోస్ అభినందన సభ సన్నాహక సమావేశం జరిగింది. తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ ఆయాచితం శ్రీధర్, తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఆనందచారి, సహకార్యదర్శి ఎన్‌కే సలీమా, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, కాళోజి అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ మొట్టమొదటిసారి తెలుగు గీతానికి ఆస్కార్ అవార్డు రావడం అందరికీ గర్వకారణమని అన్నారు. 28న జరిగే అభినందన సభకు కవులు, రచయితలు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు సాహిత్య, సాంస్కృతిక సంఘాలు భాగస్వామ్యం అయ్యాయి.

క్రైస్తవ మిషనరీలే లక్ష్యంగా బీజేపీ సర్కారు దాడులు

- మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

క్రైస్తవ మిషనరీలే లక్ష్యంగా బీజేపీ సర్కారు దాడులు చేస్తున్నదని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ విమర్శించారు. బాలవికాస సంస్థపై ఐటీ దాడులను ఆయన ఖండించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మిషనరీ సంస్థలు దేశంలో సేవ చేయకుండా కేంద్రం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. క్రైస్తవ మిషనరీ సంస్థలు దేశంలో సేవా కార్యక్రమాలు చేయకుండా కేంద్రం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. లౌకిక ప్రజాస్వామ్య దేశంలో కేంద్రం కావాలని ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో బాలవికాస మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయని గ్రామం లేదని తెలిపారు. దశాబ్దాల కాలంగా గ్రామాల్లో మహిళలకు, వృద్ధులకు సాయం చేస్తుంటే.. కేంద్రం మాత్రం మిషనరీ సంస్థను ఐటీ దాడుల పేరుతో వేధిస్తున్నదని చెప్పారు. దేశాన్ని దోచుకుని విదేశాలకు పారిపోతున్న వారిని పట్టుకోవడం మానేసి... దేశానికి సేవ చేయడానికి విదేశాల నుంచి వస్తున్న వారిని ఇబ్బందులకు గురిచేయడం బీజేపీకే చెల్లుతుందని ఎద్దేవా చేశారు.

బండి సంజయ్ విచారణకు 18న అనుమతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌పై విచారణను ఆయన కోరిక మేరకు ఈ నెల 18వ తేదీన అనుమతిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ప్రకటించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. తనకు పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో 15వ తేదీ కమిషన్ ఎదుట హాజరు కాలేననీ, ఈ నెల 18వ తేదీన కమిషన్ చైర్‌పర్సన్ సూచించిన సమయానికి హాజరవుతానని లేఖలో అభ్యర్థించగా కమిషన్ అందుకు సానుకూలంగా స్పందించింది. 18న 11గంటలకు హాజరు కావాలని సూచించింది. 18న హాజరుకాలేకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసు ద్వారా హెచ్చరించింది.

ఐటీ శాఖవి చట్ట వ్యతిరేక చర్యలు...

- హైకోర్టులో టెక్ మహీంద్ర వాదన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సత్యం కంపెనీ తనకు లేని ఆదాయాన్ని చూపించిందనీ, అందువల్ల తప్పుడు ఆదాయానికి పన్ను కట్టాలంటూ ఐటీ శాఖ కోరడం చెల్లదని టెక్ మహేంద్ర హైకోర్టులో వాదించింది. సత్యం కుంభకోణం కారణంగా 2002-2009 కాలంలో వాస్తవ ఆదాయం ఆధారంగా పన్ను మదింపునకు సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) అనుమతి ఇవ్వకపోవడాన్ని ఆ కంపెనీ సవాల్ చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. కంపెనీ వాస్తవ ఆదాయం మేరకే పన్ను చెల్లించాలంటూ రాజ్యాంగంలోని 265 అధికరణం చెబుతోందని కంపెనీ వాదించింది. విచారణ ఏప్రిల్ 12కు వాయిదా పడింది.

31న హైకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు

హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)కు ఈ నెల 31న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల షెడ్యూల్‌ను స్టేట్ బార్ కౌన్సిల్ చైర్మెన్ ఎ.నరసింహారెడ్డి వెల్లడించారు. 17న ఓటర్ల జాబితా పూర్తి, 18 నుంచి 20 వరకు నామినేషన్లు, 21న నామినేషన్ల ఉపసంహరణ, 22న పోటీలో ఉండే తుది అభ్యర్థుల జాబితా వెల్లడి, 31న ఎన్నికలు జరిగిన తర్వాత ఫలితాలు వెల్లడవుతాయి. కొత్త కమిటీ ఏప్రిల్ 1న బాధ్యతలు స్వీకరిస్తుంది. ఎన్నికలయ్యే వరకు ముగ్గురితో అడహక్ కమిటీని బార్ కౌన్సిల్ నియమించింది. ఇందులో సీనియర్ న్యాయవాదులు టి.సూర్యకరణ్‌రెడ్డి, ఎల్.రవిచందర్, జి.రవిమోహన్ ఉన్నారు.

18న ఫ్యామిలీ డిస్ప్యూట్స్ కోర్టులు షురూ

పురానా హవేలీలో ఏర్పాటు చేసిన కుటుంబ వివాదాల పరిష్కార సమీకృత కోర్టు భవన సముదాయాన్ని ఈ నెల 18న ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుంది. వీటిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ పీఎస్ నర్సింహా, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ప్రారంభిస్తారు.

మహిళలు ముందుకు రావాలి :సీజే

మహిళలను చైతన్యపరిచే చర్యలు పెరగాలనీ, వారు అన్ని రంగాల్లోనూ ముందుకు రావాలని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు. న్యాయవ్యవస్థపై మహిళలు కూడా అవగాహన పెంపునకు, ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులపై దృష్టి పెట్టాలని సూచించారు. హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీజే ప్రసంగిస్తూ చట్టాలపై మహిళలను చైతన్యం చేసేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మహిళా జడ్జీలు జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ చిల్లకూర్ సుమలత, జస్టిస్ రాధారాణి, జస్టిస్ మాధవీదేవి, జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ జువ్వాడి శ్రీదేవి, జస్టిస్ అనుపమా చక్రవర్తి, జస్టిస్ గిరిజా ప్రియదర్శిని మాట్లాడారు. కీలక పదవుల్లోకి మహిళలు రావాలని వారు పిలుపునిచ్చారు.

క్రిస్టియన్ మిషనరీ కార్యాలయాలపై ఐటీ దాడులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలలో నడుస్తున్న కొన్ని క్రిస్టియన్ మిషనరీ కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు బుధవారం మెరుపు దాడులను నిర్వహించారు. మిషనరీ కార్యాలయాలు సేకరిస్తున్న నిధులు, వాటి వినియోగాలు, ఇతర వ్యాపార లావాదేవీలకు సంబంధించి ఆదాయపు పన్ను చెల్లింపుల్లో అవకతవకలకు పాల్పడుతన్నారనే ఆరోపణలపై ఐటీ ఈ దాడులు నిర్వహించినట్టు తెలిసింది. జీడిమెట్ల, కూకట్‌పల్లి, సనత్‌నగర్, అల్వాల్‌లలోని కొన్ని క్రిస్టియన్ మిషనరీ కార్యాలయాలలో మొత్తం 20 టీమ్‌లతో కూడిన ఐటీ అధికారులు ఈ సోదాలను నిర్వహించినట్టు తెలుస్తున్నది. అలాగే మెదక్ జిల్లాలో కూడా కొన్ని మిషనరీ కార్యాలయాలలో కూడా సోదాలను నిర్వహించి పలు కీలకమైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారని సమాచారం.

మిరప మెరుపు

- తేజా రకం ఖమ్మం మార్కెట్లో రూ.22,501, వరంగల్‌లో 23 వేలు..
- సింగల్ పట్టి క్వింటాల్ రూ. 63వేలు
- ఈ సీజన్‌లో ఇదే రికార్డు స్థాయి ధర



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/కాశిబుగ్గ

ఖమ్మం, వరంగల్ వ్యవసాయ మార్కెట్లో మిర్చి మెరిసింది. తేజా, సింగల్ పట్టి రకం మిర్చి ధరలు రికార్డు నమోదు చేస్తున్నాయి. సీజన్‌లోనే అత్యధికంగా బుధవారం వరంగల్ మార్కెట్‌లో క్వింటాల్ మిర్చి రూ23వేలు పలుకగా, ఖమ్మం మార్కెట్‌లో రూ.22,501 రేటు పలికింది. ఒక్కరోజులోనే మిర్చి ధర ఒక్కసారిగా క్వింటాకు దాదాపు రూ.వెయ్యికి పైగా పెరిగింది. చివరికి తాలు మిర్చి సైతం రూ.14వేలు పలికింది. నాణ్యతను బట్టి క్వింటాల్ రూ.18వేల నుంచి రూ.23వేల వరకు కొంటున్నారు. పంట విస్తీర్ణంతో పాటు చీడపీడల ప్రభావం కూడా అధికంగా ఉండటంతో దిగుబడి తగ్గింది. ఈ కారణంగా మిర్చి ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. ఆన్ సీజన్‌లో ఉండాల్సిన రేటు ఇప్పుడే పలుకుతుండటంతో రైతులు కూడా కోత కోసిన వెంటనే విక్రయిస్తున్నారు.

వరంగల్ మార్కెట్‌లో గరిష్టస్థాయి ధరలు..

వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ఎర్ర బంగారం ధరలు అమాంతం పెరుగుతున్నాయి. బుధవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు సుమారు 50 వేల బస్తాల మిర్చి వచ్చినట్టు అధికారులు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బేరువాడ గ్రామానికి చెందిన బానాలు అనే రైతు తేజా రకం మిర్చి 50 బస్తాలు తీసుకురాగా నాగేంద్ర ట్రేడింగ్ కంపెనీ ఆర్తి ద్వారా లాలా ట్రేడింగ్ కంపెనీ రికార్డు స్థాయిలో రూ.23 వేలు ధర పెట్టి కొనుగోలు చేశారు. తేజ రకం మిర్చి 9వేల బస్తాలు రాగా, గరిష్ట ధర రూ.23వేలు పలుకగా కనిష్ట ధర రూ.17వేలు, మోడల్ ధర రూ.21వేలుగా ఉంది. వండర్ హాట్ 1000 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.38,200 కనిష్ట ధర రూ.31వేలు కాగా మోడల్ ధర రూ.35వేలు పలికింది. యూఎస్ 341 రకం మిర్చి 26,500 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.23,600, కనిష్ట ధర రూ.17 వేలు, మోడల్ ధర రూ.21,500కు కొనుగోలు చేశారు. సింగిల్ పట్టి 200 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.63 వేలు, కనిష్ట ధర రూ.45 వేలు, మోడల్ ధర రూ.59 వేలు పలికింది. 1048 రకం మిర్చి 1000 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.22,600, కనిష్ట ధర రూ.16 వేలు, మోడల్ ధర రూ.19 వేలుగా ఉంది. ఇందులో వండర్ హాట్, తేజ, సింగల్ పట్టి రకం మిర్చికి గతంలో ఎప్పుడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ధర పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ నిర్మిస్తే..బీజేపీ కూల్చుతోంది

- బీఆర్ఎస్ ప్రజలను నమ్మితే..బీజేపీ ఈడీని నమ్ముతోంది : వైద్యఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



నవతెలంగాణ-జైపూర్

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నూతన నిర్మాణాలు చేపడితే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూల్చే ప్రయత్నాలు చేస్తోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను నమ్మితే.. బీజేపీ ఈడీని నమ్ముతోందని ఎద్దేవా చేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో బుధవారం మంత్రి పర్యటించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌తో కలిసి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చెన్నూరులో బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లిందని, ఆ పార్టీ కనుమరుగైపోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు దేశంలో ఎక్కడా కనిపించవన్నారు. త్వరలోనే గృహలక్ష్మీ పథకం అమల్లోకి వస్తుందని వివరించారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న సుమన్‌కు వచ్చే ఎన్నికల్లో రెట్టింపు మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఈతకు వెళ్లి 10వ తరగతి విద్యార్థి మృతి

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఈతకు వెళ్లి 10వ తరగతి విద్యార్థి దుర్మరణం చెందిన సంఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... చల్వాయికి గ్రామానికి చెందిన పైడాకుల మహేష్ స్రవంతి కుమారుడు పైడాకుల అక్షయ్(15) స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఒంటి పూట బడులు కావడంతో మధ్యాహ్నం తోటి మిత్రులతో కలిసి స్థానిక రాలమాటు వాగు ప్రాంతానికి ఈత నేర్చుకోవాలనే తాపత్రయంతో వెళ్లారు. గతంలో అక్కడ వాగు కోతకు గురైనందున లోతుగా ఉండటంతో గుర్తించని విద్యార్థులు నీటిలోకి దిగగా అక్షయ్ ఒక్క మాటున లోతు ప్రాంతానికి వెళ్లడంతో నీటిలో మునిగాడు. తోటి మిత్రులు ఇతరుల సహాయంతో ఒడ్డుకు తీసుకొచ్చినప్పటికీ అక్షయ్ మృతిచెందాడని స్థానికులు తెలిపారు.

గల్లీలో ఎంఐఎం..ఢిల్లీలో బీజేపీ..

ఇదే కేసీఆర్ దోస్తానా

- కారు మీద కోపంతో బీజేపీకి ఓటువేయొద్దు
- ధర్మపురి కాదు అధర్మపురి
- నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేయండి : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపు



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్ గడ్డపై ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలని ప్రజలకు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కేసీఆర్ మీద కోపంతో బీజేపీకి ఓటు వేస్తే మన బతుకులు మరింత ఆగమైతాయని స్పష్టంచేశారు. ఎంఐఎం అధ్యక్షుని మాట విని ముస్లింలు కారుకు ఓటు వేస్తే ఆ ఓట్లతో గెలిచిన కేసీఆర్ గల్లీలో ఎంఐఎంతో ఢిల్లీలో బీజేపీతో దోస్తానా చేస్తున్నారని విమర్శించారు. మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి అటకెక్కించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీనిచ్చారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రేవంత్‌రెడ్డి యాత్ర బుధవారం దుబ్బ ప్రాంతం నుంచి ప్రారంభమైంది. రాత్రి నెహ్రూ పార్క్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకొస్తారని బాండ్ పేపర్ రాసి ఇచ్చిన ఎంపీ ధర్మపురి అరవింద్ చేతల్లో అధర్మపురిగా మారారని ఆరోపించారు. మోడీ తన జేబులో ఉంటాడని చెప్పిన ధర్మపురి.. కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని ఆరోపించారు. అరవింద్ వ్యవహారం 'నాకుంది గుండు.. నేను రాసిచ్చా బాండ్' అన్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణ సాధించామని ప్రచారం చేసుకుంటూ రెండు సార్లు అధికారంలోకి వచ్చారని, కానీ ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. కాబట్టి ఈసారి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. నిజామాబాద్ జిల్లాలో తెలంగాణ యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ ఇవన్నీ కూడా కాంగ్రెస్ హయాంలో వచ్చినవేనని అన్నారు. అమరవీరుల స్తూపం, సచివాలయం నిర్మాణం, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు అన్నింట్లో అవినీతి జరిగిందని, విచారణకు ఆదేశిస్తే ఆధారాలతో నిరూపిస్తానని మంత్రి ప్రశాంత్ రెడ్డికి సవాల్ విసిరితే ఇప్పటివరకు స్పందించడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే సిలిండర్ అందజేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీని ఇచ్చారు. బాయ్‌బాయ్ కేసీఆర్ అంటూ ప్రసంగం ముగించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రేవంత్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్, కాంగ్రెస్ నాయకులు కేశ వేణు, తాహెర్‌బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

- 27, 28న జంతర్ మంతర్ వద్ద ధర్నా
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ-ఓయూ

ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. హైదరాబాద్ పార్సిగుట్టలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతపై బీజేపీ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27, 28 తేదీల్లో మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. ఏప్రిల్ 3న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బీజేపీ తెలుగు రాష్ట్రాల కార్యాలయాల ముందు మహాధర్నా నిర్వహిస్తామని, ఏప్రిల్ 4న హైదరాబాద్, విజయవాడ నగరాలను, రహదారులను దిగ్బంధం చేస్తామన్నారు. అప్పుడు జరిగే పరిణామాలకు బీజేపీదే పూర్తి బాధ్యత అన్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఎస్సీ వర్గీకరణ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టకుంటే బీజేపీ తమకు ప్రధాన శత్రువుగా భావిస్తామని హెచ్చరించారు. మాదిగ పల్లెల్లోకి అడుగుపెట్టే నైతిక హక్కు బీజేపీ నాయకులకు లేదన్నారు. వారిని గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి వీఎస్ రాజు, మంతిని సామ్యూల్, డప్పు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండళ్ల సమావేశం : లింబాద్రి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఉన్నత విద్యామండళ్ల సమావేశాన్ని గురు, శుక్రవారాల్లో రెండురోజులపాటు హైదరాబాద్‌లోని హరిత ప్లాజా హోటల్‌లో నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11 రాష్ట్రాల నుంచి చైర్మెన్, వైస్ చైర్మెన్, కార్యదర్శులుగా ఉన్న 24 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని అన్నారు. మల్టిపుల్ ఎంట్రీ, మల్టిపుల్ ఎగ్జిట్‌పై సవాళ్లు, అకడమిక్ క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ సిస్టం ఎలా అమలు చేయాలి, అందరికీ అనువైన సిలబస్ రూపకల్పన వంటి అంశాలపై చర్చ ఉంటుందని వివరించారు. జాతీయ విద్యా ప్రణాళిక, నిర్వహణ సంస్థ (న్యూపా) వీసీ సుధాంశు భూషణ్, ప్రొఫెసర్ కుమార్ సురేష్ ప్రారంభోపన్యాసం చేస్తారని చెప్పారు. మొదటి రోజు టీ హబ్‌ను సందర్శిస్తామని అన్నారు.

యూజీసీ నుంచి నిధులు రావడం లేదు

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి ఐదేండ్లుగా విశ్వవిద్యాలయాలు, కాలేజీలకు నిధులు రావడం లేదని లింబాద్రి చెప్పారు. భారత ఉన్నత విద్య కమిషన్ (హెకీ) వచ్చాక నిధులివ్వాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నదని అన్నారు. గతంలో విశ్వవిద్యాలయాలు, కాలేజీల అభివృద్ధి, పరిశోధనలకు యూజీసీ నిధులిచ్చేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల పోలీసులకు ఆదర్శంగా మన పోలీసులు

- పోలీసు రిసెప్షనిస్టుల అవార్డు సభలో డీజీపీ అంజనీకుమార్



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర పోలీసుల పని తీరు ఇతర రాష్ట్రాల పోలీసు విభాగాలకు ఆదర్శంగా నిలుస్తున్నదని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అన్నారు. తెలంగాణ పోలీసు అకాడమిలోని రాణి రుద్రమదేవి హాల్‌లో బుధవారం జరిగిన పోలీసు రిసెప్షనిస్టులకు అవార్డుల ప్రదానం కార్యక్రమానికి డీజీపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 721 పోలీసు స్టేషన్‌లకు సంబంధించి 75 మంది పోలీసు రిసెప్షన్ అధికారులకు వారి చక్కటి ప్రతిభను ప్రోత్సహిస్తూ అవార్డులు ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా ప్రతి పోలీసు స్టేషన్ పని తీరు మెరుగు పరిచి, ప్రజలకు చక్కటి సేవలను అందించడానికి ఉద్దేశించిన 17 వర్టికల్స్‌ను ఆదర్శవంతంగా అమలు చేస్తున్నందుకు గాను వీరికి ఈ అవార్డులను ప్రదానం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ వర్టికల్స్‌ను ఇతర రాష్ట్రాలకు చెందిన పోలీసు అధికారులు అధ్యయనం చేసి వాటిని తమ పోలీసు స్టేషన్‌లలో అమలు చేయడానికి పూనుకోవడం తమ పని విధానానికి నిదర్శనంగా ఆయన చెప్పారు. తమ ఏరియా పోలీసు స్టేషన్‌లలో ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా మంచి విధానాలను అమలు చేసే 20 మంది ఏసీపీలు, ఎస్పీలు, డీసీపీలకూ మంచి అవార్డులనిచ్చి ప్రోత్సహించాలని యోచిస్తున్నామని ఆయన తెలిపారు. కరోనాతో మరణించిన పోలీసు అధికారులు, సిబ్బందికి చెందిన 68 మంది పిల్లలకు చదువులలో ప్రోత్సహించడానికి గాను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నగదు స్కాలర్‌షిప్‌లను ఇవ్వడం సంతోషకరమన్నారు. పోలీసు స్టేషన్‌ల రిసెప్షనిస్టులకు అవార్డులను ప్రదానం చేసిన డీజీపీ.. 68 మంది పోలీసు పిల్లలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు స్కాలర్‌షిప్‌లనూ అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఐడీ అదనపు డీజీ మహేష్ భగవత్, రాష్ట్ర పోలీసు స్పోర్ట్స్ విభాగం అదనపు డీజీ అబిలాష బిస్త్, పోలీసు అకాడమి డైరెక్టర్ సందీప్ శాండిల్య, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రీజినల్ అధికారితో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

గూగుల్ మ్యాప్..రాంగ్ రూట్

- మ్యాప్‌ను నమ్ముకోవడంతో పరీక్షకు ఆలస్యం
- సకాలంలో కేంద్రానికి చేరక అనుమతి నిరాకరణ

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

గూగుల్ మ్యాప్‌ను నమ్ముకొని ఇంటర్ పరీక్షా కేంద్రానికి బయలుదేరిన ఓ విద్యార్థికి చేదు అనుభవం ఎదురైంది. తాను చేరుకోవాల్సిన సెంటర్ ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంప్‌లో ఉంటే.. ఎన్నెస్పీ కాల్వ ఉన్న టేకులపల్లి ప్రాంతానికి ఆ విద్యార్థిని తీసుకువెళ్లింది. తిరిగి పరీక్షా కేంద్రానికి చేరుకునే సరికి ఆ విద్యార్థికి 27 నిమిషాలు ఆలస్యమవడంతో నిమిషం నిబంధన కారణంగా అధికారులు అనుమతించలేదు. వివరాల్లోకి వెళ్తే... ఖమ్మం రూరల్ మండలం కొండాపురానికి చెందిన వినయ్‌కు ఖమ్మంలోని ఎన్నెస్పీ స్కూల్‌లో సెంటర్ కేటాయించారు. గూగుల్ మ్యాప్ పెట్టుకుని ఎగ్జామ్ కేంద్రానికి బయలుదేరాడు. కానీ అది ఎన్నెస్పీ కాల్వ వద్ద ఉన్న టేకులపల్లి కేంద్రానికి తీసుకెళ్లింది. తనకు కేటాయించిన కేంద్రం అది కాదని తెలుసుకొని వెనుదిరిగాడు. ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి 9 నుంచి 12 గంటల వరకు ఎగ్జామ్ నిర్వహిస్తారు. కానీ వినయ్ పరీక్షాకేంద్రానికి చేరుకునే సరికి 9.20 గంటలకు పైగా అయింది. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి ంచరనే నిబంధన ఉండటంతో చేసేది లేక కన్నీరుమున్నీరవుతూ వెనుదిరిగాడు. ఈ పరీక్ష కోసం జిల్లా వ్యాప్తంగా 124 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలలు సరిపోకపోవడంతో మూడు ప్రయివేటు పాఠశాలలు, ఒక ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నెస్పీ క్యాంప్‌లోని ఓ పాఠశాల పరీక్షా కేంద్రం రూట్‌ను గూగుల్ తప్పుగా చూపించడంతో వినయ్‌కు ఈ పరిస్థితి ఏర్పడింది. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు పనిచేసేలా రెండు సెల్‌ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచారు. సమస్య ఉన్న విద్యార్థులు 99489 04023, 77939 16207 నంబర్లకు సంప్రదించాలని సూచించినా సంబంధిత విద్యార్థి గూగుల్ మ్యాప్ కారణంగా అయోమయానికి గురవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని, ముందురోజే పరీక్ష కేంద్రాన్ని చూసుకొని ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదని పరీక్ష నిర్వాహకులు అంటున్నారు.

ఆటలు

వన్డే ప్రపంచకప్ ముందు ఆటగాళ్లకు గాయాలు

టీమిండియా మేనేజ్‌మెంట్ కలవరం



నవతెలంగాణ క్రీడా ప్రతినిధి

ఈ ఏడాది ఆఖర్లో భారత్ వేదికగా ఐసీసీ వన్డే ప్రపంచకప్ జరగనున్నది. ఈ క్రమంలో టీమిండియా మేనేజ్‌మెంట్ పటిష్ట జట్టును సిద్ధం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా.. మరోవైపు ఆటగాళ్ల బెడద మేనేజ్‌మెంట్‌కు కలవరపాటుకు గురిచేస్తోంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆడిన వన్డే స్పెషలిస్ట్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ నాల్గో టెస్ట్‌లో గాయపడ్డాడు. ఈ టోర్నమెంట్‌కు ముందు భుజానికి శస్త్రచికిత్స చేయించుకొని క్రికెట్ మైదానంలోకి అడుగుపెట్టాడు. నాల్గో టెస్ట్ సందర్భంగా శ్రేయస్‌కు గాయం మళ్లీ తిరగబెట్టడంతో ఆ టెస్ట్‌లో బ్యాటింగ్‌కు దిగలేదు. అదే క్రమంలో ఆస్ట్రేలియాతో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు ఎంపికైనా.. గాయంతో వన్డే సిరీస్ నుంచి వైదొలిగాడు. ఈ నెలాఖరులో ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) కూడా ప్రారంభం కానుంది. ఈ క్రమంలో అతడు బెంగళూరులోని నేషనల్ అకాడమీలో కోలుకుంటున్న ఫిట్‌నెస్‌కు కసరత్తులు చేస్తున్నా.. ఫిట్‌నెస్ సాధిస్తేనే ఐపీఎల్ బరిలోకి దిగనున్నాడు. లేని పక్షంలో ఈ సీజన్ ఐపీఎల్‌కూ అతడు దూరమైనట్లే..

జస్ప్రీత్ బుమ్రా..

స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా దాదాపు ఏడాదిగా జాతీయ జట్టుకు దూరంగానే ఉంటున్నాడు. అందుకు ప్రధాన కారణం.. భుజానికి శస్త్ర చికిత్స చేసుకొని అతడూ ఎన్‌సీఏలోనే ఫిట్‌నెస్‌కోసం చెమటోడ్చుతున్నాడు. ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్‌కు ముందు ఫిట్‌నెస్ సాధించినా.. టీమిండియా మేనేజ్‌మెంట్ ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా అతడ్ని ఆ సిరీస్‌కు దూరంగా ఉంచింది. గత ఏడాది న్యూజిలాండ్‌తో సిరీస్ సందర్భంగా బుమ్రా భుజానికి తీవ్ర గాయం కావడంతో ఆ తర్వాత మైదానంలోకి దిగలేదు. అలాగే దీపక్ చాహర్ కూడా ఎన్‌సీఏలోనే ఫిట్‌నెస్ సాధించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. వీరితోపాటు మరో పేసర్ ప్రసిధ్ కృష్ణ కూడా వన్డే ప్రపంచకప్ జట్టు రేసులో ఉన్నా.. అతడూ గాయం పడ్డట్లు తెలిసింది. వన్డే ప్రపంచకప్ ముందు టీమిండియా జట్టులో చోటు సాధించాలంటే ఓ ఆటగాడు కనీసం 30అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాలన్న నిబంధనను టీమిండియా మేనేజ్‌మెంట్ పరిగణనలోకి తీసుకుంటే మాత్రం ప్రసిధ్ కృష్ణకు చోటు దక్కడం కష్టమే. ప్రసిధ్ కృష్ణ గత ఏడాది ఆగస్టులో జింబాబ్వేతో వన్డే సిరీస్‌లో చివరిసారిగా ఆడాడు. వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని టీమిండియా మేనేజ్‌మెంట్ సుమారు 18 నుంచి 20మంది ఆటగాళ్ల షార్ట్ లిస్ట్‌ను సిద్ధం చేస్తోంది. ఇక ఆవేశ్ ఖాన్ గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన ఆసియాకప్ టోర్నీ అనంతరం మళ్లీ జాతీయజట్టు చోటు దక్కించుకున్న దాఖలాలు లేవు.

జడేజా పునరాగమనం..

శస్త్ర చికిత్స కారణంగా ఏడాదిగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్న ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ నుంచి మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టాడు. అతడు కూడా భుజానికి శస్త్రచికిత్స చేయించుకొని చాలాకాలం జట్టుకు దూరంగా ఉండి, ఎన్‌సీఏలో ఫిట్‌నెస్ సాధించి జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈ క్రమంలో కొందరు ఆటగాళ్లు ఫిట్‌నెస్ సాధిస్తుంటే జాతీయ జట్టులోకి తిరిగి వచ్చి చేరుతుంటే.. మరోవైపు ఆటగాళ్లు గాయాలబారినపడి జట్టుకు దూరమౌతున్న పరిస్థితి ఎదురవుతోంది. గాయాలబారిన పడి జట్టుకు దూరమౌతున్న ఆటగాళ్లలో ఎక్కువమంది పేస్ బౌలర్లు ఉండడం టీమిండియా మేనేజ్‌మెంట్‌ను కలవరపాటుకు గురిచేస్తోంది.

తొలిరౌండ్‌లోనే ఓడిన సింధు

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ



లండన్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్ పివి సింధు తొలిరౌండ్‌లోనే పరాజయాన్ని చవిచూసింది. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో సింధు 17-21, 11-21తో చైనాకు చెందిన వై మింగ్ జంగ్ చేతిలో ఓడింది. తొలిగేమ్‌లో పోరాడి ఓడిన సింధు.. రెండో గేమ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఇక మహిళల డబుల్స్‌లో త్రీషా జోలీ-గాయత్రి గోపీచంద్ జోడీ రెండోరౌండ్‌లోకి ప్రవేశించింది. తొలిరౌండ్‌లో త్రీషా-గాయత్రి జోడీ 21-18, 21-14తో థాయ్‌లాండ్‌కు చెందిన ప్రజోగ్జల్-కితిహరత్కూర్‌పై వరుససెట్లలో గెలిచారు.

పేపర్ లీకేజీ కుట్ర వెనుక ఎవరున్నారో తేల్చాలి

- డీజీపీకి మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీయస్పీఎస్సీ) నిర్వహించిన అసిస్టెంట్ ఇంజినీరు (ఏఈ) పరీక్షా ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై మంత్రి కేటీఆర్ స్పందించారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ట్విటర్ వేదికగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కండువాలతో ఉన్న నిందితుడు రాజశేఖర్‌రెడ్డి ఫొటోలను రాష్ట్ర సాంకేతిక సేవల సంస్థ చైర్మెన్ పి.జగన్ ట్విటర్‌లో పోస్టు చేయగా.. దీనిపై మంత్రి కేటీఆర్ స్పందించారు. బీజేపీ రోజురోజుకీ నీచస్థాయికి దిగజారిపోతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువత జీవితాలను నాశనం చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. పేపర్ లీకేజీ కుట్ర వెనుక ఎవరున్నారో తేల్చాలని డీజీపీ అంజనీ కుమార్‌కు ఆయన ట్విటర్ ద్వారా విజ్ఞప్తి చేశారు.

25లోగా ఎఫ్‌టీఓలు ఇవ్వండి

- గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌సుల్తానియా ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన సి.సి. రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్ నిధులకు గాను ఈ నెల 25లోగా ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్.టి.ఓ.)లు జెనరేట్ చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖల ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశించారు. బుధవారంనాడాయన ఆ శాఖ కమిషనర్ హన్మంతరావు, ఇంజనీర్ ఇన్ చీఫ్ సంజీవరావుతో కలిసి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, డిఆర్డిఓలు, అదనపు డిఆర్డిఓలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. మెటీరియల్ కంపోనెంట్‌కు సంబంధించి రూ.1,400 కోట్లకుగాను రూ.700 కోట్లకే ఎఫ్.టి.ఓ. జనరేషన్ పూర్తిచేసారని చెప్పారు. మిగిలిన రూ. 700 కోట్లకు సంబంధించి పది రోజులలోగా ఎఫ్.టి.ఓ. జనరేషన్ పూర్తిచేయాలన్నారు.